అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 15-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 | సంచిక : 180 | Published from Karimnagar, Khammam, Rangareddy, Hyderabad | 12 పేజీలు | వెల : 6.50



సీపీఐ(ఎం) నుంచి ఆర్.రఘు బహిష్కరణ

పార్టీ రాజకీయ విధానం, పార్టీ కార్యక్రమంపై విభేదాలు ఉన్నాయనే నెపంతో పార్టీ విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆర్.రఘును పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి కృష్ణా జిల్లా కమిటీ బహిష్కరించింది. గతంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగాను ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని పార్టీని నష్టపరిచే చర్యలకు ఆయన పాల్పడుతున్నారు.ఆయన లేవనెత్తిన విషయాలను పార్టీ ఆయనతో చర్చించి సరిదిద్దేందుకు పలు ప్రయత్నాలు చేసింది. వాటిని సరిదిద్దుకోకపోగా పార్టీ విచ్ఛిన్న కార్యకలాపాలు తీవ్రతరం చేసినందున పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించాలని ఈ రోజు (14 ఆగష్టు) ఉయ్యూరులో జరిగిన కృష్ణా జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ఈ సమావేశానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు యం.ఏ. గఫూర్, ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

25 కంపెనీలతో ఒప్పందాలు..
రూ.36 వేల కోట్ల పెట్టుబడులు...

- సీఎం రేవంత్ విదేశీ పర్యటన జయప్రదం
- ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించామన్న ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా సాగిన ముఖ్యమంత్రి రేవంత్ విదేశీ పర్యటన జయప్రదమైంది. గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణకు పెట్టుబడులు భారీగా వెల్లువెత్తాయని ప్రభుత్వం ఈ సందర్భంగా వెల్లడించింది. రేవంత్ బృందం మొత్తం 25 కంపెనీలతో ఒప్పందాలు చేసుకోగా, రూ.36 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) తెలిపింది. రేవంత్ అమెరికా పర్యటనలో రూ.31,502 కోట్ల పెట్టుబడులు రాగా.. చివరి రెండు రోజుల దక్షిణ కొరియా పర్యటనలోనూ అదే రకమైన స్పందన వచ్చింది. దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచస్థాయి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. రూ.4,500 కోట్ల పెట్టుబడులకు అక్కడి కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో కలిపి మొత్తం రూ.36 వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. ఫలితంగా ఆయా రంగాల్లో కొత్త సంస్థలు, కొత్త పరిశ్రమలతో వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

కాగా సీఎం రేవంత్ గత జనవరిలో దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో సైతం పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రంలో రూ.40,232 కోట్ల పెట్టుబడులకు పలు కంపెనీలు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. తాజాగా అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో మరో రూ.36 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రూ.76,232 కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకున్న ప్రభుత్వం సరికొత్త రికార్డును నమోదు చేసింది. తద్వారా దేశంలోనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన తెలంగాణ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

కంపెనీలకు సీఎం భరోసా...

దక్షిణ కొరియాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బృందం ప్రధానంగా ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఇంధన స్టోరేజీ, టెక్స్‌టైల్ రంగాలపై దృష్టి సారించింది. ఆయా రంగాల్లో దక్షిణ కొరియాకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా పలు కంపెనీలతో సీఎంతోపాటు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చర్చలు, సంప్రదింపులు జరిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించి, రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలని ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీలకు తమ ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. దీంతో అమెరికన్ కంపెనీల తరహాలోనే కొరియన్ కంపెనీల నుంచి భారీ స్పందన లభించింది.

గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

సీఎం చర్చలతో హ్యుందాయ్ మోటార్స్ తెలంగాణలో మెగా ఆటోమోటివ్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. తమ కంపెనీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయటం ద్వారా గ్లోబల్ హబ్‌గా ఎంచుకుంటామని ప్రకటించింది. కొత్త టెస్టింగ్ వాహనాలను తయారు చేసే సదుపాయం తెలంగాణలో అందుబాటులో ఉంటుందంటూ ఆ సంస్థ సంతృప్తిని వ్యక్తం చేసింది.

ఫ్యాషన్ సిటీకి పదెకరాల కేటాయింపు

వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో వస్త్ర తయారీ పరిశ్రమలను నెలకొల్పుతున్న యంగ్‌వన్ కంపెనీ హైదరాబాద్‌లో ఫ్యాషన్ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అందుకు అవసరమయ్యే పదెకరాల స్థలాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీనిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం తరఫున సమ్మతిని తెలుపుతూ ఆయన ఒక లేఖను యంగ్‌వన్ కంపెనీ చైర్మెన్‌కు అందజేశారు.

'కాస్మొటిక్స్'కు పరస్పర సహకారం

కాస్మొటిక్స్ ఇండస్ట్రీలో దక్షిణ కొరియాకు ప్రత్యేక స్థానముంది. ఆ రంగంలో పేరొందిన కంపెనీల పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి అక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాస్మొటిక్స్ తయారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుగా పరస్పర సహకారాన్ని ఆయన కోరారు. తెలంగాణలో వీటి తయారీకి ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలను అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కొరియన్ బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఇతర కంపెనీల ప్రణాళికలు...

ఇదే సందర్భంగా మరో మూడు కొరియన్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ప్రణాళికలను ప్రకటించాయి. డాంగ్‌బాంగ్ ఫార్మా కంపెనీ రూ. 200 కోట్ల పెట్టుబడితో ఏపీఐ తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పుతామని ప్రకటించింది. జేఐ టెక్ కంపెనీ ఎల్ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్‌తోపాటు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ.100 కోట్ల పెట్టుబడులు పెడతామంటూ ఆ సంస్థ ప్రకటించింది. చావి కంపెనీ హైదరాబాద్‌లో ఈవీ ఛార్జింగ్ ఇన్‌ఫ్రాని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది.

చర్చలు.. భవిష్యత్ ప్రణాళికలు...

ఎల్ఎస్ గ్రూప్, పోస్కో, ఎల్జీ, శ్యామ్‌సంగ్, సీ అండ్ టీ, శ్యామ్‌సంగ్ హెల్త్‌కేర్, క్రాఫ్టన్, యూయూ ఫార్మా, జీఎస్ కాల్టెక్స్ కంపెనీల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. భవిష్యత్ విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణను పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ఎంచుకోవాలని సీఎం ఆయా కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

తమ పర్యటనలో భాగంగా కొరియాలోని చెంగియాచియోన్ స్ట్రీమ్ రీడెవలప్‌మెంట్, హాన్ రివర్‌ఫ్రంట్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. అక్కడ అనుసరించిన కొన్ని అద్భుతమైన నమూనాలను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం వాటిని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం నిర్ణయించారు. ఆయా ప్రాజెక్టుల అభివృద్ధికి అనుసరించిన విధానాలు, వాటిని నిర్వహిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఇటీవల నిర్వహించిన ఒలింపిక్స్‌లో విజేతలైన వారిలో ఎంతోమందిని ఆ వర్సిటీ తీర్చిదిద్దింది. మన రాష్ట్రంలోనూ అదే తరహాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు సీఎం యోచిస్తున్నారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విషజ్వరాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులు వర్షాలు కురుస్తున్నాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల్లో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో రోగులు కిక్కిరిసిపోతున్నాయని పేర్కొన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అక్కడక్కడా మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక ఏజెన్సీ, మారుమూల ప్రాంతాలు, మురికివాడల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రాధాన్యతనిచ్చి అవసరమైన సిబ్బంది, మందులను అందించాలనీ, మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

ఫార్మాతో హైదరాబాద్‌కు పెను ప్రమాదం

అభివృద్ధి పేరుతో కమ్మేస్తున్న కాలుష్యం

- నివారణ చర్యలు చేపట్టాలి : 'ఒక విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఫార్మా కంపెనీలతో హైదరాబాద్ నగరానికి పెను ప్రమాదం పొంచి ఉందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ చంద్రశేఖర శర్మ రాసిన "ఒక విధ్వంసం 1056/90" పుస్తకావిష్కరణ సభను బుధవారం హైదరాబాద్‌లోని ఓ హెూటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మనిషి సృష్టిస్తున్న విధ్వంసం పర్యావరణానికి పెను సవాలుగా మారిందని పేర్కొన్నారు. పటాన్‌చెరు కాలుష్య వ్యతిరేక పోరాట ఘటనలు, సుప్రీంకోర్టు కేసు పరిణామాలను గ్రంథస్థం చేస్తూ తీసుకొచ్చిన ఈ పుస్తకం హైదరాబాద్ భవిష్యత్‌ను ప్రశ్నిస్తున్నదని పేర్కొన్నారు. కాలుష్య సమస్య పటాన్‌చెరు, ఖాజీపల్లిది మాత్రమే కాదనీ, మొత్తం నగరాన్ని ఈ భూతం చుట్టి ముట్టిందన్నారు. ఇదే చివరి తరమనే విధంగా మనిషి అన్ని వనరులను తవ్వేస్తూ ప్రకృతిని బొందల గడ్డగా మారుస్తున్నాడని విశ్లేషించారు. జీడీపీ, అభివృద్ధి అంటూ ప్రభుత్వాలు వినాశకర విధానాలను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. గత సర్కార్ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ లాగే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టుబడుల పేరిట దావోస్, ఇతర యూరప్ దేశాలకు వెళ్లి అదే ఫార్మా కంపెనీలను తీసుకొస్తున్నారని విమర్శించారు. అమెరికా లాంటి దేశాలు ఇలాంటి కంపెనీలకు అనుమతులు ఇవ్వక పోవడంతో అవి హైదరాబాద్ నగరాన్ని ఎంచుకున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ దేశంలో కాలుష్యం వెదజల్లే ఔషధాలను ఉత్పత్తి చేయకుండా భారత్ లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ రోగాలను మనకంటగడుతున్నాయని వ్యాఖ్యానించారు. మందుల కంపెనీలు మనుషులను చంపే కంపెనీలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గత మూడు దశాబ్దాలుగా పటాన్‌చెరు ప్రాంత ప్రజలు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నా, నగర ప్రజలు తమకేమి పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పౌర సమాజం ఈ మహమ్మారికి వ్యతిరేకంగా నినదించాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర జ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు వచ్చినంత స్పందన పర్యావరణ ఉద్యమాలకు రావడం లేదని అన్నారు. ప్రజలు ప్రత్యక్షంగా తమదాకా వస్తేగాని నోరుమెదపని అచేతనావస్థలోకి జారి పోయారని వ్యాఖ్యానించారు. ఎవరైనా నిలదీస్తే వారిపై అభివృద్ధి నిరోధకులంటూ ముద్ర వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ విజయ్ మాట్లాడుతూ ఫార్మా కెమికల్ కంపెనీలు వెదజలుతున్న కాలుష్యం మూసీ ద్వారా మొత్తం నగరాన్ని చుట్టిముట్టిందని అన్నారు. మూసీ కాలుష్యంపై స్వీడిష్ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో భయంకరమైన నిజాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. మనుషుల రోగాలకు కారకమయ్యే బ్యాక్టీరియా మూసీ రసాయనాలతో సహవాసం చేసి రోగనిరోధక శక్తిని పెంచుకుందని వెల్లడైందని వివరించారు. దీంతో భవిష్యత్‌లో రోగాలు ఎలాంటి మందులకు కూడా లొంగని పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. పర్యావరణ శాస్త్రవేత్త బాబురావు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం వెదజల్లే కంపెనీలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. బాధితులు ఫిర్యాదులు చేసిన సందర్భంలో నామ మాత్రంగా కేసులు నమోదు చేసి చిన్న పాటి పెనాల్టీలతో సరి పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి కవుల, సుధా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన శాఖకు మంత్రిని కేటాయించాలి

- సీఎం వద్ద ఉంటే సామాన్యులు కలిసేదెలా...
- చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను ప్రకటించాలి... లేదంటే ప్రత్యక్ష పోరాటాలు చేపడతాం : తెలంగాణ గిరిజన సంఘం రౌండ్‌టేబుల్‌లో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉంటే సామాన్యులు ఆయన్ను ఎలా కలవాలని పలువురు నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన శాఖకు మంత్రి కేటాయించకపోవడం సామాజిక వివక్ష చూపడమేనని విమర్శించారు. తక్షణమే ఆ శాఖకు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అందుకోసం ప్రభుత్వం తగిన కార్యాచరణను ప్రకటించాలని సూచించారు. లేదంటే ప్రత్యక్ష పోరాటాలకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అనేక హామీలివ్వడం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. తొమ్మిది నెలలైనా గిరిజన శాఖకు మంత్రిని కేటాయించలేదని చెప్పారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి ఎస్టీ కమిషన్‌ను వేరు చేసి చైర్మెన్‌ను నియమించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉండడంతో సమస్యలను చెప్పేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అంబేద్కర్ అభయహస్తం కింద గిరిజనులకు రూ.12 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. మంత్రిని కేటాయించకుండా, సమస్యలను పరిష్కరించకుండా ఉంటే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబాల్ నాయక్, బీఆర్ఎస్ గిరిజన విభాగం సీనియర్ నాయకులు రూప్ సింగ్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రాజేష్ నాయక్, గుగులోత్ భీమా నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు కురాకుల శ్రీనివాస్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఉపాధ్యక్షులు పాతపల్లి నరసింహ, ప్రొఫెసర్ బాలా నాయక్, తెలంగాణ గిరిజన జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్, డాక్టర్ జి శంకర్, సోమలాల్ జాదవ్, సేవాలాల్ సేన నాయకులు రఘురాం రాథోడ్, మధు నాయక్ సేవాలాల్ సేన టీవీ మోహన్, గిరిజన సంస్కృతి ఎడిటర్ ఆర్ ధర్మానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మ్యానిఫెస్టోలో 16 రకాల వాగ్దానాలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారని చెప్పారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం ప్రజా ప్రభుత్వంలో గిరిజనులకు భాగస్వామ్యం లేకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లా వైరాకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారనీ, గిరిజన శాఖ మంత్రిని నియమిస్తామంటూ ఈ సందర్భంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలని కోరారు. లేదంటే రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ సంఘాలతో ఐక్య కార్యాచరణ ఏర్పాటు చేసి ప్రత్యక్ష పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎం బాలు, రఘు, గోపి, రామ్ కుమార్, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలు మరో అడుగు ముందుకెయ్యాలి

- మహిళా రక్షణలో సర్కారుకు చేయూతనివ్వాలి
- ఆర్థిక అభ్యున్నతిలో వాటి పాత్ర అమోఘం
- ఎగతాళి చేసేవారికి మహిళా సంఘాలే బుద్ధి చెప్పాలి
- స్త్రీనిధి భవన నిర్మాణానికి హైదరాబాద్‌లో స్థలం : స్త్రీనిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్/రాజేంద్రనగర్

ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించేలా మహిళా సంఘాలు మరో అడుగు ముందుకెయ్యాలనీ, మహిళా భద్రత కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో అవి కీలక పాత్ర పోషించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. బ్యాంకు మెట్లెక్కాలంటే భయపడే స్థాయి నుంచి బ్యాంకులకు, ప్రభుత్వ సంస్థలకు రుణాలిచ్చే స్థాయికి మహిళా సంఘాలు ఎదిగాయని కితాబిచ్చారు. స్త్రీనిధి భవన నిర్మాణం కోసం హైదరాబాద్‌లో స్థలం కేటాయించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ 11వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..గతంలో ప్రయివేటు వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అవసరాల కోసం అప్పులు చేసి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తుచేశారు. వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కొప్పుల రాజు వంటి ఉన్నతాధికారులు స్త్రీనిధి ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మైక్రోఫైనాన్స్ అప్పులు వద్దనీ, స్త్రీనిధి రుణాలు ముద్దని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆకాంక్షించారు. మహిళల ఆర్థిక ప్రగతే ఆ సమాజ ప్రగతి అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పారని, ఆ మహనీయుడి ఆలోచనల్ని తమ ప్రభుత్వం ఆచరిస్తున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం మహిళలకోసం రూ.500 కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంవంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని అవహేళన చేస్తూ కొందరు వీడియోలు రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతను తట్టుకోలేకే ఆ స్కీంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు చేయూతగా నిలిస్తే ఎందుకంత అక్కసు వెళ్లగక్కుతున్నారని ఫైర్ అయ్యారు. మహిళా సంక్షేమ పథకాలను ఎగతాళి చేస్తున్న వారికి మహిళలే బుద్ధి చెప్పాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని హామీనిచ్చారు.

అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పిన తర్వాత పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను మహిళా సంఘాలకు అప్పజెప్పామనీ, జత కుట్టు కూలీని రూ. 50 నుంచి రూ. 70 పెంచామని వివరించారు. మహిళా శక్తి క్యాంటీన్‌లను జిల్లాలకు విస్తరిస్తామని హామీనిచ్చారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ డిమాండ్ చేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించడం ద్వారా అవన్నీ పరిష్కారమయ్యేలా చూస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 122 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకొచ్చిన రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాలు గురువారం ముగిశాయి. ఆ సంఘం అధ్యక్షులు సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి ఎ శ్రీకుమార్‌తోపాటు 24 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఐదేండ్లకు ఒకసారి వేతన సవరణ జరగాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలన్నారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 15-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 180
Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam
12 పేజీలు వెల : 6.50

9వ వార్షికోత్సవం

గొంతులేని వారి గొంతుక

నవతెలంగాణ తొమ్మిదో వార్షికోత్సవ శుభ సందర్భంగా పత్రికా నిర్వహణ బందానికి శుభాకాంక్షలు, అభినందనలు. గొంతులేని ప్రజల గొంతుకగా తన అక్షర ప్రస్థానాన్ని అపూర్వంగా కొనసాగిస్తున్న ఈ పత్రిక నవతెలంగాణ. నేను, నా కలం అట్టడుగు, శ్రామిక వర్గాల అభ్యున్నతికే కషి చేశాయి. ముని మనవడు నాటకమైనా, ఊరబావి కథైనా, రంధినవలైనా, సాహిత్య విమర్శ అయినా, కవిత్వమైనా... సామాన్యుని జీవితాన్ని ప్రతిబింబించేవే. నేను అభ్యుదయ నవ సాహిత్యానికి కట్టుబడి ఉండటానికి నాటి ప్రజాశక్తి, నేటి నవ తెలంగాణ పత్రికలు నాకు నిత్యం ప్రేరణగా నిలిచాయి.

\- ఇనాక్ కొలకలూరి



ముస్తాబైన ఎర్రకోట

పంద్రాగస్టుకు కట్టుదిట్టమైన భద్రత

ఆరు వేల మంది ప్రత్యేక అతిథులకు ఆహ్వానం

ఆయా రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి

2 వేల మంది సంప్రదాయ వేషధారణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

78వ స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు ఢిల్లీలోని ఎర్రకోట ముస్తాబైంది. ఈ వేడుకలకు దాదాపు ఆరు వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ చెక్‌పాయింట్లు పెట్టారు. ఇంటెలిజెన్సీ ఆదేశాల మేరకు వాహనదారులను విస్తతంగా తనిఖీ చేస్తున్నారు. రోడ్లపై భారీ స్థాయిల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీలో భారీగా భద్రతా బలగాలు మోహరించాయి.వివిధ రంగాల్లో రాణించిన, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారిలో కొందరిని కేంద్రం ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న దేశ క్రీడాకారులకూ ఆహ్వానం పంపింది. దాదాపు 400 మంది పంచాయతీరాజ్ సంస్థల మహిళా ప్రతినిధులను ...10లో

రాష్ట్రాలకే రాయల్టీ హక్కు



2005 నుంచి గనులు, ఖనిజ భూములపై బకాయిలు అడగొచ్చు : సుప్రీం స్పష్టీకరణ

- జులై 25 నుంచి అమలు చేయాలన్న కేంద్రం..తిరస్కరించిన సుప్రీం
- ఫెడరలిజం పరిరక్షణకు కేంద్రం జోక్యం ఉండకూడదు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గనులు, ఖనిజ భూములపై రాయల్టీ వాపస్ విషయంలో అత్యున్నత న్యాయస్థానంలో రాష్ట్రాలకు భారీ విజయం దక్కింది. 2005 ఏప్రిల్ 1 నుంచి రాయల్టీ బకాయిలను కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రాలు కోరవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. రాయల్టీపై ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఈ ఏడాది జులై 25 నుంచే అమలు చేయాలన్న కేంద్రం అభ్యర్థనను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. కేంద్రం, గనుల కంపెనీలు ఇవ్వాల్సిన బకాయిలను రానున్న 12 ఏండ్లలో దశల వారీగా చెల్లించాలని స్పష్టం చేసింది. అలాగే.. వీటిపై ఎలాంటి పెనాల్టీలు విధించొద్దని రాష్ట్రాలను ఆదేశించింది. ధర్మాసనం 1957 నాటి మైన్స్ అండ్ మినరల్స్ (అభివృద్ధి, నియంత్రణ) చట్టం నుంచి స్వతంత్రంగా మైనింగ్ ...11లో

ఎమ్మెల్సీల నియామకాన్ని నియంత్రించలేం

గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేం : దాసోజు శ్రవణ్ కుమార్, సత్యనారాయణ పిటిషన్‌పై సుప్రీం

వివరాలు 11లో

ప్రపంచంతోనే పోటీ

పదేండ్లలో రూ.లక్షకోట్ల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఫ్యూచర్ సిటీదే భవిష్యత్ :

కాగ్నిజెంట్ క్యాంపస్

ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పారిశ్రామికాభివృద్ధిలో ప్రపంచంతోనే తాము పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే పదేండ్లలో తెలంగాణ రూ.లక్షకోట్ల ఆర్థికాభివృద్ధి సాధించాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఆయన బుధవారంనాడిక్కడి కోకాపేటలో కాగ్నిజెంట్ సంస్థ నూతన క్యాంపస్‌ను ప్రారంభించారు. ప్రపంచ అవసరాలు తీర్చేలా అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు 430 సంవత్సరాల చరిత్ర ఉందనీ, ఈ నగర వ్యవస్థాపకుడు కులీకుతుబ్ షా నుంచి తన వరకు ఎవరు పాలించినా, వ్యవస్థలు మారినా, విధానాలతో సంబంధం లేకుండా అందరూ దీని అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారగానే ఇక్కడి నుంచి పెట్టుబడులు అక్కడి తరలిపోతాయనే చర్చను కొందరు ప్రారంభించారనీ, కానీ తన పోటీ పొరుగురాష్ట్రాలతో కాదనీ, ప్రపంచంతోనే అని స్పష్టం చేశారు. 1992లో ఐటీ పరిశ్రమలకు నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తే, ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి దాని అభివృద్ధిని కొనసాగిస్తూ, సైబరాబాద్ నిర్మించారని తెలిపారు. తాము నూతనంగా నిర్మించబోయే భవిష్యత్ సిటీలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ జరుగుతుందని స్పష్టం చేశారు. పదిరోజుల తన విదేశీ పర్యటనలో రూ.31,500 కోట్ల పెట్టుబడులు పెట్టి, 30,750 మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించేలా ఒప్పందాలు జరిగాయన్నారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు జరుగుతాయనీ, పెట్టుబడులకు సంబంధించి సమావేశాల నిర్వహణ కోసం ఇన్వెస్టర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కాగ్నిజెంట్ సంస్థ విస్తరణకు ప్రభుత్వం తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్ గుర్తింపు పొందిందనీ, 2002లో హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ సంస్థ లక్ష మందికిపైగా ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. తాము నిర్మించే భవిష్యత్ (ఫ్యూచర్) సిటీలో కూడా కాగ్నిజెంట్ ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రం, దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే పారిశ్రామిక విధానం పారదర్శకంగా ఉండాలని, పెట్టుబడిదారులను ప్రోత్సహించే విధానం ఉండాలని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని తెలిపారు. అందుకే ప్రభుత్వం మారినా విధానాల్లో మార్పు చేయలేదనీ, ఇంకా వేగంగా, పారదర్శకంగా, పట్టుదలతో తాము పనిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్ నగరం ఒక్క రోజులో అభివృద్ధి చెందలేదనీ, అంచలంచలుగా ఎదుగుతూ వచ్చిందని చెప్పారు. దావోస్ పర్యటనలో తాము కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కాగ్నిజెంట్ అమెరికన్ ప్రెసిడెంట్, ఈవీపీ సూర్య గుమ్మడితో క్యాంపస్ విస్తరణపై చర్చించామన్నారు. కేవలం ఆరునెలల్లోనే వారు స్పందించి ఇక్కడ క్యాంపస్ విస్తరణ పూర్తి చేసి, మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ వంటి విభిన్న రకాల ప్రతిభను అన్వేషిస్తున్నదనీ, దానికి అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాగ్నిజెంట్ ఈవీపీ, కాగ్నిజెంట్ అమెరికాస్ ప్రెసిడెంట్ సూర్య గుమ్మడి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే, దానిలో భారతదేశంలో 2.40 లక్షల మంది, ...11లో

తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ



ప్రకటించిన కాంగ్రెస్... 11లో..

ఎన్నిక లాంఛనమే

హిమాచల్‌లో భంగపడి, తెలంగాణకు..

25 కంపెనీలతో ఒప్పందాలు

రూ.36 వేల కోట్ల పెట్టుబడులు...


సీఎం రేవంత్ విదేశీ పర్యటన జయప్రదం

ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించామన్న ప్రభుత్వం 2లో..

సీఎం బృందానికి ఘన స్వాగతం

పన్నెండు రోజుల విదేశీ పర్యటనను ముగించుకుని బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ బృందానికి శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సీఎం బృందంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి ...11లో

వినేశ్ ఫోగట్‌కు నిరాశే..



అనర్హత పిటిషన్ తిరస్కరణ



పారిస్ : ఒలింపిక్స్ పోటీల్లో భాగంగా రెజ్లింగ్‌లో తనపై విధించిన అనర్హతను సవాలు చేస్తూ వినేశ్ ఫోగట్ చేసిన అభ్యర్థనను కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తిరస్కరించింది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం కొట్టివేసింది. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ 50 కేజీల విభాగంలో 100 గ్రాములు అదనంగా బరువు ఉందని వినేశ్‌పై అనర్హత వేటు పడింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేయడంతోపాటు ఫైనల్లో ఓడిన లోపెజ్ (క్యూబా)తో కలిసి తనకు రజత పతకం ఇవ్వాలని వినేశ్ అప్పీలు చేసింది. కాస్ తీర్పు వచ్చేదాకా పారిస్‌లోనే ఉండాలని ఫోగట్ నిర్ణయించింది. అయితే తీర్పు వ్యతిరేకంగా రావటంతో..ఆమె ఏ విధంగా ముందుకెళ్తారన్న దానిపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఐరాసలో భారత రాయబారిగా పర్వతనేని హరీశ్



న్యూఢిల్లీ: తెలుగు వ్యక్తి అరుదైన ఘనత సాధించారు. ఐఎఫ్ఎస్ అధికారి పర్వతనేని హరీశ్ న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితిలో భారత రాయబారి/ శాశ్వత ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. 1990 క్యాడర్ ...11లో

మహిళలపై దాడుల నిరోధానికి కఠిన చట్టాలు

పాఠశాల స్థాయిలోనే నైతిక విలువలు నేర్పాలి : గాంధీలో డాక్టర్ల నిరసనకు మంత్రి సీతక్క సంఘీభావం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల భద్రతకు మరింత కఠిన చట్టాలను రూపొందించి అమలు చేస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. అదే సమయంలో దాడుల నిరోధానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని అభిప్రాయ పడ్డారు. తరగతి గదుల నుంచే పిల్లలకు నైతిక విలువలను, మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించాలని సూచించారు. అందుకోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ...11లో

కోల్‌కతా హత్యాచార ఘటనపై దర్యాప్తు షురూ

రంగంలోకి సీబిఐ,ఎఫ్ఎస్ఎల్ 11లో..

అసమ్మతి, విద్వేషాన్ని పారదోలాలి

విచ్ఛిన్నకర ధోరణులను తిరస్కరించాలి..సమాజంలో అందరినీ కలుపుకుని పోవాలి

78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు



న్యూఢిల్లీ : సమాజంలో పాతుకుపోయిన పలు సామాజిక వ్యవస్థల్లోని విచ్ఛిన్నకర ధోరణులను తిరస్కరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపిచ్చారు. దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె బుధవారం రాత్రి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అందరినీ కలుపుకుని పోయేందుకు నిర్ణయాత్మక చర్యలను బలోపేతం చేయాల్సిన అవసరం వుందని నొక్కి చెప్పారు. భారతదేశంలో రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరమైన పురోగతిని ఆమె ప్రముఖంగా పేర్కొంటూ, సామాజిక ప్రజాస్వామ్యం దిశగా ముందుకెళ్ళడాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. వైవిధ్యత, బహుళత్వం విషయంలో దేశం వృద్ధి చెందుతూ సమగ్ర దేశంగా ముందుకు సాగుతోందన్నారు. సామాజిక న్యాయం అనేది నరేంద్ర మోడీ ప్రభుత్వానికి అత్యధిక ప్రాధాన్యత కలిగిన అంశమని, ఎస్‌సి, ఎస్‌టిలు, ఇతర వెనుకబాటుకు గురైన వర్గాల అభ్యున్నతికి మోడీ సర్కార్ అనూహ్య రీతిలో చర్యలు తీసుకుంటోందని చెప్పారు. 'సామాజిక ప్రజాస్వామ్యం పునాదిగా లేకపోతే రాజకీయ ప్రజాస్వామ్యానికి తావు లేదు.' అన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వ్యాఖ్యలను ఆమె ఉటంకించారు. రాజకీయ ప్రజాస్వామ్యం నిలకడగా ...10లో

మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

కేజ్రీవాల్ కేసులో సుప్రీం స్పష్టం

సీబీఐకి నోటీసులు జారీ

23కు విచారణ వాయిదా



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

మద్యం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బుధవారం చుక్కెదురైంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీబీఐ అరెస్టుపై కేజ్రీవాల్ పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అంగీకరించింది. ఈ మేరకు ఆయన పిటిషన్‌పై సీబీఐకి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై సీబీఐ ప్రతిస్పందన ...11లో

కేరళకు హై అలర్ట్



రానున్న 72 గంటల్లో విస్తారంగా వర్షాలు : ఐఎండీ హెచ్చరిక 11లో..

జీకేఆర్ వర్సెస్ ఏఎమ్ఆర్

ఎమ్మెల్యేలను లైట్‌గా తీసుకుంటున్న కిషన్‌రెడ్డి!

బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కేంద్ర మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి మధ్య అసలు పొసగడం లేదా? ఆయన పదేపదే ప్రెస్‌మీట్లు పెట్టడం జీకేఆర్‌కు నచ్చడం లేదా? అందుకే ఏలేటి తన అడ్డాను బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి అసెంబ్లీకి మార్చుకున్నారా? ఉన్నదే ఎనిమిది మంది ఎమ్మెల్యేలు.. వారిలోనూ సఖ్యత కొరవడిందా? అసెంబ్లీ సమావేశాలను రాష్ట్ర అధిష్టానం లైటుగా తీసుకున్నదా? "ప్రశ్నిస్తున్న తెలంగాణ" కార్యక్రమానికి ఎమ్మెల్యేలు హాజరు కాకపోయినా కిషన్‌రెడ్డి పెద్దగా పట్టించుకోలేదా? పార్టీ పిలుపులను పట్టించుకోకుండా ..ముగ్గురు ఎమ్మెల్యేల బృందం సుంకిశాలకు పోవడం వెనుకున్న ఆంతర్యమేమిటి? మిగతా వారు ఎందుకు పోలేదు? వంటి ప్రశ్నలు, సందేహాలన్నీ ఆ పార్టీలో తారాస్థాయికి చేరుకున్న అంతర్గత పోరుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

- బీజేపీ ఆఫీసు నుంచి అసెంబ్లీకి అడ్డా మార్చిన ఏలేటి
- పార్టీ పిలుపును పక్కనబెట్టి సుంకిశాలకు ముగ్గురు ఎమ్మెల్యేలు
- మా దారి మాదే అంటున్న మిగతా ఎమ్మెల్యేలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్నారు. ఒక్క రాజాసింగ్ మినహా అందరూ తొలిసారి ఎన్నికైన వారే. రాజాసింగ్‌కు ఆ పార్టీలో రాష్ట్రస్థాయి నాయకులతో ఉన్న విభేదాలు, తెలుగులో మాట్లాడలేరనే కారణంతో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వైపు జాతీయ నాయకత్వం మొగ్గుచూపింది. ఆయన కూడా యాక్టివ్‌గానే ఉన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వరుసగా ప్రెస్‌మీట్లు పెడుతూ హడావిడి చేశారు. ఆ తర్వాత ఏమైందో ఏమోగానీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ప్రెస్‌మీట్లు పెట్టడం లేదు. తన అడ్డాను బీజేపీ ఆఫీసు నుంచి అసెంబ్లీలోని బీజేపీ ఎల్పీ కార్యాలయానికి మార్చుకున్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌ను తన ప్రెస్‌మీట్లకు వాడుకుంటున్నారు. దీని వెనుక కిషన్‌రెడ్డికి, ఆయనకు మధ్యలో చెడటమే కారణమని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. కిషన్‌రెడ్డి తీరు పట్ల మొదటి నుంచీ ఎమ్మెల్యేలు గుర్రుగానే ఉన్నారు. తాము గెలవగానే కనీసం విష్ చేయలేదనే ఆక్రోశాన్ని కూడా ఒకరిద్దరు ఎమ్మెల్యేలు సన్నిహితులు, మీడియా ప్రతినిధుల వద్ద వెళ్లగక్కుకున్నారు. గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. కేంద్ర మంత్రి ఆ సమయంలో గవర్నర్‌కు తమను కనీసం పరిచయం చేయకపోవడంపై ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర పదాధికారుల ...11లో

సంపాదకీయం

పెట్టుబడుల లోగుట్టు...



పన్నెండు రోజుల విదేశీ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలోని బృందం బుధవారం హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు ఆ టీమ్‌కు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించేందుకు, తద్వారా ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన సీఎం పర్యటన జయప్రదంగా ముగియటం హర్షణీయం. అయితే లోగుట్టు పెరుమాళ్లకెరుక అన్నట్టు పెట్టుబడులను ఆకర్షించేందుకోసమంటూ విదేశాలు పట్టుకు తిరుగుతున్న మన పాలకుల ఆర్భాట ప్రచారాలు, ప్రకటనలు వాస్తవంలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అయినా, తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్, రేవంత్‌ల పరిస్థితి అయినా ఇదే. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం లోని బృందం అమెరికాకు పయనమైంది. ఎనిమిది రోజులపాటు అక్కడ పర్యటించిన ఆయన టీమ్, ఆ తర్వాత దక్షిణ కొరియాకు కూడా వెళ్లింది. మొత్తం మీద ఆ రెండు దేశాల్లో 50కి పైగా భేటీలు, మూడు రౌండ్‌టేబుల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ పర్యటనల ద్వారా రూ.31,532 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించామని ప్రభుత్వం వెల్లడించింది. 19 కంపెనీలతో చేసుకున్న వివిధ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలో 30,750 కొత్తఉద్యోగాలు లభించ నున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ప్రకటించింది. ఇవిగాక గత జనవరిలో దావోస్‌లో పర్యటించిన సీఎం...రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయంటూ ప్రకటించారు. ఫిబ్రవరి నుంచి జులై వరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాల విలువ మరో రూ.9,800 కోట్లంటూ పరిశ్రమల శాఖ లెక్కలేసింది.

ఇందుకు సంబంధించి మనం కొద్దిగా వెనక్కెళ్లి గతంలోకి తొంగిచూస్తే పాలకుల ప్రచారార్భాటాల్లోని డొల్లతనాన్ని అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొలిసారి సీఎం అయ్యాక 2015లో చైనాలో పది రోజులపాటు పర్యటించారు. సెల్‌కాన్, మకనో, షాంఘై ఎలక్ట్రిక్ కార్పొరేషన్, లియో గ్రూప్ తదితర కంపెనీలతో ఆయన పలు ఒప్పందాలు చేసుకున్నారు. తద్వారా రూ.1,160 కోట్ల మేర పెట్టుబడులు వస్తాయంటూ ఊదర గొట్టారు. కానీ వీటిలో ఒక్క సెల్‌కాన్ సంస్థ తప్ప మరే కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టకపోవటం గమనార్హం. అది కూడా కేవలం రూ.160 కోట్ల విలువైన యూనిట్ మాత్రమే నెలకొల్పటం కొసమెరుపు. అదే బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రిగా కేటీఆర్... దావోస్‌లో 2022లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొని, రూ.4,200 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించినట్టు ప్రకటించారు. రూ.322 కోట్లతో హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో తెలంగాణ మొబిలిటీ వ్యాలీని జర్మనీకి చెందిన జడ్.ఎఫ్. అనే కంపెనీ స్థాపించబోతోందని ఆయన అప్పట్లో వెల్లడించారు. ఇలాంటి ఒప్పందాలు, ఉద్యోగాల కల్పనలన్నీ ఆ తర్వాత అనుకున్నంత స్థాయిలో సఫలీకృతం కాలేదన్నది అనుభవంలో తేలిన విషయం.

చంద్రబాబు హయాంలోనూ వివిధ విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ అవన్నీ మన నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో కొలువులు కల్పించలేకపోయాయి. ఐటీరంగం ద్వారా ఏటా దాదాపు పది వేల ఉద్యోగాలను సృష్టిస్తామంటూ అప్పట్లో ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో అది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దేశంలోనూ, అన్ని రాష్ట్రాల్లోనూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది పాలకుల తారకమంత్రం. పెట్టుబడికి ఆంక్షలులేని స్వేచ్ఛనిచ్చిన తర్వాత, మోడీసర్కార్ చట్టాలన్నింటినీ మార్చిపారేస్తున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల బతుకులు బాగుపడేదేముంది?

> చంద్రబాబు హయాంలోనూ వివిధ విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ అవన్నీ మన నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో కొలువులు కల్పించలేకపోయాయి. ఐటీరంగం ద్వారా ఏటా దాదాపు పది వేల ఉద్యోగాలను సృష్టిస్తామంటూ అప్పట్లో ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో అది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. దేశంలోనూ, అన్ని రాష్ట్రాల్లోనూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది పాలకుల తారకమంత్రం. పెట్టుబడికి ఆంక్షలులేని స్వేచ్ఛనిచ్చిన తర్వాత, మోడీసర్కార్ చట్టాలన్నింటినీ మార్చిపారేస్తున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల బతుకులు బాగుపడేదేముంది?

ఇక్కడో విషయాన్ని మనం గమనించాలి. దేశంలోగానీ, మన రాష్ట్రంలోగానీ ఇప్పటికీ 60 నుంచి 70 శాతం మంది ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల మీద ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఆ రంగంలో యాంత్రీకరణ పెరగటంతో ఉపాధి అవకాశాలు నానాటికీ సన్నగిల్లుతున్నాయి. ఫలితంగా ప్రజలు పనుల కోసం ఊళ్లొదిలిపెట్టాల్సిన దుస్థితి. ఈ క్రమంలో ఒక రాష్ట్రంలో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఈ వలసలు పెరిగిపోతున్నాయి. అంతిమంగా ఇది అనేక సమస్యలకు కారణమవుతోంది. కరోనాలాంటి విపత్కర సమయాల్లో సైతం అనేక రంగాల్లో ఉద్యోగులను గాలికొదిలేస్తే, వారిని ఆదుకున్నది, అక్కున చేర్చుకున్నది వ్యవసాయరంగమే. అందువల్ల ప్రభుత్వాలు పెట్టుబడులను ఆకర్షించటంతోపాటు 'సాగు'ను బహు'బాగు' చేయటం ద్వారా ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

జనగణమన..!

అహింస ఎప్పటిలాగే మళ్లీ ఓసారి
చరిత బానిసత్వపు అధిపత్యంపై
గెలిచి డెబ్బై ఎనిమిది వసంతాల
స్వాతంత్ర్య సంబరాలతో ఆదర్శపు
స్ఫూర్తి అంబరాన్ని తాకుతోంది..!

నేటి విశ్వోదయమే
నా త్రివర్ణ పతాకపు
శాంతి వికాసమే ప్రేమతత్వపు
ఎవరెస్ట్ శిఖరమై నవతరపు
వర్తమానానికి భవిష్యత్ తరపు
వందే"మాతరానికి" దిక్సూచైంది.
జగతిని జాగృతం చేస్తూ
"జనగణమన"
సాక్షిగా రవీంద్రుని స్వరం దేశభక్తికి
స్వర్ణమై ప్రకాశిస్తూనే వుంది..!
భిన్నత్వంలో ఏకత్వమై
పరిమళిస్తూనే వుంది..!

మనుషులను ద్వేషపు ఆసనాలతో
రెచ్చగొట్టడం మాని,
మానవత్వపు తేజంతో
స్వేచ్ఛావాయువుల్ని పీల్చాలని
పేదరికపు సంగ్రామంలో
దేశాన్ని గెలిపించాలని
"సత్యమన్న" మహాత్ముడి మాటలు
విశ్వ గమనాన్ని నడిపిస్తున్నాయి..!

విశ్వ గురువుగా మళ్లీ మనకు
పునర్ వైభవం రావాలన్న
వివేకానంద సూక్తులే
సూర్యోదయ కిరణాల్లా
అజ్ఞానపు చీకటిని
తరిమేస్తున్నాయి..!
నేతాజీ జైహింద్ నినాదం కోట్లాది
భారతీయుల నివాసమై
ప్రతిధ్వనిస్తుంది..!
భగత్‌సింగ్ ప్రాణత్యాగం
అశోక చక్రమై
భారతీయతకు ప్రాణం పోస్తుంది..!
అంబేద్కర్ అభ్యుదయం
సమస్త జనవాళికి
చదువు మార్గం చూపెడుతుంది..!
వీరనారి ఝాన్సీ సాహసం
కోహినూర్ వజ్రమై మన జాతినంత
కవనమై కదిలిస్తుంది..
మన గుండె గడపపై జాతీయ
జెండా ఎగురుతున్న ఈ వేళ
లౌకికతత్వపు శోభ ప్రపంచమంతా
ప్రపంచమంతా ప్రభవించాలి
స్వాతంత్ర్యపు స్ఫూర్తి
వేలాది ఉద్యమాలకు ఊపిరి
పోయాలి..!!

- పి.అరుణ్‌కుమార్,
9394749536

(అ)జెండా ఊంచా రహే హమారా!



బివి రాఘవులు



ఎన్‌డిఏ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఆగస్టు 15న ఎర్రకోట బురుజు నుండి వినబోతున్నాము. ఆయన ప్రసంగం వినడానికి, మూడు రంగుల జెండా ఆవిష్కరణను తిలకించడానికి వేలమందికి ప్రత్యేకంగా ఆహ్వానాలు వెళ్లాయి. అందులో నాలుగువేల ఆహ్వానాలు ప్రత్యేకంగా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు వెళ్లాయని, ఈ తరగతులకు ప్రధానమంత్రి ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో ఇది వెల్లడిస్తున్నదని అప్పుడే మీడియాలో కథనాలు మొదలయ్యాయి. విడ్డూరం ఏమంటే, బీజేపీ మోడీ పాలన మూలంగా ఏ తరగతులైతే ఎక్కువగా ఇక్కట్ల పాలవుతున్నారో ఆ తరగతులనే స్వాతంత్ర్య దినోత్సవ సంరంభానికి ఆహ్వానించడం.

బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం జూన్ 8న ఏర్పడ్డాక గడచిన రెండు నెలల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ముఖ్యంగా కేంద్రం 2024-25 సంవత్సరానికి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు సరిగ్గా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు నష్టదాయకంగా ఉన్నాయి. ఇప్పుడు వీరందరికీ ఎర్రకోటపై నుండి మోడీగారు ఇచ్చే సందేశం వాతబెట్టి పసరు రాసినట్టుగా ఉంటుంది. రైతుల పరిస్థితి చూస్తే, గత మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని 2020లో దేశవ్యాపితంగా వీరోచిత పోరాటాన్ని సాగించారు. నెలల తరబడి ఢిల్లీ రాజధానిని దిగ్బంధనం చేశారు. ఉద్యమానికి తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేసినప్పటికీ, మోసపూరిత ఎత్తుగడలతో కాలయాపన చేసింది తప్ప, మద్దతు ధరకు చట్టబద్ధత ఇవ్వడానికి సిద్ధపడలేదు. ఇప్పుడు కూడా మోడీ ప్రభుత్వానికి అటువంటి ఆలోచన లేదనేది బడ్జెట్ ప్రసంగాలు విదితం చేస్తున్నాయి. పైపెచ్చు మొన్న బడ్జెట్‌లో ఎరువులకు సబ్సిడీ తగ్గించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్టు పెంచలేదు. ఇంకోవైపు వ్యవసాయంలోకి కార్పొరేట్లు ప్రవేశించడానికి వీలుగా అగ్రిస్టాక్ వంటి కొత్త ప్రతిపాదనలు చేశారు. రైతులు, ప్రత్యేకంగా పేద, మధ్యతరగతి, కౌలు రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలకు పరిష్కారాలు చూపకుండా, భూ వ్యాపారాన్ని వేగిరపర్చడానికి రాష్ట్రాలను ఒత్తిడి చేసేందుకు ప్రోత్సాహక పథకాలను సిద్ధం చేశారు. యువకుల పరిస్థితి మరీ అధ్వాన్నం. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని మోడీ వాగ్దానం చేసినప్పుడు యువకులు చాలా ఆశపడ్డారు. గత దశాబ్ద కాలంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమైంది. నిరుద్యోగం పెరిగింది. ఉపాధిని పెంచే పరిశ్రమలను, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడం కాకుండా మేక్ ఇన్ ఇండియా వంటి స్కీములన్నీ విదేశీ కంపెనీలు, ఉపాధి సృష్టించని హైటెక్ పరిశ్రమలు పెట్టుకోవడానికి తోడ్పడుతున్నాయి. తాజా బడ్జెట్‌లో ఉపాధి సృష్టికి ప్రకటించిన స్కీంలు ప్రభుత్వ సొమ్మును ఐదు వందల పెద్ద కంపెనీల బొక్కసం నింపడానికి వినియోగపడతాయి తప్ప, యువకులకు ఉపాధినిచ్చేవి కావు.

> మోడీ ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను విధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు మరో ఎత్తు. మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకుంటున్న చర్యలను చూసినా నిరంకుశ పాలనపై వేగంగా నడుస్తున్నట్లు గమనించవచ్చు. పౌర, నేర చట్టాలలో ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగే అనేక మార్పులు చేసారు. మీడియా నోరు నొక్కేందుకు కొత్త బ్రాడ్‌కాస్టింగ్ బిల్లును ప్రతిపాదిస్తున్నారు. ఒకదేశం - ఒకే ఎన్నిక కోసం రాజ్యాంగంలో తీవ్ర మార్పులు చేయడానికి సిద్ధమవుతున్నారు. మైనారిటీలకు నష్టం కలిగించే రీతిలో వక్ఫ్ బోర్డు చట్టానికి పలు సవరణలు తెస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో పౌరహక్కులను హరించే అనేక రాక్షస చట్టాలను తెస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారు.

పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఆశ్చర్యం గొలిపే అంశాలు ప్రస్తావించబడ్డాయి. మన పెట్టుబడిదారుల లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయని, కానీ వారు పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టడంలేదని, యంత్రాలు, పరికరాలు కొనేదానికన్నా విలాసాలకు ఖర్చు పెడుతున్నారని సర్వే వెల్లడించింది. ఇక ఎక్కడినుండి మన యువతకు ఉపాధి వస్తుంది. దేశంలోని యువతరం ఆటపాటల్లో వారు ఏం సాధించారనేది మన ప్రగతికి, దేశ ప్రతిష్టకు ఒక కొలమానం. పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్‌లో మన దేశం ఒక వెండి, ఐదు కాంస్య పతకాలతోనే తిరిగి రావాల్సి వచ్చింది. రావలసిన కొన్ని పతకాలు త్రుటిలో తప్పిపోయాయి. ఎంతో సాధనచేసి పోటీల్లో పాల్గొన్న యువతీయువకులను మనం అభినందించాలి. అయితే మనం 140కోట్ల జనాభా కలిగిన, ప్రపంచంలో సంపన్న దేశాల పక్కన చేరాలని ఉవ్విళ్లూరుతున్న దేశంగా చూసుకున్నపుడు, మనం ఎక్కడు న్నామని ప్రశ్నించుకుంటే యువతరాన్ని ఎంత నిర్లక్ష్యం చేస్తున్నామో అర్థమవుతుంది. మన పాఠశాల, కళాశాలస్థాయి విద్యావిధానం ఎంత లోపభూయిష్టంగా ఉందో, మోడీ వచ్చిన తర్వాత నూతన విధానం పేరుతో అది మరింత అధ్వాన్నం ఎలా అయిందో ఆటల్లో వెనకంజ స్పష్టంగా వెల్లడిస్తుంది. యువతరం పట్ల మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం తెలియ జేస్తుంది.

ఇక మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక తరగతి గురించి చెప్పుకోనక్కరలేదు. ఈ తరగతులపై హింస, అత్యా చారాలు, నిత్యకృత్యమయ్యాయి. పితృస్వామిక భావజాలాన్ని, సనాతనవాదాన్ని గొప్పగా బీజేపీ నాయకులు, సంఘ్ పరివార్ కీర్తిస్తున్న తరుణంలో బలహీనవర్గాలపై అవమానాలు, అఘాయిత్యాలు పెరగడంలో ఆశ్చర్యం లేదు. ఆరెస్సెస్ అనుకూల పత్రిక పాంచజన్యంలో, అత్యంత దుర్మార్గమైన కుల వ్యవస్థను దేశాన్ని సమైక్యంగా ఉంచే ఒక గొప్ప వ్యవస్థగా కీర్తిస్తూ రాశారంటే బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత సామాజిక అభివృద్ధి నిరోధకులకు ఎంత ధైర్యం వచ్చిందో చూడవచ్చు. గిరిజనుల పరిస్థితి మరింత దైన్యంగా మారింది. అడవులు, గనులు, కొండలను కార్పొరేట్ల లూటీకి అప్పగించడానికి, వారికి ఇచ్చిన రక్షణలన్నింటిని తొలగిస్తున్నా రు. అభ్యంతరం పెట్టినవాళ్ళపై క్రూర నిర్బంధం ప్రయోగిస్తున్నారు. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన వేలాది గిరిజన కుటుంబాలను పునరావాసం కల్పించకుండా రోడ్డున పడేశారు. మైనారిటీలైతే బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితిని సృష్టించారు.

పేదలను వాడుకుని విసిరేసే వస్తువులుగా మోడీ ప్రభుత్వం చూస్తున్నది. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకానికి వరుసగా కోతలు పెడుతున్నది. ఈ బడ్జెట్టులోనూ కేటాయింపులు తగ్గించింది. ఆహార సబ్సిడీని తగ్గించింది. ప్రభుత్వ ఆర్థిక సర్వే ప్రకారమే పెట్టుబడిదారుల లాభాలు ఇరవై శాతానికి పైగా పెరుగుతుంటే, కార్మికులు, కష్టజీవుల ఆదాయాలు పడిపోయాయి. మధ్య తరగతి ఆదాయాలు సైతం ఎదుగుబొదుగు లేకుండా ఉన్నాయి.

> కేంద్రం 2024-25 సంవత్సరానికి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు సరిగ్గా రైతులకు, మహిళలకు, యువకులకు, పేదలకు నష్టదాయకంగా ఉన్నాయి. ఇప్పుడు వీరందరికీ ఎర్రకోటపై నుండి మోడీగారు ఇచ్చే సందేశం వాతబెట్టి పసరు రాసినట్టుగా ఉంటుంది. రైతుల పరిస్థితి చూస్తే, గత మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని 2020లో దేశవ్యాపితంగా వీరోచిత పోరాటాన్ని సాగించారు. నెలల తరబడి ఢిల్లీ రాజధానిని దిగ్బంధనం చేశారు. ఉద్యమానికి తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేసినప్పటికీ, మోసపూరిత ఎత్తుగడలతో కాలయాపన చేసింది తప్ప, మద్దతు ధరకు చట్టబద్ధత ఇవ్వడానికి సిద్ధపడలేదు.

పెద్ద పెద్ద భూ యజమానుల ఆదాయాలను కలుపుకుని లెక్కగట్టినా రైతు ఆదాయాలు ఒక్క శాతం మాత్రమే పెరిగాయి. ధరలు మాత్రం ఐదు శాతంపైనే పెరుగుతున్నాయి. పేదలు ఎక్కువగా వినియోగించే ఆహార పదార్థాల ధరలు పదిశాతం పైబడి పెరుగుతున్నాయి. అంటే నిజ ఆదాయాలు ఇంకా తక్కువగా ఉన్నాయన్నమాట. కనీవినీ ఎరుగని లాభాలు గడిస్తున్న కార్పొరేట్ల నుండి అదనపు పన్నులు వసూలు చేసి పేదల ఆదాయాలను పెంచే కార్యక్రమాలు చేపట్టకుండా, ఈ బడ్జెట్‌లో వారికి మరిన్ని రాయితీలు, తాయిలాలు మోడీ ప్రభుత్వం ఇస్తున్నది. ఇది పేదలపై మోడీ చూపిస్తున్న ప్రేమలోని కుటిలత్వం.

పైన ప్రస్తావించినవన్నీ ఒక ఎత్తయితే, మోడీ ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను విధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు మరో ఎత్తు. మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకుంటున్న చర్యలను చూసినా నిరంకుశ పాలనపై వేగంగా నడుస్తున్నట్లు గమనించవచ్చు. పౌర, నేర చట్టాలలో ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగే అనేక మార్పులు చేసారు. మీడియా నోరు నొక్కేందుకు కొత్త బ్రాడ్‌కాస్టింగ్ బిల్లును ప్రతిపాదిస్తున్నారు. ఒకదేశం - ఒకే ఎన్నిక కోసం రాజ్యాంగంలో తీవ్ర మార్పులు చేయడానికి సిద్ధమవుతున్నారు. మైనారిటీలకు నష్టం కలిగించే రీతిలో వక్ఫ్ బోర్డు చట్టానికి పలు సవరణలు తెస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో పౌరహక్కులను హరించే అనేక రాక్షస చట్టాలను తెస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారు.

ఇటువంటి దుష్పరిపాలనను కప్పిపుచ్చుకోవడానికి స్వతంత్ర్య దినోత్సవాన్ని ప్రధానమంత్రి మోడీ ఉపయోగపెట్టుకుంటారు. వాగాడంబరంతో నిజాలను కప్పేస్తాడు. మభ్యపెట్టే వాగ్దానాలను చేస్తారు. మనకు తెలుసు మోడీ చెప్పేది ఒకటి, చేసేదొకటి అని.

అందుకే మనం కూడా ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సామాజిక న్యాయాన్ని ప్రజల జీవన ప్రమాణాలను రక్షించుకునేందుకు ఈ సందర్భంగా కృతనిశ్చయులం కావాలి.

ప్రాజెక్టు పేరు మారితే చరిత్ర మారుతుందా?



నున్నా నాగేశ్వరరావు
9490098191

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దీని కోసం జిల్లాలో పెద్దఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. మంత్రుల పర్యటనలు, ట్రయల్ రన్స్ నిర్వహిస్తూ హంగామా చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ను తెచ్చిన లేదా పూర్తిచేసిన ఘనత తమదంటే తమదేనని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీలుపడి మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నా రు. తమ ఖాతాలో వేసుకోవాలని, తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ఆరాటపడుతున్నారు.కానీ ఈ ప్రాజెక్టును సాధించింది ఎవరు? ప్రజల తరపున పోరాడింది ఎవరు? వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసింది ఎవరు? ఈ వాస్తవాలు నేడు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నది.

గోదావరి నది ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఎక్కువ దూరం ప్రయాణిస్తుంది. గత కాంగ్రెస్, తెలుగుదేశం పాలకుల నిర్లక్ష్యం వలన వందల టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రం పాలవుతున్నాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద 2.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ ఒక పంటకు కూడా గ్యారంటీ లేని పరిస్థితి. 1997 నుండి 2003 వరకు వరుసగా అనావృష్టి, కరువు పరిస్థితులు ఏర్పడి ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయి. సాగునీరే కాదు, తాగునీరు కూడా దొరకని పరిస్థితి నెలకొన్నది. ఖమ్మం జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి గోదావరి జలాలను మళ్లించటమే పరిష్కారమని చాలాకాలంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేస్తూ వచ్చాయి.

మహాప్రస్థాన పాదయాత్ర


జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రజల చిరకాల కోరికను తీర్చటానికి తాగు, సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధించటమే ఏకైక పరిష్కారమని సీపీఐ(ఎం) పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ భావించింది. ప్రాజెక్టు కార్యరూపం దాల్చటానికి కార్యాచరణను రూపొందించింది. ఆ కార్యాచరణే మహాప్రస్థాన పాదయాత్రగా మారింది. నాటి సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి, ఖమ్మం పార్లమెంట్ మాజీ సభ్యులు కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం 2003లో దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధనే లక్ష్యంగా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. వాజేడులో ప్రారంభమైన ఈ యాత్ర సుమారు అయిదు నెలలపాటు 46 మండలాల్లో 2600 కిలోమీటర్లకుపైగా జనప్రవాహంలా సాగి వేలాదిమందితో ఖమ్మంలో ముగిసింది. గ్రామ గ్రామాన ప్రజలు రాజకీయాలకతీతంగా యాత్రకు ఘన స్వాగతం పలికారు. సంపూర్ణ మద్దతు, సంఘీభావాన్ని తెలిపారు. గ్రామాల్లో అనేక సమస్యలు ముందుకొచ్చాయి. అంతర్లీనంగా వాటన్నింటికి దుమ్ము గూడెం ప్రాజెక్టు సాధనే గోదావరి జలాలు జిల్లాలో పారించటమే పరిష్కారంగా ఉన్నది.నాడు సాధ్యం కాదు అన్నవారే నేడు సాధించామం టున్నారు. నాటి టీడీపీ నేతలు యాత్రను అపహాస్యం చేసినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

2004లో జరిగిన శాసనసభ ఎన్నికలలో 9 స్థానాలకు గాను కాంగ్రెస్, వామపక్షాలు అన్ని స్థానాలు గెలుపొందాయి. టీడీపీ 9 స్థానాలలో ఓటమి పాలైంది. ఖమ్మం, మధిర, భద్రాచలం సీపీఐ(ఎం) గెలుచుకున్నది. జిల్లాలో 8 స్థానాలలో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి చేసినప్పటికీ ఖమ్మం అసెంబ్లీ స్థానంలో సర్దుబాటు కుదరలేదు. చతుర్ముఖ పోటీలో మహాప్రస్థాన పాదయాత్ర సారథి తమ్మినేని వీరభద్రం టీడీపీపై పదివేల మెజార్టీతో ఖమ్మం అసెంబ్లీ నుండి గెలుపొందాడు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తమ్మినేని వీరభద్రం 9 మంది శాసనసభ్యులను తీసుకొని ముఖ్యమంత్రిని కలిసి దుమ్ముగూడెం ప్రాజెక్టు మంజూరు చేయమని ఒత్తిడి చేశారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి హామీ నిచ్చారు. రెండేండ్లయినా కార్యరూపం దాల్చకపోవడంతో అసెంబ్లీలో చర్చకు తెచ్చారు. 2007లో దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం జిల్లా కమిటీ కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వగా రెండు రోజులు పదివేల మంది రైతులు పాల్గొన్నారు. అక్కడే వంటావార్పు, బస చేశారు. సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలంతా వారితో పాటు భద్రాచలం ఎంపీ మిడియం బాబూరావు పాల్గొన్నారు. త్వరలో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తానని ముఖ్యమంత్రి మాటగా జిల్లా కలెక్టర్ హామీనివ్వటంతో ఆందోళన విరమించారు.

రాజకీయ ప్రయోజనాల కోసం...

ప్రాజెక్టును వైఎస్ విడగొట్టారు. దుమ్ముగూడెం వద్ద రాజీవ్‌సాగర్ గాను, రుద్రమకోట వద్ద ఇందిరాసాగర్ గాను మార్చి నాలుగు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 2.5 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరణతో పాటు బేతుపల్లి, లంకాసాగర్, వైరా, బయ్యారం, పాలేరు చెరువుల కింద ఆయకట్టు స్థిరీకరణ, తాగునీటి అవసరాలు తీర్చటానికి రూపొందించబడింది.కార్ల యాత్ర అసెంబ్లీకి పాదయాత్రగా మారింది. ఈ రెండు ప్రాజెక్టులకు సుమారు రూ.4వేల కోట్ల అంచనాతో ప్రతిపాదించారు. రెండేండ్లయినా నిధులు కేటాయింపులు చేయలేదు. 2009లో సీపీఐ(ఎం), తెలుగుదేశం, న్యూడెమోక్రసీ పార్టీలతో కలిసి ఖమ్మం నుండి 500 కార్లతో అసెంబ్లీకి వెళ్లాలని కార్యక్రమం చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించింది. అనుమతి లేదని కార్లను అడ్డుకున్నది. మూడు పార్టీల నాయకులు తమ్మినేని, తుమ్మల నాగేశ్వరరావుల సారథ్యంలో పాదయాత్ర చేపట్టారు.వీరితో పాటు ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు వందలాదిగా కదిలారు. ఈ యాత్ర వారం రోజులు సాగి నకిరేకల్ చేరుకునేసరికి నాటి ఆర్థిక మంత్రి రోశయ్య రూ.300 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్ పెట్టడంతో యాత్ర ముగిసింది. మోకాళ్ల యాత్ర చేసినా దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధ్యం కాదన్న తెలుగుదేశం నాయకులంతా ఈ పాదయాత్రలో పాల్గొనడం కొస మెరుపు.

దుమ్ముగూడెంకు అరకొరగా నిధులు కేటాయించినా



పనులు మాత్రం నత్తనడకన సాగాయి. కృష్ణా జలాలను శ్రీశైలం నుండి పోతిరెడ్డి పాడు సొరంగమార్గం ద్వారా రాయలసీమకు తరలించి, గోదావరి జలాలను నాగార్జునసాగర్‌కు తరలించి ఖమ్మం జిల్లా ప్రజలకు దుమ్ముగూడెం నీళ్లు రాకుండా దుమ్ముగొట్టే కుట్రలకు నాటి వైఎస్ ప్రభుత్వం తెరలేపింది. దాని కోసం దుమ్ముగూడెం నుండి సాగర్ టైల్‌పాండ్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 165 టీఎంసీలను తరలించటానికి ప్రాజెక్టు ప్రతిపాదన నిధుల కేటాయింపులు జరిగాయి. దీనిని సీపీఐ(ఎం) పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. తెలుగుదేశంతో కలిసి జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టింది. జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పర్యటనను అడ్డుకున్నది.

1500 మందితో మహారైతు పాదయాత్ర

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి మరణంతో కొంతకాలం సాగర్ టైల్‌పాండ్ ఆగిపోయింది. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ కొనసాగించే ప్రయత్నాలు చేశారు. దుమ్ముగూడెం-సాగర్ టైల్‌పాండ్ రద్దు చేయాలి, దుమ్ముగూడెం ప్రాజెక్టును పూర్తిచేయాలి, నిధులివ్వాలనే డిమాండ్‌తో 1500 మంది రైతులతో 2012లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ రైతు మహాపాదయాత్ర చేపట్టింది. కామ్రేడ్ పోతినేని సుదర్శన్ సారథ్యంలో దుమ్ముగూడెం నుండి భద్రాచలం మీదుగా పాలేరు-ఖమ్మం వరకు 350 కిలోమీటర్లు 23 రోజులు సాగింది. ఈ యాత్రకు ప్రజల నుండి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఈ యాత్రలో పాల్గొన్నవారు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ధర్నాకు దిగారు. అధికార యంత్రాంగంలో కదలిక వచ్చి పనులు ప్రారంభించారు.

సీతారామగా మారిన దుమ్ముగూడెం

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైంది. కేసీఆర్ ప్రభుత్వం రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం పెండింగ్ ప్రాజెక్టులను రీడిజైన్ పేరుతో వాటి పేర్లు, అంచనాలు మార్చివేశారు. దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌లను మార్చివేసి మొదట శ్రీరామ తదుపరి సీతారామ ప్రాజెక్టుగా మార్చారు. అప్పటి వరకు ఖర్చు పెట్టిన సుమారు రూ.2 వేల కోట్లు వృథా అయ్యాయి. మొదట రూ.13వేల కోట్లు తదుపరి 18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్‌లో మొత్తం పది లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, తాగునీటి పథకాలకు రూపకల్పన చేశారు. రెండేండ్లలో పూర్తిచేస్తామని కేసీఆర్, తుమ్మల నాగేశ్వరరావులు ప్రకటించారు. పదేండ్ల బీ(టీ)ఆర్ఎస్ పాలన ముగిసినా పూర్తికాలేదు. సుమారు రూ.13 వేల కోట్లు ఖర్చు చేశారు. మొదట ప్రతిపాదించిన రోళ్లపాడు, బయ్యారం చెరువులను (బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లుగా మార్చే ప్లానును) మినహాయించారు.

పూర్తికాని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవాలా?

తొమ్మిది మాసాల క్రితం 2023లో జరిగిన శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓడిపోయింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అనూహ్యంగా ఖమ్మం జిల్లా నుండే గెలిచిన ఐదుగురిలో ముగ్గురు మంత్రులయ్యారు. ప్రాజెక్టును ఆగస్టు15కల్లా ప్రారంభమవుతుందని ప్రకటించారు. జూలూరుపాడు దాకా వచ్చిన కాల్వను అడ్డం తిప్పి ఏన్కూర్ వద్ద నాగార్జునసాగర్ ఎడమకాల్వలో కలుపుతున్నారు. దీని ఫలితంగా సత్తుపల్లి నియోజకవర్గానికి, వైరా చెరువుకు మాత్రమే నీళ్లు వెళ్తాయి. ఇది మినహా కొత్తగూడెం జిల్లాకు, వైరా, ఖమ్మం, పాలేరు, డోర్నకల్ నియోజకవర్గాలకు ఈ ప్రారంభం ద్వారా ఎకరానికి కూడా నీళ్లు రావు. ప్రధాన కాల్వకు పాలేరు వరకు భూసేకరణ పూర్తికాలేదు. ఇప్పటివరకు అయిన కాల్వకు డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు 6500 ఎకరాలు భూసేకరణ జరగాలి, పనులు చేయాలి. ప్రస్తుతం బి.జి.కొత్తూరు, పూసుగూడెం, కమలాపురం పంపుహౌజ్‌లు మాత్రమే పూర్తయ్యాయి. వైరా చెరువు అలుగు పారుతోంది. నాగార్జునసాగర్ నిండింది. ఎడమ కాల్వకు తక్షణం నీళ్లవసరం లేదు. 104 కిలోమీటర్ల ప్రధాన కాల్వను పూర్తిచేసి పాలేరుకు అనుసంధానం చేస్తే రబీ సీజన్‌కు సత్తుపల్లికి కూడా నీళ్లివ్వచ్చు. అసంపూర్తిగా, అసమగ్రంగా ఉన్న ప్రాజెక్టును ప్రారంభించటమంటే పేరు కోసమో, గత ప్రభుత్వం చేయలేదు గనుక తాము చేశామని చెప్పుకోవటానికి మాత్రమే ఇది ఉపయోగపడుతుంది.

> మండల స్థాయి, గ్రామస్థాయి పాదయాత్రలు, మహాప్రస్థాన, మహారైతు పాదయాత్రలు, అసెంబ్లీకి పాదయాత్ర, హైదరాబాద్‌లో ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడులు, మండల రెవెన్యూ ఆఫీసుల దిగ్బంధనాలు, అరెస్టులు, కేసులు, నిర్బంధాలు, లాఠీ ఛార్జీలు ఎదుర్కొని ప్రభుత్వాల మెడలు వంచి ఈ ప్రాజెక్టును సాధించింది సీపీఐ(ఎం). మిగతా వామపక్షాలు కూడా తమ తమ పద్ధతుల్లో ఆందోళనలు, పోరాటాలు చేశాయి. గత కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల అసమర్థత, నిర్లక్ష్యం వలన రెండు దశాబ్దాలు గడిచినా పూర్తికాలేదు. కొత్త సీసాలో పాత సారాయిలాగా అదే నాయకులు మంత్రులుగా ఉన్నారు. ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. రూ.4వేల కోట్లతో పూర్తయ్యే పనులు 20 వేల కోట్లు దాటుతున్నాయి.


సమగ్రంగా ప్రాజెక్టును పూర్తిచేయాలి

మండల స్థాయి, గ్రామస్థాయి పాదయాత్రలు, మహాప్రస్థాన, మహారైతు పాదయాత్రలు, అసెంబ్లీకి పాదయాత్ర, హైదరాబాద్‌లో ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడులు, మండల రెవెన్యూ ఆఫీసుల దిగ్బంధనాలు, అరెస్టులు, కేసులు, నిర్బంధాలు, లాఠీ ఛార్జీలు ఎదుర్కొని ప్రభుత్వాల మెడలు వంచి ఈ ప్రాజెక్టును సాధించింది సీపీఐ(ఎం). మిగతా వామపక్షాలు కూడా తమ తమ పద్ధతుల్లో ఆందోళనలు, పోరాటాలు చేశాయి. గత కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల అసమర్థత, నిర్లక్ష్యం వలన రెండు దశాబ్దాలు గడిచినా పూర్తికాలేదు. కొత్త సీసాలో పాత సారాయిలాగా అదే నాయకులు మంత్రులుగా ఉన్నారు. ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. రూ.4వేల కోట్లతో పూర్తయ్యే పనులు 20 వేల కోట్లు దాటుతున్నాయి. ఆగస్టు 15న అరకొరగా ప్రారంభించి వదిలేయకుండా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, ఇల్లందు, ఖమ్మం, డోర్నకల్, మధిర నియోజకవర్గాలతో పాటు దుమ్ముగూడెం వైపు ప్రగళ్లపల్లి లిఫ్టును కూడా పూర్తిచేసి పదిలక్షల ఎకరాలకు నీళ్లివ్వాలి. రోళ్లపాడు, బయ్యారం, వైరా, బేతుపల్లి, లంకాసాగర్, తుమ్మల చెరువు తదితర చెరువులను అనుసంధానం చేయాలి. అప్పుడే ఈ ప్రాజెక్టు పూర్తవుతుంది. అప్పటిదాకా సీపీఐ(ఎం) ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుంది.

సామాజిక సమానత్వం ఎలా సాధ్యం?

అసమానతలు మరింత పెరుగుతాయి

- ఇప్పటికీ భర్తీ కాని రిజర్వ్‌డ్ కోటా
- విద్యా సంస్థల్లో క్రీమిలేయర్‌పై విద్యావేత్తల అభ్యంతరం



న్యూఢిల్లీ : విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి క్రీమిలేయర్ మినహాయింపుపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు విస్తృత చర్చకు దారితీసింది. సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అసమానతలను నివారించడంలో రిజర్వేషన్ విధానాల సమర్థతపై ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. యూజీసీ వార్షిక నివేదిక నుంచి తీసుకున్న సమాచారం ఆధారంగా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నమోదు, ఉన్నత విద్యా సంస్థల్లో ఫ్యాకల్టీ సభ్యులుగా వారి ప్రాతినిధ్యం వంటి అంశాలపై యూజీసీ వార్షిక నివేదిక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఫ్యాకల్టీ స్థానాల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు లభిస్తున్న ప్రాతినిధ్యంపై 'న్యూస్‌క్లిక్' పోర్టల్ విశ్లేషణ జరిపింది. ఉన్నత విద్యా సంస్థల్లో క్రీమిలేయర్ పాటిస్తే సామాజిక సమానత్వం సాధించడం అసాధ్యమని, అసమానతలు మరింతగా పెరుగుతాయని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

విద్యార్థుల చేరికలు ఇంతే

2006వ సంవత్సరపు కేంద్ర విద్యా సంస్థల చట్టం ప్రకారం ప్రవేశాల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం సీట్లు రిజర్వ్ చేశారు. అయితే ఆ మేరకు కూడా సీట్లు నిండలేదని న్యూస్‌క్లిక్ విశ్లేషణలో తేలింది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర విశ్వవిద్యాలయాల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఎస్సీలు 13.4 శాతం, ఎస్టీలు 5.49 శాతం, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలు 10.99 శాతం, ఎస్టీలు 6.91 శాతం, డీమ్డ్ వర్సిటీల్లో ఎస్సీలు 9.65 శాతం, ఎస్టీలు 3.83 శాతం చేరారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఎస్సీలు 9.5 శాతం, ఎస్టీలు 18.48 శాతం, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలు 13.45 శాతం, ఎస్టీలు 8.03 శాతం, డీమ్డ్ వర్సిటీల్లో ఎస్సీలు 11.01 శాతం, ఎస్టీలు 4.16 శాతం ప్రవేశాలు పొందారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఎం.ఫిల్ కోర్సుల్లో ఎస్సీలు 9.5 శాతం, ఎస్టీలు 18.48 శాతం, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలు 22.88 శాతం, ఎస్టీలు 1.57 శాతం మాత్రమే రిజర్వేషన్లు పొందారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ఎస్సీలు 10.34 శాతం, ఎస్టీలు 22.8 శాతం, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలు 11.73 శాతం, ఎస్టీలు 4.41 శాతం, డీమ్డ్ వర్సిటీల్లో ఎస్సీలు 6.9 శాతం, ఎస్టీలు 1.03 శాతం ప్రవేశాలు పొందారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ఎస్సీలు 4.53 శాతం, ఎస్టీలు 3.21 శాతం, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలు 11.01 శాతం, ఎస్టీలు 7.41 శాతం, డీమ్డ్ వర్సిటీల్లో ఎస్సీలు 9.49 శాతం, ఎస్టీలు 2.25 శాతం సీట్లు సాధించారు. మొత్తంగా చూస్తే కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలు 11.25 శాతం, ఎస్టీలు 9.9 శాతం, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలు 11.48 శాతం, ఎస్టీలు 7.16 శాతం, డీమ్డ్ వర్సిటీల్లో ఎస్సీలు 9.79 శాతం, ఎస్టీలు 3.72 శాతం మాత్రమే పొందారు.

రిజర్వేషన్ విధానాలు అమలు చేస్తున్నా...

ఎస్సీ, ఎస్టీలకు గత 74 సంవత్సరాలుగా రిజర్వేషన్ విధానాలను అమలు చేస్తున్నప్పటికీ విద్యా సంస్థల్లో వారి ప్రతినిధ్యం కేటాయించిన కనీస కోటాల కంటే తక్కువగానే ఉంది. రిజర్వేషన్ విధానాలను పటిష్టవంతంగా అమలు చేయడం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అవసరమైన మద్దతు, వనరులు అందించడం, వారిలో అవగాహన కల్పించడం వంటి చర్యల ద్వారా పరిస్థితిలో మార్పు తేవచ్చు. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే ఎస్సీ, ఎస్టీలకు క్రీమిలేయర్‌ను వర్తింపజేయడం వల్ల సమస్య మరింత జటిలమవుతుందని అర్థమవుతోంది. సామాజిక సమానత్వం కూడా మరింత దూరమవుతుంది.

ఫ్యాకల్టీ కూడా అంతే

ఇక బోధనా సిబ్బంది విషయానికి వస్తే 2022-23లో కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలకు చెందిన 11.9 శాతం మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, 7.21 శాతం మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేశారు. ఈ విద్యా సంస్థల్లో ఎస్టీలకు చెందిన 5.81 శాతం మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, 1.96 శాతం మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేశారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలకు చెందిన 14.38 శాతం మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, 10.35 శాతం మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేయగా ఎస్టీలకు చెందిన 5.23 శాతం మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, 3.11 శాతం మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేశారు.

డీమ్డ్ యూనివర్సిటీల్లో ఎస్సీలకు చెందిన 9.6 శాతం మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, 6.7 శాతం మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేశారు. ఎస్టీలకు చెందిన 1.27 శాతం మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, 1.06 శాతం మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలకు చెందిన 5.42 శాతం మంది, ఎస్టీలకు చెందిన 1.38 శాతం మంది ప్రొఫెసర్లుగా ఉండగా రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్సీలకు చెందిన 7.59 శాతం మంది, ఎస్టీలకు చెందిన 1.87 శాతం మంది ప్రొఫెసర్లు ఉన్నారు. మొత్తంగా చూస్తే కేంద్ర విశ్వవిద్యాలయాల్లో 10.25 శాతం ఎస్సీ బోధనా సిబ్బంది, 4.52 శాతం ఎస్టీ బోధనా సిబ్బంది పనిచేస్తున్నారు. రాష్ట్ర విద్యాలయాల్లో వీరు వరుసగా 12.8 శాతం, 4.45 శాతం, డీమ్డ్ వర్సిటీల్లో 8.3 శాతం, 1.14 శాతం విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈ గణాంకాలను పరిశీలిస్తే ఫ్యాకల్టీ విషయంలో కూడా అసమానతలు కన్పిస్తున్నాయి. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో 10.25 శాతం, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో 12.85 శాతం, డీమ్డ్ యూనివర్సిటీల్లో 8.3 శాతం ఎస్సీ సిబ్బంది ఉన్నారు. ఆయా విద్యా సంస్థల్లో ఎస్టీలు వరుసగా 4.52 శాతం, 4.45 శాతం, 1.14 శాతం మాత్రమే ఉన్నారు. రాష్ట్ర యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ బోధనా సిబ్బంది ఎక్కువ సంఖ్యలో, డీమ్డ్ వర్సిటీల్లో తక్కువ సంఖ్యలో ఉన్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను ఎంపిక చేసుకోవడంలో కేంద్ర విశ్వవిద్యాలయాలు సమర్థవంతమైన విధానాలను అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ కొన్ని కేటగిరీల్లో రిజర్వ్‌డ్ కోటా కంటే తక్కువగానే ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యం కన్పిస్తోంది.

కేంద్ర వర్సిటీలే బెటర్

దేశంలోని వేర్వేరు తరగతులకు చెందిన విశ్వవిద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ప్రవేశాల్లో అసమానతలు గణనీయంగా చోటుచేసుకున్నాయని ఈ గణాంకాలు చెబుతు న్నాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కేంద్ర యూనివర్సిటీల్లో అత్యధికంగా, రాష్ట్ర యూనివర్సిటీల్లో ఓ మోస్తరుగా ఉండగా డీమ్డ్ వర్సిటీల్లో అతి తక్కువ సంఖ్యలో ఉండడం గమనార్హం. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యా స్థాయిలో ఎస్సీలు 11 శాతం, ఎస్టీలు 10 శాతం ఉన్నారు. పీజీ (18.48 శాతం), పీహెచ్‌డీ (22.80 శాతం) స్థాయిల్లో ఎస్టీ విద్యార్థుల సంఖ్య బాగా పెరగడం విశేషం. రిజర్వ్ చేసిన కోటా కంటే ఇది అధికం. పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి జనరల్ కేటగిరీ కింద అర్హులైన వారిలో ఎస్టీలు కూడా ఉన్నారని దీనిని బట్టి అర్థమవుతోంది. రాష్ట్ర యూనివర్సిటీల్లో ఎస్సీలకు 11 శాతం, ఎస్టీలకు 7 శాతం ప్రాతినిధ్యం మాత్రమే లభించింది. డీమ్డ్ యూనివర్సిటీల్లో ఇది మరింత తక్కువగా 10 శాతం, 4 శాతం మాత్రమే ఉండడం గమనార్హం. రిజర్వేషన్ విధానాలు, ఆర్థిక సాయం వంటి కారణాల వల్ల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కేంద్ర యూనివర్సిటీల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. కేంద్ర యూనివర్సిటీలతో పోలిస్తే రాష్ట్ర యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీల ప్రవేశాలు కొంత తక్కువగా ఉన్నప్పటికీ వారి ప్రాతినిధ్యం సహేతుకంగానే ఉంది. డీమ్డ్ వర్సిటీల్లో మాత్రం ప్రవేశాలు చాలా నిరాశాజనకంగా ఉంటున్నాయి.

అది మా దేశపు ఫండ్ కాదు

షెల్ కంపెనీలను అనుమతించం
హిండెన్‌బర్గ్ నివేదికపై మారిషస్ వివరణ



న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ రిసెర్చ్ నివేదికలోని కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నానని మారిషస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమిషన్ (ఎఫ్ఎస్‌సీ) తెలిపింది. విదేశీ వ్యాపారులు, వ్యక్తులకు పన్ను మినహాయింపులు ఇస్తూ మారిషస్ వారి పాలిట స్వర్గధామంగా మారిందని హిండెన్‌బర్గ్ వ్యాఖ్యానించింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి సెబీ చీఫ్ మాధబి పురి బచ్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిందని, ఈ ఆరోపణలకు ఆఫ్‌షోర్ నిధి కారణమని, అయితే అది తమ దేశానికి చెందినది కాదని, షెల్ కంపెనీల ఏర్పాటుకు తమ దేశం అనుమతించదని ఎఫ్ఎస్‌సీ తెలిపింది. ఈ నెల 10న హిండెన్‌బర్గ్ చేసిన ప్రకటనను గమనంలోకి తీసుకున్నామని చెప్పింది. ఆ ప్రకటనలో 'మారిషస్‌లోని షెల్ కంపెనీలు', 'పన్ను చెల్లింపుదారులకు మారిషస్ స్వర్గధామం' వంటి ప్రస్తావనలు ఉన్నాయని వివరించింది. ఐపీఈ ప్లస్ ఫండ్ అనేది చిన్న ఆఫ్‌షోర్ మారిషస్ ఫండ్ అని, ఐపీఈ ప్లస్ ఫండ్-1ను మారిషస్‌లో రిజిస్టర్ చేశారని హిండెన్‌బర్గ్ తెలిపింది. దీనిపై ఎఫ్ఎస్‌సీ వివరణ ఇస్తూ ఐపీఈ ప్లస్ ఫండ్, ఐపీఈ ప్లస్ ఫండ్-1 తమ లైసెన్సులను పొందలేదని, అవి మారిషస్‌కు చెందినవి కావని తెలియజేసింది. మారిషస్‌లో బ్యాంకింగ్ యేతర ఆర్థిక సేవలను, అంతర్జాతీయ వ్యాపారాన్ని ఎఫ్ఎస్‌సీ నియంత్రిస్తుంది. ప్రపంచ వ్యాపార కంపెనీలన్నింటికీ తాను లైసెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని కమిషన్ చెప్పింది. ప్రపంచంలో అనుసరిస్తున్న మెరుగైన విధానాలను మారిషస్ పాటిస్తోందని, ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) ప్రమాణాలను అమలు చేస్తున్నామని తెలిపింది. మారిషస్ పన్ను వ్యవస్థలో ప్రమాదకరమైన అంశాలేవీ లేవని ఓఈసీడీ సంతృప్తి చెందుతోందని, మారిషస్‌ను అది పారదర్శకమైనదిగా, చట్టానికి లోబడి పనిచేసేదిగా, మెరుగైన నియంత్రణ కనబరిచేదిగా గుర్తించిందని వివరించింది. కాబట్టి మారిషస్ పన్ను చెల్లించే విదేశీయులు, వ్యాపారులకు సర్గధామం కాదని ఎఫ్ఎస్‌సీ తెలిపింది.

ఒడిశాలో దారుణం

ఇద్దరు రోగులపై వైద్యుడి లైంగికదాడి...అరెస్ట్




కటక్ : ఒడిశాలోని ప్రధాన ఆరోగ్య కేంద్రాల్లో ఒకటైన కటక్‌లోని ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేస్తున్న దిల్‌బాగ్ సింగ్ ఠాకూర్ కామాంధుడిగా మారాడు. ఆస్పత్రి ప్రాంగణంలో ఇద్దరు రోగులపై లైంగికదాడి చేశాడు. అతనిని పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. అత్యాచార ఘటన నేపథ్యంలో రోగుల బంధువులు, బాధితుల స్నేహితులైన కొందరు జూనియర్ డాక్టర్లు అతనికి దేహశుద్ధి చేశారు. తీవ్రంగా గాయపడిన ఠాకూర్‌ను ఆస్పత్రి ఐసీయూలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఠాకూర్ మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందినవాడు. లైంగికదాడి ఘటన ఆదివారం జరిగిందని పోలీసులు తెలిపారు. కార్డియాలజీ విభాగంలో పనిచేస్తున్న ఠాకూర్ ఎకో పరీక్ష కోసం ఆస్పత్రికి వచ్చిన మహిళా రోగులతో మాటామంతీ కలిపాడు. వారు శుక్రవారం పరీక్ష కోసం రాగా ఆదివారం రమ్మని చెప్పాడు. పరీక్ష జరిపేటప్పుడు ఎవరినీ లోపలికి అనుమతించ లేదు. కాగా ఈ నెల 11న బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేశారు. ఘటనపై త్రిసభ్య కమిటీ విచారణ జరుపుతోందని రాష్ట్ర ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

'ఛోటా మోడీ' అవతారాలు ఎన్నెన్నో!

రీడర్ నుంచి యూపీఎస్‌సీ ఛైర్మెన్ స్థాయికి మనోజ్ సోనీ

- నరేంద్రునికి నమ్మినబంటుగా పేరు
- ఆయన కెరీర్ మొత్తం వివాదాలమయమే



వడోదర / ఆనంద్: విద్యా పరంగా ఆయన రికార్డు చాలా దారుణంగా ఉంది. అయినప్పటికీ యూపీఎస్‌సీ ఛైర్‌పర్సన్ అయ్యారు. ఆయనే 59 సంవత్సరాల మనోజ్ సోనీ. నుదుటిపై ఎప్పుడూ తిలకం పెట్టుకుంటారు. నరేంద్ర మోడీకి అత్యంత విశ్వాసపాత్రుల కోటరీలో సోనీ కూడా ఒకరు. 2017 నుండి యూపీఎస్‌సీ సభ్యుడిగా ఉన్న సోనీ గత సంవత్సరం దానికి ఛైర్మెన్ అయ్యారు. అయితే పదవీకాలం మరో ఐదు సంవత్సరాలు ఉన్నప్పటికీ 'వ్యక్తిగత కారణాల'తో గత నెలలో రాజీనామా చేశారు. స్వామినారాయణ్ సంస్థకు చెందిన అనూపమ్ మిషన్‌లో నాయకత్వ బాధ్యత చేపట్టేందుకే యూపీఎస్‌సీ పదవిని వదిలేశారని ఆయన సన్నిహితులు అంటారు. ఈ మిషన్‌లో ఉండేవారు 'ప్యాంటు, షర్టు ధరించిన సాధువుల'మని చెప్పుకుంటారు. ఇందులో వ్యాపారులు, వైద్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అగరు బత్తీల అమ్మకం నుంచి...

ముంబయి వీధుల్లో అగరుబత్తీలు అమ్ముకున్న సోనీ దేశ రాజధానిలో ఓ అత్యున్నత పదవిని నిర్వహించారు. మోడీ ఆశీస్సులతో యూపీఎస్‌సీ చీఫ్ పదవిని అధిష్టించిన సోనీ రాజీనామా చేయడం అనేక ఊహాగానాలకు తెర లేపింది. ఆయన ఆర్ఎస్ఎస్-సంఘ్ నియమించిన వ్యక్తి అని, నియామకాల వివాదం కారణంగానే పదవికి రాజీనామా చేశారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. అయితే ఆయన కుటుంబసభ్యులు, స్నేహితులు మాత్రం పెదవి విప్పడం లేదు. అనూపమ్ మిషన్ నాయకుడు జష్‌భాయ్ పటేల్‌తో కలిసి ప్రస్తుతం బ్రిటన్‌లో ఉన్నారని మాత్రం చెబుతున్నారు. ప్రధానితో ఉన్న సాన్నిహిత్యం కారణంగా మిషన్‌కు పేరు ప్రతిష్టలు తెచ్చారని, త్వరలో దాని బాధ్యతలు చేపడతారని మాత్రం వడోదరలో స్థానికులు అంటున్నారు.

రీడర్ నుంచి వీసీగా...

2005లో వడోదరలోని ఎంఎస్ యూనివర్సిటీకి సోనీ వైస్ ఛాన్సలర్ అయ్యారు. రీడర్‌గా జూనియర్ స్థాయి నుండి ఒక్కసారిగా ఉన్నత స్థాయికి ఎగబాకారు. మోడీ మద్దతే దీనికి కారణమని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన పూర్తి స్థాయి ప్రొఫెసర్‌గా పనిచేయకపోయినప్పటికీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్లను ఇంటర్వ్యూ చేశారు. ఆయనది రాజకీయ నియామకమని వర్సిటీ అంతా గుసగుసలాడింది. గతంలో ప్రొఫెసర్‌గా అర్హత సాధించలేకపోయిన వ్యక్తి తమను ఇంటర్వ్యూ చేసే స్థాయికి చేరడాన్ని పలువురు ప్రొపెసర్లు అవమానకరంగా భావించారు. సోనీ తన హయాంలో క్యాంపస్‌ను కాషాయీకరణ చేశారని ఆరోపణలు వచ్చాయి.


గోద్రా హింస తర్వాతే...

1990వ దశకం చివరలో యూపీఎస్‌సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న సోనీ, ఎంఏ ఫైనల్ పరీక్షలకు డుమ్మా కొట్టారు. ఆ తర్వాత ఐఎఫ్ఎస్ పరీక్షకు హాజరైనా ర్యాంక్ రాలేదు. చివరికి ఎంఏ పూర్తి చేశారు. సర్దార్ పటేల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థిగా పేరు నమోదు చేసుకున్నారు. 1991 నుంచి 2016 వరకూ అంతర్జాతీయ సంబంధాలపై విద్యార్థులకు బోధించారు. గోద్రా మారణకాండ తర్వాత 2002లో సోనీ దశ తిరిగింది. సర్దార్ పటేల్ యూనివర్సిటీలో 'గోద్రా అల్లర్లు-ఆ తర్వాత' అనే అంశంపై ఆయన ఓ సింపోజియం నిర్వహించారు. దీని ద్వారా అప్పటి విద్యా మంత్రి ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి నరేంద్ర మోడీకి చేరువయ్యారు. ఈ సింపోజియంలో వక్తలు ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రసంగాలు చేశారు. మదర్సాలపై దుమ్మెత్తిపోశారు. గోద్రా ఉదంతం నేపథ్యంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న మోడీకి ఈ కార్యక్రమం బాగా నచ్చింది.

పాదాభివందనంతో స్వామిభక్తి ప్రదర్శన

2007లో చంద్రమోహన్ అనే విజువల్ ఆర్ట్ విద్యార్థి తన పరీక్ష కోసం రూపొందించిన కొన్ని మతపరమైన పెయింటింగ్స్‌ను సోనీ తొలగించడం వివాదాస్పదమైంది. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నిరసన కారణంగా ఆయన వాటిని తొలగించారు. ఓ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు వర్సిటీ క్యాంపస్‌కు వచ్చిన నరేంద్ర మోడీకి సోనీ పాదాభివందనం చేసి తన స్వామిభక్తిని చాటుకున్నారు. వీసీగా ఉండి ఇలా చేయడమేమిటని పలువురు ప్రశ్నించారు కూడా. గుజరాత్ ప్రభుత్వంతో సోనీకి ఉన్న సన్నిహితత్వం కారణంగా క్యాంపస్‌లో ఆయనను 'ఛోటా మోడీ' అని పిలిచేవారు. వర్సిటీలో ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయం రాజకీయం అయిందని కాంగ్రెస్ నేతలు గుర్తు చేశారు. వివాదాల కారణంగా సోనీ వీసీ పదవీకాలాన్ని పొడిగించనప్పటికీ రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలకు వీసీలను నియమించడానికి ఏర్పాటు చేసిన కమిటీలపై ఆయన ముద్ర ఉండేది. సోనీ పలు వర్సిటీల పాలక మండళ్లలో సభ్యుడిగా కూడా పనిచేశారు. 2009లో గాంధీనగర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా నియమితులై రెండుసార్లు ఆ పదవిని నిర్వహించారు.

మోడీ ప్రచార ప్రసంగాలను ఆంగ్లంలో సోనీయే రూపొందించే వారు. మోడీకి ఆయన నమ్మకస్తుడైన మేధావిగా మారిపోయారు. 2014లో మోడీ ప్రధాని అయిన తర్వాత 2017లో సోనీని ఢిల్లీకి పిలిపించి యూపీఎస్‌సీ సభ్యుడిని చేశారు. ఇంటర్వ్యూల్లో ఆయన తనకు ఇష్టమైన వారిని ఎంపిక చేసుకునే వారు. నచ్చకపోతే మార్కులే వేసే వారు కారు.



రామా కనవేమిరా..?

- అయోధ్య రామపథ్‌లో దొంగతనం
- రూ. 50 లక్షల విలువైన 3,800 వెదురు దీపాలు చోరీ
- మూడు నెలల తర్వాత ప్రస్తుతం ఎఫ్ఐఆర్

లక్నో : యూపీలోని అయోధ్యలో అత్యంత సురక్షితమైన భక్తి పథ్, రామపథ్ నుంచి దాదాపు 3,800 కొత్త వెదురు లైట్లు, 36 గోబో ప్రొజెక్టర్ లైట్లు చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి సంబంధించి అయోధ్యలోని రామజన్మభూమి పోలీస్ స్టేషన్‌లో చోరీకి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దావా వాస్తవికతను పరిశీలిస్తున్నట్టు అయోధ్య పోలీసులు తెలిపారు. పోలీసు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. యష్ ఎంటర్‌ప్రైజెస్, కృష్ణ ఆటోమొబైల్స్ (లైట్ల ఏర్పాటుకు కాంట్రాక్ట్‌ను పొందిన కంపెనీలు) ప్రతినిధి శేఖర్ శర్మ రెండ్రోజుల క్రితం ఈ-మెయిల్ ద్వారా ఒక నివేదికను సమర్పించినప్పుడు దొంగతనం బయటపడింది. ఈ ఏడాది మే 9న తాను గతంలో తనిఖీ చేసిన నెల తర్వాత సాధారణ తనిఖీలో లైట్లు కనిపించకపోవటాన్ని గమనించినప్పుడు దొంగతనం జరిగిన విషయం తనకు తెలిసిందని శర్మ పేర్కొన్నారు. అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ (ఏడీఏ)తో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు రామ్‌పథ్‌లో చెట్లపై 6,400 వెదురు లైట్లు, భక్తి మార్గంలో 96 గోబో ప్రొజెక్టర్ లైట్లను ఏర్పాటు చేశాయి. సంస్థకు మేలో దొంగతనం జరిగినట్టు తెలిసినప్పటికీ, ఎఫ్ఐఆర్ మాత్రం మూడు నెలల తర్వాత(ఆగస్టు 9న) నమోదు కావటం గమనార్హం.

కాగా, ఈ విషయాన్ని ఫిర్యాదు చేయటంలో జరిగిన జాప్యాన్ని ఫిర్యాదుదారు వివరించకపోవటం పలు అనుమానాలకు తావిస్తున్నది. లైట్లను అమర్చడానికి బాధ్యత వహించే సంస్థ ముందుగా చెప్పిన దానికంటే తక్కువ లైట్లను ఏర్పాటు చేసి ఉండవచ్చని ఊహాగానాలు వెలువడుతున్నాయి. అయితే, చోరీకి గురైన లైట్ల సంఖ్య కచ్చితత్వాన్ని సమీపంలోని సీసీటీవీ ఫుటేజీ ద్వారా ధృవీకరిస్తున్నారు. విచారణలో పోలీసు అధికారులకు సహాయం చేయాల్సిందిగా శర్మను అభ్యర్థించినట్టు అయోధ్య సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజ్ కరణ్ నయ్యర్ తెలిపారు. కాగా, దొంగతనం కేసుపై ఏడీఏ నుంచి నివేదిక ఇవ్వాలని అయోధ్య డీఎం చంద్ర విజయ్ సింగ్ కోరారు.

కళాశాలల్లో ఆరెస్సెస్ నాయకులు
రచించిన పుస్తకాలు

- మధ్యప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ సిఫారసు
- కాంగ్రెస్ నుంచి వ్యతిరేకత
- మేధావులు, సామాజికవేత్తల నుంచి కూడా..

భోపాల్ : మధ్యప్రదేశ్ ప్రభుత్వం సంఘ్ సిద్ధాంతాలను, భావజాలాన్ని వ్యాప్తి చేసే పనిలో పడింది. ఇందులో భాగంగా ఆరెస్సెస్ ప్రముఖ నాయకులు రచించిన పుస్తకాలను కళాశాలల్లో ప్రవేశపెట్టే చర్యలకు దిగుతున్నది. వీటితో పాటు మరికొన్ని పుస్తకాలను చేర్చాలని చూస్తున్నది. భారతీయ సాంప్రదాయ విజ్ఞానాన్ని విద్యా పాఠ్యాంశాల్లో చేర్చే ప్రయత్నాల్లో భాగంగా వీటిని సేకరించాలని ఆదేశిస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 88 పుస్తకాల జాబితాను కళాశాలలకు పంపింది. సురేశ్ సోనీ, దీనానాథ్ బాత్రా, డి అతుల్ కొఠారీ, దేవేంద్రరావు దేశ్‌ముఖ్ వంటి ప్రముఖ ఆర్ఎస్ఎస్ నాయకులు రచించిన పుస్తకాలు ఇందులో ఉన్నాయి. వీరంతా ఆరెస్సెస్ విద్యా విభాగమైన విద్యాభారతితో సంబంధం కలిగి ఉన్నారు. వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఈ పుస్తకాలను ప్రవేశపెట్టేందుకు వీలుగా ప్రతి కళాశాలలో 'భారతీయ జ్ఞాన్ పరంపర ప్రకోష్ఠ' (భారతీయ జ్ఞాన సంప్రదాయ కణం) ఏర్పాటు చేయాలని ఉన్నత విద్యాశాఖ సిఫారసు చేసింది. కాగా, సంబంధిత సబ్జెక్టులు మాత్రమే బోధించాలనీ, కళాశాలలలో రాజకీయ భావజాలంపై విభేదాలు పెంచకూడదని కాంగ్రెస్ నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. కాగా, ఈ పుస్తకాల్లో అభ్యంతరకరం ఏమీ లేదనీ, దేశ నిర్మాణం, దేశభక్తి అనే భావజాలాన్ని తాము బోధిస్తామని బీజేపీ వెల్లడించింది. అయితే, బీజేపీ సర్కారు చర్యపై ఇటు రాజకీయంగానే కాదు.. మేధావులు, సామాజికవేత్తల నుంచి కూడా వ్యతిరకత వ్యక్తమవుతున్నది. ఆరెస్సెస్ వంటి సంస్థకు చెందిన నాయకులు రచించిన పుస్తకాలను విద్యా పాఠ్యాంశాల్లోకు చేర్చే ప్రయత్నం విద్యను కాషాయీకరణ చెందించటమేనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ 88 పుస్తకాల సెట్‌ను ఆలస్యం చేయకుండా కొనుగోలు చేయాలని మధ్యప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల ప్రిన్సిపాల్‌లకు రాసిన లేఖలో ఉన్నత విద్యా శాఖ సీనియర్ అధికారి డాక్టర్ ధీరేంద్ర శుక్లా ఆదేశించారు.

అమృత్ ఉద్యాన్ ఓపెన్
సందర్శకులకు రేపటి నుంచి అనుమతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి భవన్‌లో 'అమృత్ ఉద్యాన్ (మొఘల్ గార్డెన్)'ను ప్రజల సందర్శనార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు (శుక్రవారం) ప్రారంభించనున్నారు ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 15 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలు దీన్ని సందర్శించేందుకు అనుమతించనున్నారు. అన్ని సోమవారాల్లో సెలవు ఉంటుంది. సందర్శకులకు తమ ఇండ్ల ఆవరణలో నాటుకోవడానికి వీలుగా తులసి మొక్కల విత్తనాలతో కూడిన సీడ్ పేపర్ల'ను (విత్తన పత్రాలు) పర్యావరణహిత జ్ఞాపికగా ఇవ్వనున్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఉద్యాన వనంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా రాళ్లతో రూపొందించిన అబాకస్, ధ్వని వెలువడే గొట్టాలు, సంగీత కుడ్యాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి భవన్ ఆవరణలో 15 ఎకరాల్లో విస్తరించిన అమృత్ ఉద్యాన్‌ను ప్రజలు ఉచితంగా సందర్శించవచ్చు. దీని కోసం రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 35వ ప్రవేశ ద్వారం వద్దకు చేరుకున్నాక కియోస్కుల ద్వారా కూడా ఈ పని చేసుకోవచ్చు. సమీప మెట్రోస్టేషన్ నుంచి అక్కడికి ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు.

17న ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- పీసీసీ అధ్యక్షుల సమావేశానికి హాజరు
- భవిష్యత్తు కార్యాచరణ, పీసీసీల మార్పుపై చర్చ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆగస్టు 17న ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే పీసీసీ అధ్యక్షుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. సమావేశానికి పీసీసీ అధ్యక్షులతోపాటు రాష్ట్రాల ఇన్‌చార్జీలు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు కూడా హాజరు కానున్నారు. రాజకీయ పరిణామాలు, భవిష్యత్తు కార్యాచరణ, పీసీసీ అధ్యక్షుల మార్పు తదితరాంశాలపై చర్చించనున్నారు. త్వరలో జార్ఖండ్, మహారాష్ట్ర, జమ్మూ కాశ్మీర్, హర్యానా ఎన్నికలతోపాటు వచ్చే ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మరి కొన్ని రాష్ట్రాలలో పీసీసీ చీఫ్‌లను మార్చాల్సి ఉంది. తెలంగాణ, ఒడిశా వంటి రాష్ట్రాల్లో కొత్త పీసీసీ అధ్యక్షులను నియమించాలని అధిష్టానం భావిస్తున్నది. అదే సమయంలో కాంగ్రెస్ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో సాధించిన సీట్లు, ఓట్లపై చర్చించనుంది. ఎన్నికలు రాష్ట్రాల్లో ఏయే పార్టీతో పొత్తు పెట్టుకోవాలనే విషయంలో ఏఐసీసీ దిశా నిర్దేశం చేయనుంది. ఇప్పటికే ఇండియా కూటమి పక్షాలతో కాంగ్రెస్‌కు పొత్తులున్నాయి. కొన్ని రాష్ట్రాలలో ఒంటరిగా ముందుకు వెళ్తుంది. ఆయా చోట్ల కాంగ్రెస్ అనుసరించే విధానంపై కూడా కీలక సూచనలు చేయనున్నారు. దాదాపుగా ఎనిమిది నుంచి పది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న పీసీసీ చీఫ్‌లను మార్చాలని కాంగ్రెస్ అధిష్టానం ఆలోచిస్తున్నట్లుగా పార్టీ వర్గాలు చెప్పాయి సమావేశానంతరం తెలంగాణ రాష్ట్రానికి కొత్త సారధి రానున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుత రాష్ట్ర పీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన అధ్యక్షపదవీ కాలం కూడా ముగియడంతో కొత్త వారిని నియమించాలని అధిష్టానం కసరత్తు చేస్తున్నది.

ఆ దశలో పోటీ తీవ్రం కావడంతో ప్రక్రియను పెండింగ్‌లో పెట్టినట్టు తెలిసింది. ఎంపిక తుది దశకు చేరినా చివరి నిమిషంలో వాయిదా వేస్తూ వచ్చింది. ఇది కూడా ఈ సమావేశంలో కీలకంగా చర్చకు రానుంది. దేశ వ్యాప్తంగా పార్టీ బలోపేతం, కుల గణన, ఆయా రాష్ట్రాల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించనున్నారు. మారుతున్న రాజకీయ పరిణామాలతో బలమైన పోరాటం చేసేందుకు పార్టీని సిద్ధం చేసే దిశగా సూచనలు చేయనున్నారు.

రామడుగు బ్రిడ్జిని త్వరలో ప్రారంభిస్తాం

చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం


రామడుగు బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - రామడుగు

రామడుగు బ్రిడ్జిని త్వరలో ప్రారంభిస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రామడుగు వాగుపై నిర్మించిన బ్రిడ్జిని బుధవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో బ్రిడ్జి నిర్లక్ష్యానికి గురైందన్నారు. అధికారులతో కలిసి బ్రిడ్జి భూనిర్వాసిత రైతులతో మాట్లాడి రెండు మూడు రోజుల్లో పరిహారం వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటూ బ్రిడ్జిపై నుంచి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో సంగి రాజేశ్వరీ, నాయకులు పులి ఆంజనేయులుగౌడ్, జవ్వాజి హరీష్, వీర్ల నర్సింగరావు, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఆడెపు రంగన్న పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఇంకా వెనుకబాటుతనమే

- 78ఏండ్ల స్వాతంత్ర్య ఫలాలు అందని పేదలెందరో...
- కనీస వేతనాలు, కూలి దొరక్క అవస్థలు పడుతున్నవారూ ఎందరో..
- ఉన్నత చదువులున్నా.. సెక్యూరిటీ ఉద్యోగాలకూ పోటీపడుతున్న పరిస్థితులు
- జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఏనాడూ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించలే!
- పర్యవసానంగా కునారిల్లుతున్న విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు
- మతవిభజన రాజకీయాల్లోనే కేంద్రంలోని బీజేపీ పాలన తీరు
- హామీగానే ఏటా 2కోట్ల ఉద్యోగాల కల్పన
- సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి
- నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఇంటర్వ్యూ...

'78 ఏండ్ల స్వాతంత్ర్య దేశంలో ఇంకా వెనుకబాటుతనమే తాండవిస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఎందరో నేతలు రాష్ట్ర స్థాయి మొదలు దేశ ప్రధానివరకూ అనేక అత్యున్నత పదవుల్లో రాణించినప్పటికీ ఈ ప్రాంతం ఆర్థిక, సామాజిక రంగాల్లో ఆశించిన అభివృద్ధికి నోచుకోలేదు. సరికదా.. కనీసం విద్య, వైద్యం, సాగు, పారిశ్రామిక రంగాలు సహా ఉపాధి, ఉద్యోగావకాశాలూ మెరుగుపడలేదు. పాలకులు మారుతున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా.. ఏనాడూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించకపోవడంతో అన్ని రంగాలూ కునారిల్లి తీవ్ర ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయి. ఉన్నత చదువులున్న వారూ అటెండర్ జాబ్‌కు క్యూకడుతున్న స్థితికి చేరుకుంది.' అని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరివాసుదేవరెడ్డి చెప్పకొచ్చారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం, పంద్రాగస్టు సందర్భంగా తీసుకొచ్చిన ప్రత్యేక సంచికలో జిల్లా పరిస్థితులు, అవసరాలపై విశ్లేషించిన అంశాలు ఆయన మాటల్లోనే....

- నవతెలంగాణ, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి



ఇన్నేండ్ల స్వాతంత్ర్య దేశంలో ఉమ్మడి జిల్లా నుంచి మాజీ ప్రధాని పీవీ మొదలుకుని ఎందరో నేతలు కేంద్ర స్థాయిలో అత్యున్నత పదవులు అనుభవించారు. కానీ ఉమ్మడి జిల్లాకు అవసరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడంలో ఏ మాత్రమూ కృషి చేయలేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో ఎన్‌టీపీసీ, సింగరేణి తప్ప ఏ ప్రభుత్వ రంగ పరిశ్రమలూ లేవు. అందులో ప్రధానంగా వ్యాపారానికి రవాణా సౌకర్యమైన రైలుమార్గాలు ఇప్పటికీ పూర్తికాలేదు. ఈ జిల్లాలో ఎక్కాల్సిన రైల్లు జీవితకాలం లేటు అన్న చందంగా మారింది. రాష్ట్ర విభజనలో భాగంగా జిల్లాకు ట్రిబుల్ ఐటీ హామీగానే మిగిలిపోయింది. వైద్య రంగంలో ప్రభుత్వ వైద్యం ఇప్పటికీ అందని ద్రాక్షలాగానే మారింది. ప్రభుత్వ దవాఖానాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రయివేటు ఆస్పత్రులపై ప్రభుత్వ నియంత్రణ కొరవడింది. ఫలితంగా ఇష్టానుసారంగా రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. మల్టీస్పెషాలిటీ స్థాయి పేరున్న ఆస్పత్రులు సహా చిన్నాచితక ఆస్పత్రులు కూడా పీఆర్ఓ సిస్టమ్ ఏర్పాటు చేసుకుని కింది స్థాయిలో కమీషన్లు అందిస్తూ ఆస్పత్రుల్లో చేర్చుకున్న రోగుల నుంచి డబ్బులు దండుకుంటున్నాయి.

ఆర్థిక అసమానతలు, సామాజిక విభజనలు

దేశంలో బీజేపీ పాలనలో మత విభజన రాజకీయాలు పెట్రేగిపోయాయి. పదేండ్లు అధికారంలో చేసిన విభజన రాజకీయాలే మళ్లీ అధికారంలో వచ్చాక కూడా కొనసాగిస్తోంది. పైగా లౌకికతత్వం, సామాజిక న్యాయానికి కేంద్రంలోని బీజేపీ తూట్లు పొడుస్తోంది. మతవిభజన రాజకీయాలు సాగిస్తూ యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మాటను అటకెక్కించింది. ప్రస్తుతం ఆకలిసూచికలో దేశం 111స్థానానికి దిగజారే పరిస్థితులకు తీసుకొచ్చింది. ఈ ప్రభావం దేశస్థాయి మొదలు జిల్లాపైనా ప్రభావాన్ని చూపుతోంది. జిల్లా ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత వెనుకబాటుతనానికి గురవుతోంది.

కుదేలవుతున్న సాగురంగం...

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాష్ట్రంలో సీడ్‌బౌల్ ప్రాంతంగా నిలిచింది. ఇక్కడి నేలలు విత్తన ఉత్పత్తికి అనువుగా ఉన్నా.. ఇప్పటికీ కొత్త వంగడాలు, వాణిజ్య విత్తనాల ఉత్పత్తి లేకుండా పోయింది. పైగా కేవలం వరి సాగునే ప్రోత్సహిస్తూ వచ్చినా కేవలం రైస్‌మిల్లు పరిశ్రమనే సాగుతోంది. ఇక మిగిలిన పంట ఊసేలేదు. కనీస వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడం లేదు. ఫలితంగా ఇతర పంటల సాగు కనుమరుగుకాగా.. కనీసం వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఊసే లేకుండా పోయింది. కనీసం చెరుకురైతులకు ఒకప్పుడు బాసటగా నిలిచిన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని ఏండ్ల కిందటే మూతేసిన పాలకులు దాన్ని తెరిచే ప్రయత్నం చేయడం లేదు. సరికదా.. ఆ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ హామీలు, పర్యటనలు చేస్తూ అక్కడి చెరుకు రైతులను ఓటుబ్యాంకుగానే చూస్తున్నారు. ఇక జగిత్యాల జిల్లా నుంచి మొదలు నిజామాబాద్ వరకు పెద్దఎత్తున పసుపు పండిస్తున్నా.. ఆ పంటకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లుగానీ, అనుబంధ పరిశ్రమలుగానీ ఏ ఒక్కటీ స్థాపించలేదు. సరికదా పసుపు బోర్డు పేరుతో కేంద్రంలోని బీజేపీ పదేండ్లుగా అక్కడి రైతాంగాన్ని మభ్యపెడుతూ చివరికి చేతులెత్తేసింది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగింది. దానికి అనుగుణంగా ఇన్‌పుట్ సబ్సిడీ కింద కనీసం పరికరాలు ఇవ్వడం లేదు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదు. 'వ్యవసాయమే దండగ' అన్న పరిస్థితులను తీసుకొస్తున్నారు.

కునారిల్లుతున్న విద్యారంగం

ముఖ్యంగా విద్య ప్రయివేటుపరం అయింది. ప్రభుత్వ విద్య కునారిల్లి పేద, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. పాఠశాలస్థాయిలో ఫీజుల నియంత్రణ లేక ఎల్‌కేజీకే రూ.లక్ష వరకు వసూలు చేస్తున్న పరిస్థితులు దాపురించాయి. ఇక ఇంటర్ విద్యలోనూ ఎంపీసీ, బైపీసీ కోర్సులు తప్ప మిగిలిన ఏ కోర్సులోనూ ప్రవేశాలకు ప్రోత్సాహకం లేదు. ఫలితంగా ఇంటర్మీడియెట్ తరువాత పిల్లలందరూ ఇంజినీరింగ్ కోర్సుల్లోనే వెళ్తున్నారు. ఫలితంగా జిల్లాలోని శాతవాహన యూనివర్సిటీ పరిధిలో పదేండ్లుగా ప్రవేశాలు తగ్గుతూ వస్తున్నాయి. పైగా ఆ వర్సిటీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల ఆధారంగా కొత్త కోర్సులు లేకపోవడం, ఉన్న కోర్సుల్లో పరిస్థితులు దిగజారడం వంటి పరిస్థితుల్లో డిగ్రీ, పీజీ కోర్సు విద్య కునారిల్లుతోంది. మరోవైపు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను నాలుగేండ్లుగా ప్రభుత్వం బకాలు పెట్టడంతో ప్రయివేటు కాలేజీలూ మూతపడే స్థితికి చేరుకున్నాయి. ఉన్న వాటిల్లో విద్యానాణ్యతాప్రమాణాలకు తిలోదకాలు వదిలి క్వాలిఫైడ్ కాని అధ్యాపకులతో నామమాత్రంగా నడిపిస్తున్నారు. ఇది ఒక్క డిగ్రీ, పీజీ కోర్సుల్లోనే కాకుండా ఇంజినీరింగ్ విద్యలోనూ కనిపిస్తోంది.

డెంగ్యూ, అనిమియాపై అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్ కలెక్టర్ - జిల్లా ప్రధాన ఆస్పత్రిలో తనిఖీ

నవతెలంగాణ - కరీంనగర్

జిల్లాలో డెంగ్యూ అనిమియా వంటి వ్యాధులు ప్రబలకుండా జిల్లా వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి రిజిస్ట్రేషన్ మొదలుకొని జనరల్ వార్డు, బ్లడ్‌బ్యాంక్ వరకు ప్రతి విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు నిర్వహించే వైద్య పరీక్షలను పరిశీలించాలని, డెంగ్యూ వంటి జ్వరాలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల్లో ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న వారి వివరాలు, వారి కేస్ షీట్లు పరిశీలించారు. అనంతరం ఫిర్దోస్, సమతను కలెక్టర్ పలకరిస్తూ, ఆస్పత్రిలో ఎందుకు చేరారు, ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడంతో పాటు అందిస్తున్న వైద్యం గురించి వివరాలను వాకబు చేశారు. ఆస్పత్రిలో ఎక్కువ మంది జనం ఉన్నచోట బెంచీలను ఏర్పాటు చేయాలని, ప్రతి అంతస్థులోని వార్డులలో మంచినీటిని అందుబాటులో ఉండాలని తెలిపారు.

శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్


మాట్లాడుతున్న శనిగరపు రజనీకాంత్

నవతెలంగాణ- కరీంనగర్

దేశ వ్యాప్తంగా శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని, నూతన విద్యా విధానం 2020 రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో 10 శాతం నిధులు విద్యా రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆగస్టు 12, 13వ తేదీలలో కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులకు సహకరించిన కళాశాల, పాఠశాల యాజమాన్యాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్షులు అరవింద్, జిల్లా గర్ల్స్ శ్రీజ, జిల్లా ఉపాధ్యక్షులు రోహిత్, అభిలాష్, జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, ఇసాక్, శ్రీజ, బోగేశ్, జిల్లా కమిటీ సభ్యులు గట్టు ఆకాశ్, సురేష్, రాకేష్, రాక్షక్, సందీప్, సందేశ్, సుధీర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ మానకొండూర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



నవతెలంగాణ - మానకొండూర్

స్వచ్ఛ మానకొండూర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని.. అభివృద్ధికి ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మానకొండూరు గ్రామ అభివృద్ధిపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ మండల శాఖ అధికారులు, ప్రజలు, వ్యాపరస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన మానకొండూర్ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. కరీంనగర్ - వరంగల్ ప్రధాన రహదారికి ఇరువైపుల 45 ఫీట్లలోపు అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. ప్రతి ట్రేడ్ లైసెన్స్ లేని వారు తీసుకోవాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి, డిఆర్డిఓ శ్రీధర్, ఎంపీడీఓ వరలక్ష్మీ, ఎంపీవో కిరణ్ కుమార్, కార్యదర్శి రేవంత్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటా తిరంగా జెండా ఎగరవేయండి..

కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్

నవతెలంగాణ-కరీంనగర్ : ప్రతి ఇంటా మూడు రంగుల జెండా ఎగురవేయాలని, తద్వారా దేశ సమైక్యతకు సంఘటిత శక్తికి సంకేతం ఇవ్వాలని కరీంనగర్ ఆర్‌డీఓ మహేశ్వర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, సంగీత నాటక అకాడమీ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ కరీంనగర్ సంయుక్త నిర్వహణలో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలో జరిగిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కుల, మతాలకు అతీతంగా మనమందరం కలిసికట్టుగా దేశమాతను గౌరవించాలన్నారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, ఎస్సారార్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృపాదానం, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్‌రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఆధ్వర్యంలో తిరంగా సైకిల్ ర్యాలీ



నవతెలంగాణ - కరీంనగర్ : భారతదేశ స్వాతంత్ర్యం చాలా ఆదర్శనీయమైనదని, ఇతర దేశాలకు మార్గదర్శకమని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. డాక్టర్ కెప్టెన్ బి.మధుసూధన్‌రెడ్డి, ఇతర సంఘ ప్రతినిధులతో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్స్ మైదానంలో ఏర్పాటు చేసిన తిరంగా సైక్లింగ్ ర్యాలీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురభి వేణుగోపాల్, సభ్యులు ఎం.అరవింద్ బాబు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలలో ప్రణవ్‌బాబు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - జమ్మికుంట

మానసిక దివ్యాంగుల విద్యార్థులకు అండగా ఉంటానని, మొట్టమొదటి సారిగా అనాథశ్రమంలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో ప్రణవ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రణవ్ స్వయంగా భోజనము వడ్డించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి, పూదరి రేణుకశివకుమార్, బొంగోని వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ - చొప్పదండి : మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని చొప్పదండి సిఐ ఆర్.ప్రకాష్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు మత్తు పదార్థాలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్సై అనూష, నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాలకొండపల్లిని ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న న్యాలకొండపల్లి గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. ప్రత్యేక జీపీ ఏర్పాటుకు అవసరమైన జనాభా ఉందని, ఈ దష్ట్యా న్యాలకొండపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించాలని ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ సేవలకు అత్యుత్తమ పురస్కారం

ఐపిఎంకు ఎంపికైన హెడ్‌కానిస్టేబుల్ ఉండంటి శ్రీనివాస్

నేడు సీఎం చేతుల మీదుగా అందుకోనున్న మెడల్



నవతెలంగాణ, కరీంనగర్

నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావానికి మారుపేరుగా నిలిచే ఓ పోలీసు సేవలకు తగిన గుర్తింపు లభించింది. రాష్ట్రంలోని పోలీసు శాఖలో అత్యుత్తమ సేవలందించే వారికి అందించే ఇండియన్ పోలీస్ మెడల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ శాఖలోని ఇంటలిజెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉండంటి శ్రీనివాస్‌ను ఈఏడాది వరించింది. నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గోల్కొండ కోటలో అందుకోనున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని మానకొండూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ 1990లో పోలీసు శాఖలో చేరారు. అతని క్రమశిక్షణను గుర్తించిన పోలీసు శాఖ 2016లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించింది. విధి నిర్వహణలో అత్యంత సమర్ధవంతంగా పనిచేస్తుండగా, పోలీసు శాఖ సేవా పతకంతో పాటు 26సార్లు నగదు రివార్డులు, 18 జిఎస్ఈలు, ఒకటి కమాండేషన్, తొమ్మిదిసార్లు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ధర్మపురి, కరీంనగర్ 2 టౌన్, అడవి ముత్తారం, పోత్కపల్లి, కరీంనగర్ 1టౌన్, స్పెషల్ బ్రాంచ్ కరీంనగర్, స్పెషల్ బ్రాంచ్ సిరిసిల్ల, గంభీరావుపేటలో పనిచేసినారు. ప్రస్తుతం కరీంనగర్ ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్నాడు. ఆగస్ట్ 15న ఆయన చేసిన సేవలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోబోతున్నారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులతో పాటు ఆయన మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

రోడ్డుకు మరమ్మతులు



నవతెలంగాణ - రామడుగు : బురద రోడ్డుతో ఇబ్బందులు అనే శీర్షికతో నవ తెలంగాణ దినపత్రిక సోమవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. దేశరాజుపల్లి గ్రామానికి కొత్తగా వచ్చిన కార్యదర్శి భవాని స్పందించి రజకవాడలోని (రాంనగర్) బీడీ కంపెనీ వద్ద బురద మయమైన ప్రదేశంలో మొరంతో బుధవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మిగిలిన ప్రదేశంలో మరమ్మతులు చేపడతామని కార్యదర్శి తెలిపారు.

మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగించాలి

బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి


తహసిల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సుమారు రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన విగ్రహాలపైనున్న ముసుగులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ తిమ్మాపూర్ బీజేపీ నాయకులు తహసీల్దార్ విజయ్ కుమార్‌ను వినతిపత్రం ద్వారా కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరా చారి ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం కార్యకర్తలు చేరుకున్నారు. ముందస్తు సమాచారంతో తిమ్మాపూర్, గన్నేరువరం, చిగురుమామిడి ఎస్సైల ఆధ్వర్యంలో సుమారు 100 మందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు. అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహాలపై ఉన్న ముసుగులను తొలగించాలని సుగుర్తి జగదీశ్వరాచారి డిమాండ్ చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతిరెడ్డి, నాయకులు దుర్సెట్టి రమేష్, ఎడ్ల భూంరెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో నష్టాలు, నివారణపై వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ - వీణవంక

డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలు, నివారణ ఉపాయాలు అనే అంశంపై పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వీణవంక పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని హైస్కూలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలు ఎస్.నికిత, జి.అభివర్దన్, హర్షిత, వైష్ణవి, ఆర్.నీరజ్‌కు జమ్మికుంట రూరల్ సీఐ కోరే కిషోర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వీణవంక ఎస్సై తోట తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటే మొక్కలకు జూట్ బ్యాగులను వినియోగించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ఎమ్మెల్యే సత్యనారాయణతో కలిసి మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల్లో పరిశీలన


తిమ్మాపూర్ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నవతెలంగాణ - తిమ్మాపూర్/మానకొండూర్

నాటే మొక్కలకు జూట్ బ్యాగులను వినియోగించాలని, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల్లో బుధవారం పర్యటించారు. మానకొండూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. డోర్ టూ డోర్ ఫీవర్ సర్వే వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, మొక్కలను నాటే కార్యక్రమాలకు కార్యాచరణను సిద్ధం చేయాలని,


మానకొండూర్ : భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

బీమాయోజన పథకాల గురించి శానిటేషన్, పంచాయతీ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటే మొక్కలకు పాలిథిన్ కవర్ లతో కాకుండా జూట్ బ్యాగులతో నాటాలన్నారు. జెడ్పీహెచ్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించి, ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని, స్టడీ సర్కిల్ భవన నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించారు.

అనంతరం తిమ్మాపూర్ ఎల్ఎండి కాలనీలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలను సందర్శించి పాఠశాలలో తరగతుల నిర్వహణను పరిశీలించారు. పిల్లల్లో ఆలోచన శక్తి, జ్ఞాపక శక్తి ఎక్కువగా ఉంటాయి కాబట్టి వారు చదువుకోవడానికి వీలుగా పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. చివరగా పాఠశాలలోని డైనింగ్ హాల్ ను పరిశీలించడంతో పాటు పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు.

కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి సుజాత, డిఆర్డిఓ శ్రీధర్, మెడికల్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, మానకొండూర్, తిమ్మాపూర్ తహసీల్దార్లు రాజేశ్వరి, విజయ్, ఎంపిడిఓలు వరలక్ష్మీ విజయ్, యంపిఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు

నవతెలంగాణ - వీణవంక : హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైన వారికి అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వాల బాలకిషన్, ఎంపీపీ రేణుక తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని ఆర్నకొండ నుంచి రుక్మాపూర్ వరకు బుధవారం బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు మావురం సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్, బత్తుల లక్ష్మీనారాయణ, తోట కోటేష్ పటేల్, గుంట రవి, ఏలేటి లావణ్యతిరుపతిరెడ్డి, గుడిపాక సురేష్, మొగిలి మహేష్, తిరుపతి, గంగిడి వెంకటరమణారెడ్డి, గొల్ల గట్టయ్య పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, మానసిక ఒత్తిడి నివారణ అంశంపై విద్యార్థులకు బుధవారం సైక్రియాట్రిస్ట్ డాక్టర్ పృథ్విరెడ్డి అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య చుట్టుముడితే విద్యార్థులు 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్‌చేసి సమస్య తీవ్రతను వివరిస్తే పరిష్కారం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేతారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పోచయ్య, నాగేశ్వరరావు, రాజేందర్ రాజు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం



నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండల తహసీల్దార్‌గా ఇటీవల రమేష్ బాబు బాధ్యతలు చేపట్టారు. బుధవారం పట్టణ, రూరల్ రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు మొలుగూరి మొగిలి, పంజాల లింగమూర్తి ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు రాజకుమారి, ఉమాదేవి, కె.పద్మ, రాజమణి, ప్రభాకర్, శ్రీదేవి, సరళ, జయలక్ష్మి, సమ్మయ్య, మొగిలి, రాజు, అయిత దయాకర్, సుప్రియ, వెంకటేశ్వర్లు, రమాదేవి, మీర్జా మోయిన్ బేగ్ పాల్గొన్నారు.

మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్సై కిరణ్‌రెడ్డి

నవతెలంగాణ - గంగాధర : విద్యార్థులు మత్తు, మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై కిరణ్‌రెడ్డి అన్నారు. గంగాధర మండలం ఒద్యారం జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం నషా ముక్తి భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ - నిరోధముపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

నవతెలంగాణ-మానకొండూర్ : మానకొండూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బుధవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావు సౌండ్ సిస్టం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, నాయకులు పిట్టల మధు, పిండి సందీప్ ఉన్నారు.

రామడుగు బ్రిడ్జికి మరమ్మతులు

నవతెలంగాణ - రామడుగు : మండల కేంద్రం శివారులోని మోతె వాగుపై పురాతన బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకుడు పంజాల శ్రీనివాస్ గౌడ్ బుధవారం బ్రిడ్జిపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జగిత్యాల
గురువారం ఆగస్టు 15, 2024 www.navatelangana.com

సీఎం, ఐటీ మంత్రికి స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మెట్‌పల్లి



పెట్టుబడుల వేటలో అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకొని హైదారాబాద్‌కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబులకు ఘన స్వాగతం లభించింది. శంషాబాద్ విమానాశ్రయం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్, మెట్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకుడు ఇల్లెందుల రాజు, కంబ సురేష్, పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

- ఆరు బృందాలుగా ఏర్పడి గాలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్

నవతెలంగాణ-మెట్‌పల్లి



వివరాలు తెలుపుతున్న ఎస్పి అశోక్ కుమార్



నిత్యావసర వస్తువులు అందిస్తున్న ఎస్పీ

మెట్‌పల్లి పట్టణంలో మంగళవారం సాయంత్రం జరిగిన బాలుడి కిడ్నాప్ కేసును పోలీసులు 24 గంటలు గడవకముందే ఛేదించి బాలున్ని తల్లి తండ్రులకు అప్పగించారు. బుధవారం మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని దుబ్బవాడకు చెందిన లక్ష్మి, రాజులకు కూతురు రెండేళ్ల కుమారుడు ఉన్నారు. బుధవారం సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో అక్కతో కలిసి దుకాణానికి వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పల్సర్ బైక్‌పై వచ్చి బాలికకు 20 రూపాయలు ఇచ్చి దుకాణంలో కొనుక్కొమ్మని చెప్పి బాలిక వెళ్ళగానే రెండేళ్ల బాలున్ని బైక్‌పై ఎక్కించుకొని పరార్ అయ్యాడు. ఈ విషయాన్నీ బాలిక తల్లికి చెప్పగా 100కి డయల్ చేయగా ఎస్ఐ. రాజు ఘటన స్థలంలో వివరాలు సేకరించి సీసీ పుటేజ్ ఆధారంగా నిందితుడి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ చేసిన పోలీసులు డీఎస్పీ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో 6 బృందాలుగా ఏర్పడి కేసును దర్యాప్తు



తల్లి ఒడిలోకి చేరిన బాలుడు

ప్రారంభించారు. బుధవారం మధ్యాహ్నం బాలున్ని ఎక్కించుకొని ఓ వ్యక్తి వెంకట్‌రావ్‌పేట్ అర్బన్‌కాలనీ వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు కిడ్నాపైన బాలున్ని గుర్తించి ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట్ గ్రామానికి చెందిన ఇస్లావత్ నాగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. తక్కువ సమయంలో కేసు చెదనలో చురుగ్గా వ్యవహరించిన సీఐలు నిరంజన్‌రెడ్డి, సురేష్, లక్ష్మీనారాయణ, ఎస్ఐలు చిరంజీవి అనిల్, రాజు, కిరణ్‌కుమార్, స్పెషల్ పార్టీ సిబ్బందిని ఎస్పి అభినందించారు. నిందితుడు బాలున్ని రూ.1.5 లక్షలకు అమ్మలనే పథకం ప్రకారమే ఈ కిడ్నాప్ చేశాడని ఎస్పీ తెలిపారు. నిందితునికి ఇదివరకే నెర చరిత్ర ఉందని, విచారణ అనంతరం మరిన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందన్నారు. బాలుడి కుటుంబానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ సోసైటీ సభ్యులు బాలునికి కావలసిన ఆట వస్తువులతో పాటు నిత్యావసర వస్తువులు అందించారు.

పోలీస్ సార్లు సల్లగా ఉండలే..

తన కొడుకును తనకు అప్పగించినందుకు బాలుడి తల్లి లక్ష్మి పోలీసులకు దండం పెట్టింది. పోలీస్ సార్లు సల్లంగ ఉండాలంది. రాత్రంతా తన కొడుకు కోసం ఎదురు చూశానని నిద్రకూడ పోలేదని, తన కొడుకును తనకు అప్పగించిన పోలీసు సార్లు సల్లగా ఉండాలని వేడుకుంది.

కుక్కల దాడిలో పలువురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



మండలంలోని డబ్బా గ్రామంలో పలువురిపై పిచ్చి కుక్కలు దాడి చేసి, తీవ్రంగా గాయపర్చాయి. డబ్బా గ్రామానికి చెందిన క్యాతం లక్ష్మి, పుప్పాల నిహంత్‌లపై కుక్కలు దాడి చేయ డంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఆరు బయట ఆడుకుంటున్న నిహంత్‌పై కుక్క దాడి చేసింది. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువ కావడంతో వాటిని నియంత్రించాలని గ్రామస్తులు కోరు తున్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులకు పరామర్శ



విద్యార్థులను పరామర్శిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

నవతెలంగాణ - మెట్‌పల్లి

గొల్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌లో మంగళవారం ఫుడ్ పాయిజన్‌తో తీవ్ర అస్వస్థతకు గురి అయి జగిత్యాల పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాలికలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ జడ్పీ చైర్మన్ దావా వసంతతో కలిసి పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును డాక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించి రాష్ట్రంలో ఎక్కడ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పిన రోజే విద్యార్థులు అస్వస్థతకు గురికావడం చూస్తుంటే నాయకుల చిత్తశుద్ధి తెలుస్తుందన్నారు.

ఖాదీలో డైయింగ్ ప్రక్రియ ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న ఖాదీ బోర్డు చైర్మన్ విద్యాసాగర్ రావు

నవతెలంగాణ-మెట్‌పల్లి

పట్టణంలోని ఖాదీ భవనంలో ఖాదీ ఉత్పత్తులను రంగులు అద్దె కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, ఖాదీ బోర్డు చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పూజలు నిర్వహించి ప్రారంభించారు. నేటి నుంచి ఖాదీ ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మెట్‌పల్లి ఖాదీ లోన్ డైయింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదీ మేనేజర్,సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పశువుల లబ్ధిదారులకు శిక్షణ

నవతెలంగాణ-కథలాపూర్

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు పాడిపశువులు, పెరట్లో కోళ్ల యూనిట్లపై శిక్షణ ఇచ్చినట్టు మండల పశు వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలు యూనిట్ తీసుకున్నవారు కచ్చితంగా వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరహరి, పశు వైద్యాధికారి దివ్య సీసీలు తదితరులు పాల్గొన్నారు.

తుర్తివాసికి ఎల్‌వోసీ మంజూరు

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలోని తుర్తి గ్రామానికి చెందిన జపనడిపి మల్లేశం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం డబ్బులు అవసరం కాగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ద్వారా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం రూ.1,25,000లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేయించారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ.?

రిజిస్ట్రేషన్ కోసం రూ.30 వేలు డిమాండ్.?

నవతెలంగాణ-డెస్క్



ఎంపిడిఓ కార్యాలయం ఎదుట గ్రామస్తుల బైఠాయింపు

రాయికల్ మండలంలోని కైరీ గూడెం గ్రామానికి చెందిన చీపెల్లి బీమారెడ్డి ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేసిన పట్టా భూమిని నాలా కన్వర్షన్ చేసి ఇంటి నెంబర్ కేటాయించి రిజిస్ట్రేషన్ చేపించేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శికి రూ.30వేలు లంచం ఇచ్చానని ఆరోపిస్తూ బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ఎంపీడీవో బి .చిరంజీవికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీమారెడ్డి మాట్లాడుతూ.. పట్టా భూమిని నాలా మార్పిడి చేసి, మిగులు భూమినితన పేరున రిజిస్ట్రేషన్ చేయడానికి డబ్బులు తీసుకుని కేవలం అసెస్ మెంట్ పేపరు ఇచ్చి, తాను ఇచ్చిన డబ్బుల మందం పని అయిపోయిందని పంచాయతీ కార్యదర్శి తెలపడంతో మోసపోయినట్లు తెల్సుకుని పంచాయతీ కార్యదర్శి నుండి డబ్బులు ఇప్పించాలని కోరుతూ ఎంపీడీవోకు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా ఇంటి అనుమతి కోసం సంవత్సరం క్రితం పంచాయతీ కార్యదర్శికి డబ్బులు ఇచ్చినట్లు బాధితుడు తెలిపారని, సంబంధిత పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేస్తున్నామని, సమగ్ర విచారణ కోసం ఎంపీఓకు ఆదేశాలు ఇచ్చామని, విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ తెలిపారు.

అభివృద్ధి పనుల కోసం ఎంపీకి వినతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



మండలంలోని వేములకుర్తి శివారులో గల గోదావరిపై 1959లో నిర్మించిన గంగనాల అయకట్టు కాలువకు ప్రత్యేక తూమ్‌ను ఏర్పాటు చేసి సాగునీరందించాలని స్థానిక బీజేపీ నాయకులు నిజామాబాద్ ఎంపీ అరవింద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గంగనాల ఆయకట్టు ఇబ్రహింపట్నం మండలంలోని వేములకుర్తి, యామపుర్, ఫకిర్‌కొండాపూర్, మల్లాపూర్ మండలం లోని నడికుట, మొగిలిపేట్, ఓబులపపూర్, సంగెం శ్రీరాంపుర్, దాంరాజ్‌పెల్లి, వాల్గొండ గ్రామాల్లో 3 వేల ఎకరాలకు సాగునీరందు తుందన్నారు. ఎగువన నిర్మల్ జిల్లా పోస్‌కల్-జగిత్యాల జిల్లా ములరాంపుర్ గ్రామల మధ్య 55 గేట్లతో సదర్ మాట్ బ్యారేజ్ నిర్మాణంతో గంగనాలకు నీరు రావడం లేదని ఎంపీకి వివరించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ప్రత్యేక తూమ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు కోటగిరి వెంకటస్వామి, మాలేపు శ్రీనివాస్, అరె రమేష్, పోన్నం గణేష్, సున్నం రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన

నవతెలంగాణ-డెస్క్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గొల్లపెల్లి మండల కేంద్రంలోని స్థానిక మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే వసతి గృహాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఆకుల శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆహారం, ఆరోగ్య విద్య పట్ల అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ లేకుండా చూడాలన్నారు. జ్వరం, వాంతులు, వీరేచనాలు అయినప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేసుకొని మందులు తీసుకోవాలని సూచించారు. ఆర్బీఎస్కే టీం వచ్చినప్పుడు హెచ్బీ పరీక్ష చేసుకొని రక్తహీనత గల విద్యార్థులు ఐరన్ మాత్రలు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ లవకుమార్, సూపర్వైజర్ నరేందర్, ఏఎన్ఎం రజిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-చొప్పదండి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ 18 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ ముని గాలరాజేందర్, తహసీల్దార్ నవీన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, ముని గాల సుధాకర్, పెరుమండ్ల గంగయ్య, మునిగాల చందు, ఎడవల్లి జనార్దన్, వల్లాల కృష్ణ, హరి, కట్టె కోల లక్ష్మణ్, దామర విద్యాసాగర్‌రెడ్డి, రాపేల్లి ఐలయ్య, కనుమల్ల రాజశేఖర్ పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని ఆయా గ్రామాలలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని అన్నారు. ఈయన వెంట మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు డీలర్ మల్లయ్య, కాటిపెల్లి ఆదిరెడ్డి ముద్దం శరత్‌గౌడ్, నరేష్‌రెడ్డి, బండి లింగస్వామి, ఆదిరెడ్డి డబ్బా రమేష్, గౌర్ నాగేష్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ప్రారంభించినట్టు జిల్లా కో-ఆర్డినేటర్ చల్యాజి నాగేశ్వర్ రావు, సుడీ సెంటర్ ఏప కో ఆర్డినేటర్, ప్రధానోపాధ్యాయులు పిన్నం శెట్టి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషనులు ప్రారంభమైనట్టు తెలిపారు. బడి మధ్యలో మానేసిన వారికి, 10వ తరగతి ఫెయిల్ అయి 14 సంవత్సరాలు నిండిన వారు పదో తరగతి చదువుకునే అవకాశం కల్పించారు. 15 సంవత్సరాలు నిండి పదో తరగతి పూర్తి అయిన వారు, ఇంటర్ ఫెయిల్ అయినవారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు అడ్మిషన్లు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు.

తండ్రి జ్ఞాపకార్థం పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ న అందజేస్తున్న లింగాల గంగమ్మ

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన లింగాల గణేష్ తన తండ్రి నారాయణ జ్ఞాపకార్థం 20వేల రూపాల కంప్యూటర్‌ను తన తల్లి గంగమ్మ చేతుల మీదుగా బుధవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన ఉండాలని ఉద్దేశంతో దీనిని అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లెడ గంగాధర్, వేముల రాజశేఖర్ గౌడ్, వెల్మల సురేందర్, అరెల్లి మినయ్య పాల్గొన్నారు.

సిర్పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో వాటర్ ప్యూరిఫైడ్ ప్రారంభం



ప్రారంభిస్తున్న నర్సింగ్ రావు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని సిర్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి స్వంత నిధులతో ఏర్పాటు చసిన మినరల్ ప్యూరిఫైడ్ మిషన్‌ను కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల దాహం తీర్చేందుకు ప్యూరిఫైడ్ ఏర్పాటు చేసిన నల్ల బాపురెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్ల అధ్యక్షుడు ఎలాల్ల జెలపతిరెడ్డి, ఆకుల లింగారెడ్డి ఎంపీపీ రాజన్న, పాఠశాల ఉపాధ్యాయులు నల్ల శ్రీనివాస్, సోమ నాగార్జున, పెంట శ్రీనివాస్, కోట సత్యం, గడ్డం శ్రీధర్, ఏనుగు మాధవరెడ్డి, కొత్తూరి సంతోష్, కొగురి నాగరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిర్పూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షిస్తున్న వైద్యురాలు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని సిరిపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు మండల వైద్యాధికారిని వాహిని బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 54 మందిని పరీక్షించి జ్వరం ఉన్నవాళ్ల రక్త నమూనాలను సేకరించినట్టు తెలిపారు. అనంతరం డెంగ్యూ పాజిటివ్ ఉన్న ఇండ్లను పరిశీలించి మాట్లాడారు.. ఇంటి చుట్టు పక్కలలో నిల్వ ఉన్న నీటిని పాత్రలను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రామ్మోహన్, హెచ్ఈఓ వేణురావు, సూపర్‌వైజర్ ప్రభావతి, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, ఏఎన్ఎం రబియా, అంగన్‌వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్ అందజేత



టై బెల్టు ఐడి కార్డులు అందజేస్తున్న వెంకట్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మండలంలోని వర్షకొండ గ్రామంలోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 200 మందికి ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్ టై, బెల్ట్, ఐడి కార్డులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రాజేందర్, ప్రైమరీస్కూల్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఆవుల లావణ్య, మాజీ ఎస్ఎంఎస్ చైర్మన్ మీరా గంగాధర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు..

మా భూమిని మాకు ఇప్పించాలి..

15ఏండ్లుగా సాగు చేస్తున్న భూమిలో మొక్కలు పీకేసారని దంపతుల ఆందోళన



నవతెలంగాణ - కొనరావుపేట : 15ఏళ్లుగా సాగులో ఉన్న తమ భూమిలో అటవీ అధికారులు పత్తిపంటను, చెట్లను తొలగించారని కొనరావుపేటకు చెందిన నిరుపేద దంపతులు తెలిపారు. బాధితుల కథనం ప్రకారం.. కొనరావుపేట మండల కేంద్రానికి దండుగుల పోశవ్వ - కనుకయ్య దంపతులకు సర్వే నెంబర్ 367లో 3ఎకరాల భూమిలో 15ఏండ్ల నుంచి సాగులో ఉంటున్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 2010లో పట్టా ఇచ్చారు. అప్పటి నుంచి భూమిలో పత్తి, ఇతర పంటలు సాగు చేసుకుంటున్నారు. మంగళవారం వచ్చిన అటవీ అధికారులు ఈ భూమి అటవీశాఖకు చెందినందని, భూమి తమదేనంటూ అందులో ఉన్న పత్తిమొక్కలను, 'ఇతర చెట్లను ధ్వంసం చేశారు. దీంతో బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ భూమి తప్ప తమకు వేరే ఆధారంలేదని, మా భూమిని తమకు ఇప్పించాలని కోరారు.

శిక్షలతోనే సమాజంలో మార్పు

- జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదు
- మూడు కేసులలో ముగ్గురికి శిక్షలు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



నవతెలంగాణ - సిరిసిల్ల

నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హత్య కేసులో వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టెంల గ్రామానికి చెందిన బారాజు మల్లారెడ్డికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమాన,బారాజు నరసింహారెడ్డికి 07సంవత్సరాల జైలు శిక్ష, రూ.3వేల జరిమాన విధిస్తూ సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించారని ఆయన పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన బారాజు మల్లారెడ్డి, నరసింహా రెడ్డి, ఎమిరెడ్డి రాంరెడ్డి, కనక రెడ్డి, లచ్చిరెడ్డిలు చాలా కాలంగా భూమి తగాదాలు ఉన్నందున ఈ క్రమంలో భారాజు మల్లారెడ్డి, నరసింహారెడ్డి ఇద్దరు కలసి 25 మే 2015న ఏమిరెడ్డి రాంరెడ్డి అతని కుమారులు కనకరెడ్డి, లచ్చిరెడ్డిలపై దాడి చేశాడు. రాంరెడ్డి స్పృహ కోల్పోగా, కనకారెడ్డి, లచ్చిరెడ్డీలకు గాయాలు కాగా వారిని అక్కడ ఉన్నవారు వెంటనే వారిని కరీంనగర్ హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. రాంరెడ్డి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లాలి అని సూచించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్య లో రాంరెడ్డి చనిపోయాడు. వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసి బారాజు మల్లారెడ్డి, నరసింహారెడ్డిని రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ శ్రీనివాస్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగరావు వాదించగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుల్లు నరేందర్, రమేష్‌లు కోర్టులో 17మంది సాక్షులను ప్రవేశపెట్టగా పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులు బారాజు మల్లారెడ్డికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా, బారాజు నరసింహరెడ్డికి 07సంవత్సరాల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. అలాగే కొనరావుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసులో గంగుల రమేష్ అనే నిందితునికి ఒక సంవత్సరం జైలు శిక్ష రూ.1100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించినట్లు ఎస్పి తెలిపారు. కొనరావుపేట్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గంగుల రమేష్ 2018 సంవత్సరంలో కాళేశ్వరం ప్రాజెక్టు పనిలో భాగంగా టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. రెండు నెలలు పనిచేసిన తర్వాత అ వ్యక్తి ప్రవర్తన బాగాలేక ప్రాజెక్టు పనులకు చెడ్డ పేరు వస్తుందని ఉద్దేశంతో అతని విధులనుండి తొలగించారు. ఆ విషయాన్ని గంగుల రమేష్ మనసులో పెట్టుకొని ప్రాజెక్టు మెనేజర్ చేకూరి కృష్ణంరాజును చంపాలని ఉద్దేశంతో తన వద్ద ఉన్న స్కూల్ డ్రైవర్‌తో దాడి చేయగా కొనరావుపేట్ పోలీస్ స్టేషన్‌లో ప్రాజెక్టు మెనేజర్ చేకూరి కృష్ణంరాజు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్.ఐ పర్శరములు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల లక్ష్మీప్రసాద్ వాదించగా కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ రవీంద్ర నాయుడు, హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య, కోర్టు కానిస్టేబుల్ లతీఫ్‌ల ఆధ్వర్యంలో 10మంది సాక్షులను ప్రవేశపెట్టగా పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రోజు కావడంతో నిందితునికి సంవత్సరం జైలు శిక్ష రూ.1100 జరిమానా విధిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్పీ పేర్కొన్నారు. అలాగే బార్య పై కిరోసిన్ పోసి హత్యా ప్రయత్నం చేసిన కేసులో నిందుతునికి ఒక సంవత్సరం జైలు శిక్ష తోపాటు రూ.100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రాధిక జైశ్వాల్ బుధవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ వివరించారు.

సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకి చెందిన కావాలి రాజు అనే వ్యక్తి తన భార్య కావలి లక్ష్మి కి పిల్లలు కావటం లేదని తరచూ తాగి వచ్చి తనని మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. 26 మే 2019న తన బార్య ను చంపుతా అని తన పై గ్యాస్ నూనె పోయగా లక్ష్మి తానే అగ్గిపెట్టె తో అంటించుకోగా వెంటనే భర్త నీళ్ళు చల్లి హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాడు. ఈ ఘటనపై సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కావాలి రాజుపై కేసు నమోదు చేసి అప్పటి ఎస్.ఐ శ్రీనివాస రావు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మహేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు ప్రాసిక్యూషన్ తరఫున పి.పి లక్ష్మి ప్రసాద్ వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి రాధిక జైశ్వాల్ నిందుతుడు కావలి రాజుకి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలిసులు మరియు ప్రాసిక్యూషన్ వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు.పై మూడు కేసులో నిందితులకి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీ లు వేముల లక్ష్మి ప్రసాద్ ,నర్సింగరావులను, సిఎంఎస్ ఎస్.ఐ రవీంద్ర నాయుడు, కోర్ట్ కానిస్టేబుల్‌లు రమేష్, మహేందర్, లతీఫ్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్ నరేందర్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో జన జాగరణ



జన జాగరణలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బుధవారం రాత్రి జన జాగరణను కొనసాగించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూశం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్దాస్ గణేష్, సిఐటియు జిల్లా నాయకులు సూరం పద్మ సిరిమల సత్యం, నక్క దేవదాస్, కుమ్మరి కుంట కిషన్, ఉడుత రవి, ఒగ్గు గణేష్ సబ్బని చంద్రకాంత్, గడ్డం రాజశేఖర్, బింగి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమంగా ప్రభుత్వం పని చేస్తుంది

నవతెలంగాణ - చందుర్తి



ప్రజా సంక్షేమంగా ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ శ్రేణులు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాగం కుమార్,గొట్టే ప్రభాకర్,చింత పంటి రామస్వామి,బండారు శేఖర్ ఉన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి



నవతెలంగాణ - చందుర్తి

యువత స్వయం ఉపాధితో ఎదగాలని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన ఛార్జింగ్ టూ వీలర్ షో రూంను ఆయన సతీమణి దీపతో కలసి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ కృష్ణసిరి కొండ శ్రీనివాస్, పెరుక గంగరాజు నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు



నవతెలంగాణ - చందుర్తి

మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు బుధవారం గ్రామానికి చెందిన దూది శ్రీనివాస రెడ్డి ఉచిత బస్ పాసులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయి..



నవతెలంగాణ - కొనరావుపేట : ఆస్పత్రి వైద్య సేవలు ఎలా ఉన్నాయి అని అడిషనల్ కలెక్టర్ కీమ్యా నాయక్ రోగులను అడిగి తెలుసుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆయన తనిఖీచేసి ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, రోగులకు సేవలు అందిస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రతి రోజూ ఎంత మంది పేషెంట్లు వస్తున్నారు? ఎంత మంది జ్వరంతో వస్తున్నారు? ఎంత మందికి పరీక్షలు చేస్తున్నారు? అనే వివరాలను ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వేణుమాధవ్ ను అడిగారు ఆస్పత్రి ప్రహరీ గోడ లేదని అంబులెన్స్ సౌకర్యం కూడా కల్పించాలని సిబ్బంది అడిషనల్ కలెక్టర్ ను కోరారు. తనిఖీలో జిల్లా వైద్యాధికారి డా.వసంతరావు, డీపీవో ఉమాదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ దివ్య, తహసీల్దార్ విజయ ప్రకాషరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ వితరణ

నవతెలంగాణ - గంభీరావుపేట:

మండలపరిధిలోని మల్లారెడ్డిపేట గ్రామంలోగల ప్రాథమిక పాఠశాలకు సోమారపు మధు, కంటంరాజు,అల్లాడి రాజు లు కలిసి ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా సోమారపు మధు మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకే 15వేల విలువ గల ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు జక్కుల యశు పాలు,అజయ్,సతీష్ కిరణ్, శిరిష, యూత్ సభ్యులు సాగర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

నవతెలంగాణ - చందుర్తి

మండల కేంద్రానికి చెందిన గొల్లపెల్లి గణేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికంలో ఉన్న గణేష్ చికిత్స చేయుంచుకోవడం కోసం ఆర్థిక స్థోమత లేకపోవడంతో గ్రామానికి చెందిన కొందరు స్నేహితులు కలసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా దాతలు రూ.లక్ష వరకు సహయం చేశారు.దీంతో బుధవారం ఆ నగదును మహమ్మద్ అజీమ్,కత్తి తిరుపతి అందజేశారు.

చదువు కోసం రూ.22వేలు ఆర్థికసాయం



నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ పట్టణానికి చెందిన ఆలంపల్లి శ్రీనివాస్ కుమార్తె దివిత ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబము. విద్యార్థిని చదువుకు డబ్బులు లేక తల్లితండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.22వేలు ఆర్థిక సహాయం అందజేసి గొప్ప మనస్సు చాటుకున్నారు. ఆర్థిక సహాయం చేసిన మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఫలించిన న్యాయవాదుల దీక్షలు



నవతెలంగాణ - సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని న్యాయవాదులు పోలీసుల తీరు సరిగా లేదని 14రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తుండగా పోలీసులు పలు డిమాండ్లను అంగీకరించడంతో బుధవారం న్యాయవాదులు నిరాహార దీక్షలను విరమించారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీల ఆధ్వర్యంలో న్యాయవాదులతో కోర్ట్ ఆవరణలో చర్చలు జరగగా న్యాయవాదులు పెట్టిన డిమాండ్లను పోలీసులు అంగీకరించడంతోనే దీక్షలు విరమించామని న్యాయవాదులు పేర్కొన్నారు. సోమవారం నుంచి విధులకు హాజరు కావడానికి సిరిసిల్ల వేములవాడ న్యాయవాద సంఘాల అధ్యక్షులు సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ అధ్యక్షులు దోర్నాల సంజీవరెడ్డి, గుడిసె సదానందం మాట్లాడుతూ 14 రోజులుగా కక్షిదారులు, ప్రజలు ఏవైతే ఇబ్బందులకు గురవుతున్నారో వాటి గురించి న్యాయవాదులు పోలీస్ అధికారులతో మాట్లాడి విజయం సాధించారని పేర్కొన్నారు. నిరాహార దీక్షలో సీనియర్ న్యాయవాదులు భాస్కర్ రెడ్డి,వసంతం,రవీందర్ రావు,నాగుల సత్యనారాయణ ప్రధాన కార్యదర్శులు తంగళ్ళపల్లి వెంకటి,రజనీకాంత్ సీనియర్,జూనియర్ న్యాయవాదులు ఉన్నారు.

శాత్రాజ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్యూరిఫైర్ ఏర్పాటు

నవతెలంగాణ - వేములవాడ రూరల్



వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాత్రాజ్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మి నారాయణ రూ.25వేల విలువ చేసే వాటర్ ప్యూరీఫైర్‌ను తన సొంత డబ్బులతో ఏర్పాటు చేయించాడు. ఈ ప్యూరిఫైర్ ను బుధవారం డీసీసీ ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సలీం చేతులమీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలలో వాటర్ ప్యూరీఫైర్ ను ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమని, దీనికి సహకరించిన లక్ష్మి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరణ్, తిరుపతి, అంజయ్య, రాజేశం, రాజేందర్ లతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవన జ్యోతి, రాజయ్య, కిరణ్ కుమార్, సదయ్య, సత్య నారాయణ, మల్లేశం, మురళీకృష్ణ, మాధవి లత పాల్గొన్నారు.

అధ్యాపక వృత్తిలో బదిలీలు సహజం

నాప్సకబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు

నవతెలంగాణ - గంభీరావుపేట :



అధ్యాపక వృత్తిలో బదిలీలు సహజమని నాప్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. బుధ వారం గంభీరావుపేట మండ ల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి బదిలీపై వెళ్లుతున్న అధ్యాపకులు పిట్ల దాసు,శ్రీవల్లి , బదిలీపై వచ్చిన అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్‌లను నాప్స్‌కబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావుతోపాటు కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాప్స కబ్ చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను పెంచడంలో, కాలేజీ అభివృద్ధిలో, మౌలిక వసతుల కల్పన,కళాశాలకు న్యాక్ బి" ప్లస్ గ్రేడ్ రావడంలో కృషిచేసిన దాసు సేవలను అభినందించారు. అనంతరం కళాశాలలో చదివే విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని అధ్యాపకులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం,అల్మ్ని కమిటీ మెంబర్స్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విరాళాలతో వైకుంఠ రథం

నవతెలంగాణ - చందుర్తి :



మండలంలోని రామన్న పేటకు చెందిన గ్రామస్తుల సహకారంతో పేద వారు చనిపోతే తీసుకెళ్ల డానికి వైకుంఠ రథంను విరాళాల తో గ్రామానికి తీసుకువచ్చి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుమ్మ అంజయ్య, సహకార సంఘం డైరెక్టర్ రమేష్, నాయకులు దేవస్వామి ఉన్నారు.

విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయి
- డాక్టర్లు వైద్యం బాగానే చేస్తున్నారా?
- వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రి తనిఖీలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



వైద్యం పొందుతున్న వారితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్..

నవతెలంగాణ- వేములవాడ

ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయి..? డాక్టర్లు, సిబ్బంది వైద్యం బాగానే చేస్తున్నారా? అంటూ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వయంగా వైద్య చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవల తీరుపై ఆరా తీశారు. బుధవారం వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రి లోని అన్ని విభాగాలను, రోగులకు సేవలు అందిస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగాలను, ల్యాబ్, ఐపి వార్డు, ఫార్మసీ, పిడియాట్రిక్ వార్డు, ఐసీయూ, ఎం.ఐ.సీ.యూ. విభాగాలను పరిశీలించి, ప్రతి రోజూ ఎంత మంది పేషెంట్లు వస్తున్నారు? ఎంత మంది జ్వరంతో వస్తున్నారు? ఎంత మందికి పరీక్షలు చేస్తున్నారు? అనే వివరాలను ఆసుపత్రి పర్యవేక్షకులు డా.పెంచలయ్య ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఐపి వార్డులో జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి ఆసుపత్రిలో సేవలు ఎలా ఉన్నాయి అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడి నుంచి వచ్చారు? ఆసుపత్రికి వచ్చిన ఎన్ని రోజులు అవుతుంది అని ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. విష జ్వరాలు, డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ల్యాబ్, కంటి పరీక్షలు, దంత వైద్య, డీ.ఈ.ఐ.సీ విభాగాలను తనిఖీ చేశారు. ఉత్తమ వైద్య సేవలను అందించాలని కలెక్టర్ కోరారు. తనిఖీలో జిల్లా వైద్యాధికారి డా.వసంతరావు, పర్యవేక్షకులు డా.పెంచలయ్య ఆర్ఎంఓ డా. సంతోష్ చారీ, డా.దీప్తి, డా.అనిల్, తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీలుగా కొనసాగించాలి

- విలీన గ్రామాల ఐక్య వేదిక సభ్యుల డిమాండ్
- రగుడు వార్డు కార్యాలయం ఎదుట బైఠాయింపు



వార్డు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల మున్సిపల్ విలీనమైన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగానే కొనసాగించాలని విలీన గ్రామాల ఐక్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడు గ్రామం లోని వార్డు కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తారు. ఈ సందర్భంగా విలీన గ్రామాల ఐక్య వేదిక సభ్యుడు వంగ అనిల్ కుమార్, సలంద్రీ బాలరాజ్ మాట్లాడుతూ మున్సిపల్లో విలీన మైతే అభివృద్ధి చేస్తామని చెప్పిన అధికారులు, నాయకులు ఇప్పుడు తమ సమస్యలు పట్టించుకో వడం లేదన్నారు. ఉపాధిహామీ పనులకు దూరమై, పన్నులు పెరిగి అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మౌలిక సదుపాయాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మాజీ మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి విలీనమైన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మారుస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఇప్పటికైనా విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏడు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో విలీన గ్రామాల ఐక్యవేద సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

నవతెలంగాణ - వేములవాడ



స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేష్, కమిషనర్ అన్వేష్, కౌన్సిలర్లతో కలిసి నూతన దుస్తులను పంపిణీ చేశారు. వేములవాడ మున్సిపల్ కు జాతీయస్థాయి అవార్డు అందుకోవడం వారి సేవలకు నిదర్శనం అన్నారు. కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పని చేసారని గుర్తు చేశారు. వారికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ముందుండి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి ని కలిసిన ప్రభుత్వ విప్..



నవతెలంగాణ - వేములవాడ : విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, ఐటీశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం కలిసి సత్కరించి, ఫ్లవర్ బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి, యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటనను దిగ్విజయంగా ముగించుకుని రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పన మార్గంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు ఆసరా సీఎం సహాయ నిధి

నవతెలంగాణ - కొనరావుపేట : పేదలకు ఆసరాగా సీఎం సహాయ నిధి ఉంటుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్ అన్నారు కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన కటకం సుదర్శన్ రూ.28500, తాళ్లపల్లి వెంకటేష్ లకు రూ.10500 విలువగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లంబరాజు, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, శోభన్ బాబు, దుర్గం చిరంజీవి, బంటు రాజేందర్ ,అజుద్దీన్ ,బర్మ మల్లేశం, శీను, అంజయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :



ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, అల్మాస్‌పూర్ గ్రామాలలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ 75వేల రూపాయల చెక్కులను పంపిణి చేసినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కింద పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవచ్చని, పేద ప్రజలదరికి పథకం ద్వారా సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సాహేబ్, ఉమ్మడి మండలాల యాదవ సంఘ అధ్యక్షులు మేండె శ్రీనివాస్ యాదవ్, నాయకులు గుండాటి రాంరెడ్డి, చెన్ని బాబు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్, వంగ మల్లారెడ్డి, గంగయ్య, పర్శరాములు, తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, దేవయ్య శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
పెద్దపల్లి
గురువారం | ఆగస్టు 15, 2024 | www.navatelangana.com

జీఎంను కలిసిన డబ్ల్యూపీఎస్,జీఏ సభ్యులు



నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ-1 నూతన జీఎంగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన డి.లలిత్ కుమార్‌ను ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం జీఎం కార్యాలయంలోని జీఎం ఛాంబర్‌లో మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన జీఎంగా బాధ్యతలు స్వీకరించిన డి.లలిత్ కుమార్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కో ఆర్డినేటర్, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్ వైజర్ రమేష్, శ్రావణ్ కుమార్, వీరారెడ్డి, సంతోష్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనతో మహిళలు కుటుంబ పోషకులుగా ఎదగాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ముత్తారం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



మిల్క్ పార్లర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పార్లర్ నిర్వాహకురాలు

నవతెలంగాణ-ముత్తారం:
ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని వినియోగించుకొని ఆర్థిక స్వావలంబనతో మహిళలు కుటుంబ పోషకులుగా ఎదగాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షఅన్నారు. ముత్తారం మండలంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా మైదంబండ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,అడవీ శ్రీరాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. పాఠశాలల్లోని తరగతి గదులలో విద్యాబోధనను తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అడవీ శ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రహరీ గోడ మరమ్మత్తులకు అవసరమైన అంచనాలను రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా అడవీ శ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు కలెక్టర్ టీ షర్ట్‌లు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద శ్రీ రాజమాత గ్రామ సంఘం ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన శ్రీయాన్ మిల్క్ పార్లర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా రుణాలు అందజేసి, వారి వ్యాపార యూనిట్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. జిల్లాలో 12 రకాల వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నామని, మహిళా సంఘాలచే మీసేవ కేంద్రాలు, ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ యూనిట్ మొదలగు వివిధ వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇందిరామహిళా శక్తి కార్యక్రమం కింద లక్షా 90 వేల రుణంతో ముత్తారంలో మిల్క్ పార్లర్ ఏర్పాటు చేశామని, దీనినే సమర్థవంతంగా నిర్వహించుకొని మహిళలు ఆర్థికంగా తమ కాళ్ళ మీద తాము నిల వాలని అయన సూచించారు.

సాండ్ టాక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి
ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన సాండ్ టాక్స్‌ను ఇసుక అవసరమున్న వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ముత్తారం మండల పర్యటనలో భాగంగా ఖమ్మంపల్లి గ్రామంలో ఇటీవలే ప్రారంభించిన ఇసుక రీచ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాండ్ టాక్స్ ద్వారా వినియోగదారులు ఇసుకను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే ఒక రోజులోపే ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ముత్తారం ఎంపీడీవో జి.లలిత, మండల పంచాయతీ అధికారి బి.కిరణ్, పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.వరలక్ష్మీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష

అంగన్‌వాడీ కేంద్రాల్లో శ్రీమంతాలు, అన్నప్రాసన



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ హాజరై గర్భిణులకు శ్రీమంతాలు చేశారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయ, షమీం, శారద, ఆయాలు సరోజన, రమ, ఆశా వర్కర్ సృజన, డివిజన్ మహిళలున్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సింగరేణి రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, అఖిల భారత కోల్‌పెన్షన్ అసోసియేషన్ నాయకులు కరీంనగర్‌లో బుధవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కోల్‌ఇండియా సింగరేణి రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని, గత 26 సంవత్సరాలు పెన్షన్ పెంపుదల లేకపోవడం వల్ల చాలా దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నామని నాయకులు గాలిపల్లి శంకరయ్య, కాందూరి శ్రీనివాసాచారి, దేవరకొండ రవీందర్, వి.సంపత్ కుమార్‌రావులు ఈ వినతి ద్వారా విన్నవించారు.దీనికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తప్పక పెన్షన్ పెంచేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

డీజీఎం ఎస్టేట్‌ను కలిసిన అధికారులు



డీజీఎం ఎస్టేట్‌ను సన్మానిస్తున్న ఎస్టేట్ అధికారులు

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ-1లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీజీఎం ఎస్టేట్ ఆర్.కుమార స్వామిని ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలబొకే అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎస్టేట్ మేనేజర్ సాంబశివ రావు, జూనియర్ అసిస్టెంట్ అనిత,సుమన్, రాజేందర్ ఉన్నారు.

ఈద్గాలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జామ మజీద్ వారి ఆధ్వర్యంలో చందపల్లి రోడ్డులోని ఈద్గాలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతారెడ్డి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మేము కూడా పాల్గొంటామని ముందుకు వచ్చిన జామ మజీద్ పెద్దలకు వారి బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో దాదాపుగా రెండు లక్షలపైగా మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ కౌన్సిలర్ షాహిదా సబీర్ ఖాన్, మేనేజర్ శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్ పాల్గొన్నారు.

ఎస్‌టీపీలో ఇండ్లు కోల్పోయిన వారికి తక్షణమే స్థలాలు చూపించాలి

- బాధితులకు సీపీఐ(ఎం) ఎల్లప్పుడూ అండగా ఉంటుంది : సీపీఐ (ఎం) నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
ఎస్‌టీపీలో ఇండ్లు కోల్పోయిన వారికి తక్షణమే స్థలాలు చూపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, ఏ.మహేశ్వరి డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోదావరి ఖనిలోని మల్లు స్వరాజ్యం కాలనీలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత రెండు సంవత్సరాల క్రితం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన భూ పోరాటంలో భాగంగా 320 మంది నిరుపేదలు ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని, ఈ క్రమంలో ఎండనక వాననక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని ఇక్కడే నివాసం ఉన్నారని అన్నారు. వారు అక్కడ ఉన్న పెద్ద పెద్ద తుమ్మ చెట్లను తొలగించడానికి భూమి చదును చేయడానికి రెండు బోర్లు వేయించుకొని నీళ్ల సదుపాయాన్ని కల్పించుకున్నారని, అదేవిధంగా మట్టితో రోడ్లు వేయించుకున్నారని, కరెంటు తీసుకున్నారని, వీటన్నింటికీ అక్కడ నివాసం ఉన్న ప్రజలందరూ తలా కొంత డబ్బులు వేసుకొనిపై సౌకర్యాలు కల్పించుకున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులు, జిల్లా కలెక్టర్ ఎస్‌టీపీ నిర్మాణం చేయడానికి స్థలసేకరణ చేయగా అక్కడ 123 మంది పేదలు వేసుకున్న ఇండ్లు తొలగించాల్సి వస్తుందని, అందుకు సహకరించాలని, ఇండ్లు కోల్పోతున్న వారికి అక్కడే స్థలం చూపించి ఇల్లు కట్టుకోవడానికి సహకరిస్తామని, ప్రభుత్వ పథకాలు అమలు చేయిస్తామని మున్సిపల్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సీపీఐ(ఎం) జిల్లా నాయకత్వానికి హామీ ఇచ్చి తొలగించడానికి సహకరించాలని కోరడం జరిగిందని, అందుకు సీపీఐ(ఎం) పార్టీ నాయకత్వం, ఇల్లు కోల్పోతున్న వారందరూ ఎమ్మెల్యే ఇచ్చిన హామీపై పూర్తి నమ్మకంతో విశ్వాసంతో ఇండ్ల తొలగింపుజరిగిందని, అంతేకానీ కొంతమంది పనికట్టుకొని సీపీఐ(ఎం) నాయకత్వంపైన అవాకులు, చెవాకులు పేలుతున్నారని, నిజా నిజాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరైన కాదని అన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు క్రాంతి, మహేందర్, భాగ్య, అనూష, భాస్కర్, భవానిలున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) నాయకులు

జనావాసాల మధ్యనున్న కోళ్ల ఫారంను తరలించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కాసర్లగడ్డ వాసులు



నవతెలంగాణ-ముత్తారం:
జనావాసాల మధ్యనున్న కోళ్ల ఫారంను ఇక్కడి నుంచి తరలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు ముత్తారం మండలం కాసర్లగడ్డకు వాసులు బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ముత్తారం మండలం పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను కాసర్లగడ్డ వాసులు కలిసి జనావాసాల మధ్యనున్న కోళ్ల ఫారంతో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు విన్నవించారు. కోళ్ల ఫారం మూలంగా విపరీతంగా ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీంతో రోగాల పాలవుతున్నామని, కోళ్ల ఫారం నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు వారి గోడు వెళ్లబోసుకున్నారు.

కన్నాల విద్యార్థులకు టీషర్ట్స్,డ్రమ్స్ పంపిణీ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-మంథని
మంథని మండలం కన్నాల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీషర్ట్స్, డ్రమ్స్ ను మంథని మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమా-సురేష్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు నలమాసు హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని మున్సిపల్ చైర్ పర్సన్ రమా-సురేష్ రెడ్డి పాల్గొని హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఎదిగి పాఠశాలకు,గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆమె ఆకాంక్షించారు. 60 మంది విద్యార్థులకు స్కూల్ పేరుతో ప్రింట్ అయిన టీషర్ట్స్ కావాటి భూమయ్య కూతురు బోయిని స్వరూప-సమ్మయ్య(సింగపూర్) డొనేట్ చేశారు. సుమంత్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్‌లు విద్యార్థులకు డ్రమ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోయిల రాజయ్య,పాఠశాల హెడ్మాస్టర్ మధు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగరపాలక పారిశుధ్య వాహనాలకు చాలీచాలని డీజిల్ : మద్దెల దినేష్, ఏంఏ.గౌస్

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య విభాగం అంటేనే రోజు రోజు అవినీతికి నిలయంగా మారుతుందని, ఏదో ఒక కుంభకోణం చేయడంలో అధికారులకు నిద్ర పట్టదని అనే పేరు ఉందని, రామగుండం నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలోని వాహనాలకు చాలీచాలని డీజిల్ పోస్తున్నారని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్



ఏం.ఏ గౌస్ ఆరోపించారు. మంగళవారం రోజున రోజు లాగానే పారిశుధ్య విభాగంలోని వాహనాలు, ట్రాక్టర్లు తమ విధుల్లోకి ఎప్పటిలాగానే వెళ్ళడం జరిగిందన్నారు. అయితే ఒక ట్రాక్టర్ తమ విధులు ముగించుకొని జీఎం ఆఫీస్ మూలమీదికి రాగానే డీజిల్ అయిపోయి అటు ట్రాక్టర్ నడిరోడ్డుపైన ఆగిపోవడం దురదృష్టకరమన్నారు. అక్కడ సంబంధించిన వారిని అడిగితే డీజిల్ అయిపోయిందని సమాచారం ఇవ్వడం జరిగిందని, సంబంధిం చిన ట్రాక్టర్ డ్రైవర్ డీజిల్ తెచ్చుకోనికి కాజిపల్లికి వెళ్లారని సమాచారం అందిందన్నారు. వారానికి 35 లీటర్లు డీజిల్, రోజుకు 7 లీటర్ల డీజిల్ పోస్తే కాని ట్రాక్టర్లకు సరిపోయే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

హర్యానా జాతీయ కరాటే పోటీల్లో
మంథని సిటోరియు కరాటే విద్యార్థులు

నవతెలంగాణ-మంథని



జులై 14న కరీంనగర్‌లో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు జాతీయస్థాయి ఎంపిక పోటీల్లో నిలబడనున్నారు. హర్యానాలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు మంథని సిటోరియు కరాటే ఇన్స్ట్రక్టర్ కావాటి సమ్మయ్య ఆధ్వర్యంలో, విద్యార్థులు ఎంపికయ్యారు.

బీసీ సదస్సును విజయవంతం చేయండి



నవతెలంగాణ-మంథని
20న పెద్దపల్లి ఎంపీ గార్డెన్‌లో నిర్వహించే బీసీ సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంఘం నాయకులు బత్తుల సత్యనారాయణ కోరారు. బుధవారం మంథినిలోని మహాత్మా జ్యోతిభాపూలే విగ్రహం వద్ద బీసీ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యా ప్తంగా సమగ్ర కులగణన జరపాలన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు బీసీ డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏగోలపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్, బత్తుల సత్యనారాయణ, పోతారవేణి క్రాంతి,పుట్ట రామన్న, పుప్పాల తిరుపతి, కండె రమేష్, పాల్గొన్నారు.

అడవీ శ్రీరాంపూర్‌కు బస్సు పునరుద్ధరణ

నవతెలంగాణ-ముత్తారం:
గోదావరిఖని నుంచి ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్‌కు గతంలో నడిచిన గోదావరిఖని డిపో ఆర్టీసీ బస్సు గత కొన్ని రోజుల నుంచి అనివార్య కారణాల వల్ల నిలిచిపోయింది. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై అడవీ శ్రీరాంపూర్ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మాజీ ఎంపీటీసీ దొడ్డ గీతా రాణి బాలాజీ దృష్టికి తీసుకు రాగా, సమస్యను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి వారు తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి గతంలో



లాగానే గోదావరిఖని డిపో ఆర్టీసీ బస్సును అడవీ శ్రీరాంపూర్‌కు నడిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి యథావిధిగా గతంలో లాగానే బస్సు ఆయా సమయాల్లో నడుస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మాజీ ఎంపీటీసీ దొడ్డ గీతా రాణి బాలాజీ అన్నారు.

మహిళల భద్రత కోసమే షీటీమ్స్

షీ టీమ్స్ ఇన్‌చార్జీ ఏఎస్ఐ మల్లన్న



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
మహిళల భద్రత కోసమే షీటీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని షీటీమ్స్ ఇన్‌చార్జీ ఏఎస్ఐ మల్లన్న అన్నారు. పెద్దపల్లి రంగంపల్లిలోని మహాత్మా జ్యోతిబాపులే కళాశాలలో విద్యార్థులకు భద్రత ఆన్‌లైన్ మోసాలపై యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాల్లో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీటీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందన్నారు ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది స్నేహలత, సురేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి భూసేకరణ పూర్తిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

నవతెలంగాణ-మంథని
వరంగల్ మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ మంథని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో జాతీయ రహదారి కోసం చేపట్టాల్సిన, భూసేకరణ, పెండింగ్ ధరణి సమస్యలు, వివిధ



సర్టిఫికెట్ల జారీ మొదలగు అంశాలపై మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమా నాయక్ తో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ మంథని మండలం లో వరంగల్ మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అవసరమైన ధ్రువీకరణ చేపట్టి పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మంథని మండల తహసీల్దార్ సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ల నిరసనలు

- దోషులను కఠినంగా శిక్షించాలి : ప్రజాసంఘాల డిమాండ్
- లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతా మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్, సీనియర్ డాక్టర్లు నిరసన తెలిపారు. బుధవారం ఉదయం నుంచి అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలను బహిష్కరించిన వైద్యులు వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులతో పాటు వరంగల్, నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం తదితర జిల్లాల్లోని బోధనాస్పత్రుల ముందు ధర్నాలు నిర్వహించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

మెడికల్ కాలేజీ విద్యార్థినిపై లైంగిక దాడి దారుణం

కోల్‌కతాలోని ఆర్‌జి.కేర్ మెడికల్ కాలేజీ విద్యార్థినిపై లైంగిక దాడి కేసును సమగ్రంగా విచారించాలనీ, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహిళా డాక్టర్‌పై లైంగికదాడి చేసి హత్యచేసిన ఘటనను నిరసిస్తూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)సంఘాల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఆ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ..ప్రజలను కాపాడే వృత్తిలో ఉన్న విద్యార్థులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ఆందోళన చెందారు. ఆస్పత్రిలో 30 గంటల పాటు వైద్య సేవలు అందించిన విద్యార్థిని రెస్ట్ కోసం కాన్ఫరెన్స్ హాల్లో నిద్రిస్తున్న సమయంలో లైంగికదాడి చేసి హత్యచేశారని వాపోయారు. దేశవ్యాప్తంగా మెడికల్ విద్యార్థుల రక్షణకు కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకటేష్ మాట్లాడుతూ బెంగాల్ వైద్య విద్యార్థిని హత్యకు గురైతే హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తూ కేసును పక్కదారి పట్టించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆస్పత్రి అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తక్షణమే అధికారులపై చర్యలు తీసుకోవాలనీ, ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ..ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించే వరకు దేశవ్యాప్తంగా పోరాటాలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఐద్వా నాయకులు కే నాగలక్ష్మి పి శశికళ ,ఎం లక్ష్మమ్మ ,కవిత, డీవైఎఫ్ఐ నాయకులు ఎమ్‌డీ జావేద్, హష్మీ బాబు, కే.విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎ.లెనిన్ శ్రీమన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక కళా యాత్ర

21న ప్రారంభం

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ-కల్చరల్

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు హైదరాబాద్‌లో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాం' పేరిట కళాయాత్ర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలోని కళాభవన్‌లో పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ కళా యాత్రలో 20 మంది కళాకారులు.. హైస్కూల్, కళాశాలలు, బస్తీలు, కాలనీల్లో నృత్యాలు, నాటికలు ఇతర కళా రూపాలతో ప్రదర్శనలు ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. గోడ పత్రిక ఆవిష్కరణలో ఆహ్వాన సంఘం సలహాదారు డిజి.నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి ఎం.మారన్న, పీఎన్ఎం నాయకులు పి.మల్లేష్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

అసమ్మతి, విద్వేషాన్ని పారదోలాలి

(మొదటిపేజీ తరువాయి)

పురోగతి సాధించడమంటే సామాజిక ప్రజాస్వామ్యం స్థిరీకరణ దిశగా సాధించిన పురోగతికి సాక్ష్యంగా నిలుస్తుందని అన్నారు.

మన సామాజిక జీవితంలోని ప్రతి కోణంలోనూ అందరినీ కలుపుకుని పోయే స్ఫూర్తి అంతర్లీనంగా వుందన్నారు. మనకు గల వైవిధ్యత, బహుళతలతో ఒక సమగ్ర దేశంగా కలిసికట్టుగా మనం ముందుకు సాగుతున్నామన్నారు. అందరినీ కలుపుకుని పోయే ఒక సాధనంగా దృఢమైన కార్యాచరణ వుండాలన్నారు. ఇంతటి వైవిధ్యత నెలకొన్న విస్తారమైన మన భారతదేశంలో వివిధ సామాజిక వర్గాలపై అసమ్మతి, విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులను మనం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని పిలుపిచ్చారు.

సమాజంలో వెనుకబాటుకు గురైన వర్గాల అభ్యున్నతికోసం ఉద్దేశించిన పలు ప్రభుత్వ పథకాలను ఈ సందర్భంగా ముర్ము ఉదహరించారు. ప్రత్యేకంగా గిరిజన గ్రూపుల సామాజిక,ఆర్థిక పరిస్థితుల మెరుగుదలపై దృష్టి పెడుతూ తీసుకువచ్చిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం-జెఎఎన్ఎంఎఎన్) సహా పలు పథకాల గురించి పేర్కొన్నారు. పాకీ పనిని నిర్మూలించడానికి ఉద్దేశించిన నమస్తే పథకాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. లింగ బేధం లేకుండా న్యాయం అందరికీ అందాలని, జరగాలని ఆమె ఆకాంక్షించారు. భారతీయ సమాజంలో మహిళలు సమానంగా చూడబడుతున్నా సాంప్రదాయ పక్షపాతాలు ఇంకా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ కృషి వల్ల గత దశాబ్ద కాలంలో మహిళల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులు మూడు రెట్లు పెరిగాయన్నారు. మహిళా కార్మికుల ప్రాతినిధ్యంపెరిగిందని, ఆడపిల్లల జననాల సంఖ్యకూడా మెరుగైందన్నారు. మహిళల సాధికారత దిశగా గణనీయమైన చర్యగా నారీ శక్తి వందన అభియాన్ (మహిళా రిజర్వేషన్ యాక్ట్)ను ఆమె పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని కూడా ప్రశంసించారు. దేశవ్యాప్తంగా కోటి మందికిక పైగా యువతకు నైపుణ్యాల అభివృద్ధికి, పని నేర్చుకోవడానికి ఈ పథకం ఉద్దేశించబడిందని చెప్పారు.

ఈ ఏడాది జరిగిన లోకసభ ఎన్నికలను ప్రస్తావిస్తూ, ఇంత పెద్ద స్థాయిలో దాదాపు 97కోట్ల మంది ప్రజలు నిర్భయంగా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడమంటే సుస్థిరమైన, ఆదర్శప్రాయమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతులను అన్నదాతలుగా కీర్తిస్తూ, భారతదేశ వ్యవసాయ రంగం స్వావలంబనలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. రోడ్లు, రైల్వేలు, ఓడరేవులతో సహా మౌలిక సౌకర్యాలన్నీ గణనీయంగా మెరుగుపడ్డాయని, మౌలిక సదుపాయాల రంగంలో పురోగతి సాధించామని చెప్పారు. వ్యూహాత్మకమైన ప్రణాళికలు, సమర్థవంతమైన పనితీరు వల్లనే సాధ్యమైందన్నారు. ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచామన్నారు.

అప్పులు సరే.. తిరిగి ఎలా తీరుస్తారు ?

ఆర్డీసీకి బ్యాంకర్ల సూటి ప్రశ్న

- సొంత ఆదాయ మార్గాలు అన్వేషించాలంటూ ఆర్‌బీఐ మెలిక
- అధికారుల కసరత్తు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశంగానీ, రాష్ట్రం గానీ అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు కీలకం. ప్రధానంగా రోడ్లు అత్యంత ప్రధానం. రోడ్లను బాగు చేయాలంటే నిధులు కావాలి. అరకొర పనులు జరుగుతున్నా అవి సరిపోవు. భారీఎత్తున పాత రోడ్లకు మరమ్మతులు చేయడం, కొత్త వాటిని నిర్మించడం చేయాల్సిందే. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాణ్యమైన రోడ్లను వేయడం ద్వారా అత్యుత్తమ రవాణా సదుపాయాలు కల్పించాలంటే భారీ పెట్టుబడులు అవసరం. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్డీసీ) చురుగ్గా అడుగులు వేసేందుకు ప్రయత్నిస్తున్నది. అయితే ఇందుకు నిధులు ప్రధాన అడ్డంకిగా మారాయి. బ్యాంకుల నుంచి అప్పులు చేసైనా సరే రోడ్లను అభివృద్ధి చేయాలని ఆర్డీసీ పాలకవర్గం భావిస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదిక పంపినట్టు తెలిసింది. వాణిజ్య బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని రోడ్ల అభివృద్ధికి అనుమతించడంతోపాటు కౌంటర్ గ్యారంటీ ఇవ్వాలని కోరినట్టు సమాచారం. ఇప్పటికే పాలకవర్గం, అధికారులు బ్యాంకర్లను సంప్రదించారు. ఆర్డీసీ సంస్థకు అప్పులు ఇవ్వడానికి బ్యాంకర్లు సంసిద్ధత వ్యక్తం చేసినా తిరిగి ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ముందడుగు పడటంలేదు. దీంతో అప్పులు ఇచ్చే విషయంలో బ్యాంకర్ల సందేహాలు, ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో ఆర్డీసీకి పాలుపోవడం లేదు.

కేంద్రం సహాయ నిరాకరణ

రాష్ట్రాల అధికారాలు, నిధుల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరితో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అప్పులు తీసుకునే అంశంలో ఆర్థిక ఆంక్షలు పెట్టడం ఒకటైతే, జీఎస్టీ పన్ను నిధులు వెనక్కి పంపడంలో తీవ్ర జాప్యం మూలంగా రాష్ట్రాలకు తీవ్రంగా నష్టం జరుగుతున్నది.

ఆర్‌బీఐ అనుమతి

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధితోపాటు నిర్మాణాల కోసం అప్పులు తీసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుమతి ఇచ్చిందని ఆర్డీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆర్డీసీ ఇదివరకు తీసుకున్న రుణంతో రాష్ట్రంలోని పలు రోడ్లను అభివృద్ధి చేయడం, రుణం, దాని వడ్డీ చెల్లింపులు కూడా సక్రమంగా చెల్లించిన చరిత్ర ఉండటంతోనే ఆర్‌బీఐ అనుమతి లభించినట్టు ఆర్డీసీ అధికారులు అంటున్నారు. అయితే, గతంలో ఆర్డీసీ రుణాలను ప్రభుత్వమే చెల్లించగా, ప్రస్తుతం ఆ విధానంపై రిజర్వు బ్యాంకు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రభుత్వం చెల్లించకుండా కార్పొరేషనే నేరుగా ఆదాయ వనరులను సమకూర్చు కోవడం ద్వారానే అప్పులు తీర్చాలనే మెలిక పెట్టినట్టు తెలిసింది. అప్పు ఇచ్చేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఒక్కటే సరిపోదని, కార్పొరేషన్ నుంచి సొంత ఆదాయం ఏంటో చూపించాలని ప్రపంచ బ్యాంకు తరహా నిబంధనలను పెట్టినట్టు తెలుస్తోంది. దీంతో ఆర్డీసీకి సొంత ఆదాయ మార్గాలను అన్వేషించేందుకు అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. గత ఆర్డీసీ బోర్డు సమావేశంలో కూడా ఇదే విషయంలో చర్చ జరిగినట్టు తెలిసింది. అయితే, ఆదాయ మార్గాలను అన్వేషించడం, ఆ మేరకు ప్రభుత్వ అనుమతి తీసుకోవడం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో కాకుండా సొంత నిధులతో చెల్లింపులు చేసేలా కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు బ్యాంకుల ప్రతిపాదనలు, అభ్యంతరాలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఆదాయ మార్గాలివే ?

ఆర్డీసీ సొంతంగా ఆదాయ మార్గాలు సృష్టించుకోవాలనీ, అందుకు కొన్ని విధానాలు మార్చుకోవాల్సి ఉంటుందని ఆ శాఖ ఉన్నతాధికారుల మధ్య చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కర్నాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆర్డీసీ సంస్థ పెట్రోల్, డీజిల్‌పై వేసే సెస్ నుంచి ప్రతి లీటర్‌కు ఒక రూపాయిని ఆర్డీసీ ఖాతాలో జమ చేస్తున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల ఆర్డీసీలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయనేది అధికారుల భావన. దీంతో రహదారుల నిర్మాణం, నిర్వహణ వాటికి మరింత సులభమవుతుందని మన రాష్ట్ర శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రంలో అలా చేయాలంటే అందుకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రుణాలు రావాలన్నా, ఆర్డీసీ ఆర్థికంగా పరిపుష్టిని సాధించాలన్న ఇదే కీలకమైన మార్గమని అభిప్రాయ పడుతున్నారు. అప్పులు తీసుకునే విషయమై త్వరలో సర్కారు నుంచి స్పందన వస్తుందనే ఆశాభావంతో ఆర్డీసీ అధికారులు ఉన్నారు.

ఆర్డీసీ తీసుకున్న లోన్ ఎంత?

ఆర్డీసీ ఇంతకుముందు రోడ్ల అభివృద్ధికి రెండు విడతలుగా రూ.2600 కోట్ల రుణం తీసుకుంది. వీటికి సంబంధించిన అసలు, వడ్డీ క్రమంగా చెల్లిస్తూ వస్తున్నది. అప్పు తీర్చడంలో ఆర్డీసీ ట్రాక్ రికార్డు బాగుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆర్బీఐ నుంచి అనుమతి వచ్చిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ బ్యాంకుల నుంచి మరో రూ.800 కోట్లు రుణం తీసుకోవాలని ఆర్డీసీ గతంలో జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయించింది. బ్యాంకుల నుంచి రుణం ఇస్తే, గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులు ఎన్ని నిర్మించాలన్న అంశాలపై అధికారులు ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేసుకున్నారని సమాచారం.

మంజీరా అభయారణ్యానికి 'రాంసర్'గుర్తింపు కోసం ప్రతిపాదనలు





దీవుల్లో ఎన్నో రకాల జీవ వైరుధ్యాల జీవులు

అభయారణ్యాన్ని సందర్శించిన కేంద్ర బృందం

నవతెలంగాణ - మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా మంజీరా బ్యారేజీ సమీపంలో ఉన్న మంజీరా అభయారణ్యానికి 'రాంసర్' గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్టు స్టేట్ వెట్లాండ్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశాంతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'సౌభాగ్యత మిషన్' కార్యక్రమంలో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. అందులో భాగంగా ఐఏఎస్ అధికారుల కేంద్ర బృందం సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో బుధవారం మంజీరా అభయారణ్యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ.. బయోడైవర్సిటీ కార్యక్రమాల్లో భాగంగా మంజీరా అభయారణ్యాన్ని రాంసర్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మంజీరా నుంచి సింగూరు బ్యారేజీ వరకు మంజీరా నదిలో 20 చదరపు కిలో మీటర్ల విస్తీరణముందన్నారు. మంజీరా నదిలో తొమ్మిది దీవులున్నాయని, వీటిల్లో ఎన్నో రకాల జీవ వైరుధ్యాల జీవులు నివశిస్తున్నాయని తెలిపారు. 300 రకాల పక్షులు, 160 రకాల ఇతర జీవులు ఈ దీవుల్లో ఉన్నాయని అధికారులు గుర్తించినట్టు చెప్పారు. ఎన్నో అరుదైన జాతుల పక్షులు సైతం మంజీరా అభయారణ్యం వైల్డ్ లైఫ్ శాంక్చురిలో ఉన్నట్టు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ప్రతేడాది వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలంలో ఆయా సీజన్లకు అనుగుణంగా వివిధ రకాల వలస పక్షులు మంజీరా నది మధ్యలో ఉన్న ఈ తొమ్మిది దీవులకు వలస వస్తున్నట్టు తెలిపారు. రాంసర్ గుర్తింపు వల్ల మంజీరా అభయారణ్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బోటుపై ఐఏఎస్ అధికారుల బృందం మంజీరా అభయారణ్యంలోని తొమ్మిది దీవుల సముదాయంలో విస్తరించి ఉన్న వైల్డ్ లైఫ్ శాంక్చురిని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు కీర్తి మాన వస్తీ, కల్వేరసన్, డాక్టర్ జాన్సె మాత్యు, వికాస్ చంద్రగుప్త, శ్రీకాంత్, డాక్టర్ మనోజ్, చంద్రం సింగ్, రాంబాబు, సంబంధిత బృంద సభ్యులు, సంగారెడ్డి జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల బస్ కండక్టర్ అసభ్య పదజాలం

- షాద్‌నగర్ బస్ డిపో ఎదుట తల్లిదండ్రులతో కలిసి నిరసన
- చర్యలు తీసుకోవాలంటూ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-షాద్‌నగర్

చదువుల కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న విద్యార్థినుల పట్ల కండక్టర్ పరుషంగా ప్రవర్తిస్తున్న తీరును నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బస్ డిపో ఎదుట విద్యార్థినులు వారి తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేపట్టారు. షాద్‌నగర్ నుంచి కేశంపేట మండలంలోని సంగెం గ్రామానికి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సు నడుస్తుంది. ఇదే బస్సులో ఆయా గ్రామాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు చదువుల కోసం షాద్‌నగర్‌కు వస్తుంటారు. ఈ బస్‌కండక్టర్ రాములు తమ పట్ల పరుషంగా మాట్లాడుతూ బూతులు తిడుతున్నాడని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ అప్ డేట్ లేకపోయినా, బ్యాగ్‌లో నుంచి ఆధార్ బయటకు తీయడంలో ఆలస్యమైనా బండబూతులు తిట్టి మధ్యలోనే బస్ ఆపి దింపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం సంగెం గ్రామానికి వచ్చిన బస్‌లోనే షాద్‌నగర్ బస్ డిపో వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. విద్యార్థినుల పట్ల అసభ్య పదజాలాన్ని ఉపయోగించి ఇబ్బందులకు గురిచేసిన బస్ కండక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

ముస్తాబైన ఎర్రకోట

(మొదటిపేజీ తరువాయి)



ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించినట్లు సంబంధిత మంత్రిత్వ శాఖ తెలిపింది. సుమారు 45 మంది లఖ్‌పతీ దీదీలు, 30 మంది డ్రోన్ దీదీలను కూడా ఆహ్వానించినట్టు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు.

ఈ ఘనమైన వేడుకను చూడటానికి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన దాదాపు 2,000 మంది సంప్రదాయ వేషధారణలో హాజరయ్యేందుకు ఆహ్వానించారు. మైగవ్, ఆకాశవాణి భాగస్వామ్యంతో రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించిన వివిధ ఆన్‌లైన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 3,000 మంది కూడా వేడుకల్లో భాగమవుతారు. యువత, ఆదివాసీ సమాజం, రైతులు, మహిళలు, ఇలా రకరకాల జీవన విధానాలకు చెందిన వారు ప్రత్యేక అతిథులుగా రానున్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల సహకారంతో వేర్వేరు రంగాల్లో ఘనత సాధించిన వారు కూడా ప్రత్యేక అతిథులుగా వేడుకలకు హాజరవుతారు.

ఎర్రకోటకు రాగానే ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమానే స్వాగతం పలుకుతారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీఓసీ)లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్‌ను ప్రధానమంత్రికి రక్షణ శాఖ కార్యదర్శి పరిచయం చేస్తారు. ఢిల్లీ ప్రాంత జీఓసీ నరేంద్ర మోడీని సెల్యూటింగ్ బేస్‌కు తీసుకువెళ్తారు. అక్కడ సంయుక్త అంతర్‌సేవలు, ఢిల్లీ పోలీసు సిబ్బంది ప్రధానమంత్రికి జనరల్ సెల్యూట్ చేస్తారు. తరువాత ప్రధాన మంత్రి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు.

ప్రధానమంత్రికి గౌరవ వందనాన్ని సమర్పించే బృందంలో సైనిక, నౌకాదళ, వాయుసేన, ఢిల్లీ పోలీసు నుంచి ఒక్కో అధికారి, 24 మంది సిబ్బంది చొప్పున ఉంటారు. గౌరవ వందనానికి కమాండర్ అరుణ్ కుమార్ మెహతా నేతృత్వం వహిస్తారు. ఆర్మీ బృందానికి మేజర్ అరుణ్ సింగ్, నౌకాదళ బృందానికి లెఫ్టినెంట్ కమాండర్ గులియా భావేశ్ ఎన్‌కె, వాయుసేన బృందానికి స్క్వాడ్రన్ లీడర్ అక్షర ఉనియల్ నేతృత్వం వహిస్తారు. ఢిల్లీ పోలీసు బృందానికి అదనపు డీసీపీ అనురాగ్ ద్వివేది నేతృత్వం వహించనున్నారు.

గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రధాన మంత్రి ఎర్రకోట ప్రాంగణంలోకి వెళ్తారు. అక్కడ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనీల్ చౌహాన్, చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, చీఫ్ ఆఫ్ ది నేవల్ స్టాఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి, చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వికె చౌదరి అభినందనలు తెలుపుతారు. జాతీయ జెండాను ఎగురవేయడానికి ఢిల్లీ ప్రాంత జీఓసీ ప్రధానమంత్రిని వేదిక వద్దకు తీసుకువెళ్తుంది.

జాతీయ జెండా ఎగురవేయడానికి ప్రధానమంత్రికి లెఫ్టినెంట్ సంజీత్ సింగ్ సహాయకులుగా ఉంటారు. 1,721 ఫీల్డ్ బ్యాటరీ(సెరిమోనియల్)కు చెందిన శౌర్యవంతులైన సైనికులు ఒకేసారి 21 గన్ సెల్యూట్ చేస్తారు. ఇందుకు దేశీ 105 ఎంఎం లైట్ ఫీల్డ్ తుపాకులను ఉపయోగిస్తారు. ఎగురవేసిన తరువాత మువ్వన్నెల జెండా 'రాష్ట్రీయ వందనం' అందుకుంటుంది. ప్రధానమంత్రి జాతీయ జెండాను ఎగురవేయగానే భారత వాయు సేనకు చెందిన రెండు ధ్రువ్ అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు లైన్ ఆస్ట్రన్ పద్ధతిలో వేదికపై పూలరేకులను చల్లుతాయి.

అనంతరం ప్రధానమంత్రి జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగం ముగిసిన తర్వాత నేషనల్ కాడెట్ కోర్స్ (ఎన్‌సిసి)కి చెందిన కాడెట్లు జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. దేశవ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 2,000 మంది బాల, బాలిక క్యాడెట్లు(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఈ వేడుకల్లో పాల్గొంటారు. వీరు ప్రాకారానికి ఎదురుగా ఉన్న జ్ఞానపథ్‌లో కూర్చుంటారు. వీరు మువ్వన్నెల రంగుల్లో ఏర్పడతారు. నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్)కు చెందిన 500 మంది వాలంటీర్లు కూడా కార్యక్రమంలో భాగమవుతారు.

తెలంగాణకు 29, ఏపీకి 26 మెడల్స్

- దేశవ్యాప్తంగా 1,037 పతకాలు
- తెలంగాణకు చెందిన చదువు యాదయ్యకు రాష్ట్రపతి శౌర్య పతకం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1,037 మందికి గ్యాలంట్రీ/సర్వీసు పతకాలను అందజేయనుంది. ఈ మేరకు అవార్డుల జాబితాను విడుదల చేసింది. 213 మందికి గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జీఎం), ఒకరికి రాష్ట్రపతి శౌర్య పతకం (పిఎంజి), 94 మందికి విశిష్ట సేవ రాష్ట్రపతి మెడల్ (పిఎస్ఎం) మెడల్స్, 729 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఎంఎస్ఎం) ప్రకటించింది.

దేశవ్యాప్తంగా ఒకే రాష్ట్రపతి శౌర్య పతకం (పిఎంజీ) ప్రకటించగా అది, తెలంగాణకు చెందిన చదువు యాదయ్యకు దక్కింది. ఇక గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జీఎం)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాలుగు మెడల్స్, తెలంగాణకు ఏడు మెడల్స్ దక్కాయి. పిఎస్ఎంలో ఏపికి రెండు, తెలంగాణకు మూడు మెడల్స్ దక్కాయి. ఎంఎస్ఎంలో ఏపికి 20, తెలంగాణకు 18 మెడల్స్ వచ్చాయి. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని కేంద్ర హోం శాఖ ఏటా రెండు సార్లు ఈ పోలీసు పతకాలను ప్రకటిస్తోంది.

తెలంగాణకు 29 మెడల్స్

రాష్ట్రపతి శౌర్య పతకం(పిఎంజి) తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యకు లభించింది.


గ్యాలంట్రీ (శౌర్య) మెడల్స్ (జీఎం) సునీల్ దత్ (ఎస్‌పి), మోరా కుమార్ (డిప్యూటీ అసాల్ట్ కమాండర్ / రిజర్వ్ ఇన్స్పెక్టర్), శనిగరపు సంతోష్ (అసిస్టెంట్ అసాల్ట్ కమాండర్ / రిజర్వ్ సబ్-ఇన్‌స్పెక్టర్), అమిలి సురేష్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్), వెల్మల వంశీ (జూనియర్ కమాండో /పోలీస్ కానిస్టేబుల్), కంపాటి ఉపేందర్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్), పాయం రమేష్ (జూనియర్ కమాండో / పోలీస్ కానిస్టేబుల్)కు దక్కాయి.

విశిష్ట సేవ కోసం రాష్ట్రపతి మెడల్స్ (పిఎస్ఎం) సంజయ్ కుమార్ జైన్ (ఎడిజి), కటకం మురళీధర్ (డిసిపి), ఫైర్ సర్వీస్ విభాగంలో వెంకటేశ్వర్లు కందిమల్ల (డ్రైవర్ ఆపరేటర్)కు దక్కాయి.

మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఎంఎస్ఎం) అవినాష్ మొహంతి (పోలీస్ కమీషనర్), సయ్యద్ జమీల్ బాషా (కమాండెంట్), పి. కృష్ణమూర్తి (ఎఎస్‌పి), కొమరబత్తిని రాము (ఎస్ఐ), అబ్దుల్ రఫీక్ (ఎస్ఐ), ఇక్రమ్ అబ్ ఖాన్ (ఎస్ఐ), శ్రీనివాస మిశ్రా (ఎస్ఐ), కుంచాల బాలకాశయ్య (ఎస్ఐ), లక్ష్మయ్య (ఎఎస్ఐ), గుంటి వెంకటేశ్వర్లు (ఎఎస్ఐ), నూతలపాటి జ్ఞాన సుందరి (ఇన్‌స్పెక్టర్), ఫైర్ సర్వీస్ విభాగంలో మాధవరావు తెలుగు (లీడింగ్ ఫైర్‌మెన్), వాహెదుద్దీన్ మహ్మద్ (లీడింగ్ ఫైర్‌మెన్), హోంగార్డ్ విభాగంలో లక్ష్మి బందోళ్ల (ఉమెన్ హోం గార్డ్), మల్లేష్ మేడిపల్లి (హోం గార్డ్), కవిత ఇంటూరి (ఉమెన్ హోం గార్డ్), గాలయ్యా నమల (హోం గార్డ్), సుమలత ఎనుముల (ఉమెన్ హోం గార్డ్) దక్కాయి.

స్వరాజ్యం కోసం సాగిన సుదీర్ఘపోరాటంలో పరోక్షంగా, ప్రత్యక్షంగా పాల్గొన్న మహిళలెందరో. పాలక పక్షాలకు వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణకు దిగిన వారికి ప్రతిఫలంగా పలురకాల శిక్షలు లభించాయి. భారత జాతీయోద్యమానికి సహాయ, సహకారాలు అందించి ప్రపంచానికి తెలియకుండా ఉండిపోయిన ఆడపడుచులు ఎందరో. ఆ తల్లుల త్యాగాలు ఎంత శ్లాఘనీయమైనవైనా అధికారిక చిట్టాలకెక్కి అక్షరరూపం ధరించక పోవడంతో వారి వివరాలు తర్వాతి తరానికి అందుబాటులో లేకుండా పోయాయి. ప్రత్యక్ష పోరులో శిక్షలకు గురైన వారి వివరాలు మాత్రం ఆనాటి ప్రభుత్వ, పోలీసుల రికార్డులలో నిక్షిప్తమై ఉన్నందున కొంతలో కొంత ఆ యోధురాండ్ర సమాచారం లభ్యం అవుతుంది. ఈ విధంగా ప్రభుత్వ, పోలీసు రికార్డుల ఆధారంగా తయారైన గ్రంథాలలో స్థానం పొందిన తెంగాణ రాష్ట్రానికి చెందిన ముస్లిం మహిళా యోధులు కొందరు. ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారి పరిచయం క్లుప్తంగా నేటి మానవిలో...

స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ ముస్లిం మహిళా యోధులు



సేకరణ: సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన 'భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ ముస్లిం యోధులు' పుస్తకం నుండి

తెలంగాణ ప్రజాపోరుకు తోడ్పడిన మోధురాలు



రజియా బేగం... 1916లో హైదరాబాద్ సంస్థానంలో జన్మించారు. ఆమె తల్లిది హైదరాబాద్ కాగా, తండ్రి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. నైజాం సంస్థానంలో ఈయన న్యాయాధికారి. తల్లిదండ్రులిచ్చిన స్వేచ్ఛతో రజియా తన అన్నదమ్ములతో పాటు చిన్ననాటనే స్వతంత్రభావనలు అలవర్చుకున్నారు. నిగార్ ఉర్దూ పత్రికను రహస్యంగా చదువుతూ చైతన్యం పొందారు. తమీర్ అనే గోడ పత్రికను ప్రారంభించారు. చిన్న చిన్న కథలు కూడా రాసేవారు. స్వయం కృషితో విద్యనభ్యసించిన రజియా తనకు నచ్చని ఆచారాలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. బజ్మే ఏహ బాబ్ అనే సంస్థను స్థాపించి అనేక సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అన్నదమ్ములతో కలిసి జాతియోధ్యమంలో భాగమయ్యారు. తర్వాత కమ్యూనిస్టు పార్టీవైపు మొగ్గుచూపి కార్యక్రమాల్లో పాల్గొనేవారు. నిషేధంలోనూ పార్టీకి అండగా నిలబడ్డారు. అనేక కష్టాలు అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం కోరుతూ జరిగిన పోరాటంలో తన వంతు పాత్ర పోషించారు. పోరాటం విరమించిన తర్వాత ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. 1966లో యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో చేరారు. పర్షియన్ పీహెచ్‌డీ ఇరాన్‌లో చేశారు.

తొలి మహిళా మంత్రిగా...



మసుమా బేగం... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి మహిళా మంత్రి, తొలి ముస్లిం మంత్రి, మొత్తం భారత దేశంలోనే మంత్రి పదవిని చేపట్టిన తొలి ముస్లిం మహిళ అయిన ఈమె 1902 అక్టోబర్ 7న హైదరాబాద్‌లో జన్మించారు. తల్లి తయ్యిబా బేగం, తండ్రి ఖదీప్ జంగ్. విద్యావంతురాలు, సంఘసేవకురాలైన తల్లి ద్వారా ఈమె ప్రభావితమయ్యారు. తయ్యిబా పత్రికల్లో వ్యాసాలు, నాలుగు నవలలు కూడా రాశారు. తండ్రి వైద్యశాఖలో ఉప డైరెక్టర్‌గా చేశారు. ఈమె కుటుంబం మొత్తం రాజకీయ నేపథ్యం కలిగిందే. మాసుమా 9 ఏండ్ల వయసులో లేడి హైదరి క్లబ్‌లో సభ్యురాలిగా చేరి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు విద్యావ్యాప్తికి నడుం కట్టారు. 1921లో విద్యావ్యాప్తి కోసం అంజుమన్- యే- ఖవాతీన్ సంస్థకు అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. 1927లో అఖిల భారత మహిళా సంస్థ హైరదాబాద్ నగర శాఖ ఏర్పాటు చేసి పలు బాధ్యతలను నిర్వహించారు. లండన్ ఉమెన్స్ కాన్ఫెరెన్స్ అహ్వానం మీద లండన్ వెళ్లారు. జాతీయోద్యమంలో భాగంగా ఉనికిలోకి వచ్చిన పలు సంఘాలలో ఆమె సభ్యురాలయ్యారు. 1952లో షాలిబండ నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలిచారు. తర్వాత మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంచి వక్త, కార్యదక్షురాలుగా ఖ్యాతిగాంచిన మాసుమా బేగం అఖిల భారత మహిళా సంస్థ నేతగా అనేక దేశాలు కూడా పర్యటించారు.

విలీనోద్యమంలో జైలుకెళ్లీ...



నఫీస్ ఆయేషా బేగం.. హైదరాబాద్‌కు చెందిన స్వాతంత్ర్య సమర వీరుడు జనాబ్ హమీద్ ఆలీఖాన్ కుమార్తె. తండ్రి ప్రభావంతో ఆమె హైదరాబాద్ కేంద్రంగా సాగిన జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక ఇండియన్ యూనియన్లో చేరడానికి నిరాకరించిన నైజాం సంస్థానాధీశుల పట్ల నఫీస్ నిరసన వ్యక్తంచేశారు. నైజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని, నైజాం నివాసులంతా భారతదేశ పౌరులుగా పరిగణించబడాలని ఆమె ఆకాంక్షించారు. దీని కోసం జరిగిన ఉద్యమంలో భాగం పంచుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగా సాగిన ఆ ఉద్యమం జాతీయోద్యమ చరిత్రలో విలీనోద్యమంగా పరిగణించబడింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న నఫీస్‌ను 1948, సెప్టెంబర్16న అరెస్టు చేసి హైదరాబాద్ సెంట్రల్ జైలులో నిర్బంధించాయి. చివరకు నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. ఆ స్వాతంత్ర్య సమరయోధురాలు, విలీనోద్యమకారిణి పూర్తి వివరాలు తెలియలేదు. ప్రముఖ చరిత్ర పరిశోధకురాలు డాక్టర్ సరోజిని రేగాని సంపాదకత్వంలో WHO'S WHO OF FREEDOM STRUGGLE IN ANDHRA PRADESH శీర్షికతో 1978లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన ప్రథమ సంపుటంలో ఆమె స్థానం పొందింది. ఈ విధంగా ఆ సంపుటంలో స్థానం పొందగలిగిన ఏకైక ముస్లిం మహిళ నఫీస్ అయేషా బేగం కావడం విశేషం.

ప్రజా పోరాటాలకు బాసటగా నిలిచిన యోధురాలు

జమాలున్నీసా బాజి... ఇండియన్ యూనియన్‌లో నైజాం రాష్ట్రం విలీనం కోరుతూ సాగిన ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా ఆ క్రమంలో సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా ప్రజల పక్షం వహించిన ముస్లిం మహిళా ఉద్యమకారులలో ఈమె ఒకరు. జమాలున్నీసా 1915లో హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి నైజాం సంస్థానంలో న్యాయాధికారి. కుటుంబంలోని పెద్దలు ఆచార సంప్రదాయాలు పాటించినా తల్లిదండ్రులు ఉదార స్వభావులు. తండ్రి నుంచి లభించిన స్వేచ్ఛతో భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగమయ్యారు. మతపరమైన ఛాందసాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. పెండ్లి తర్వాత ఆమె కొన్ని రోజులు ఇంటికే పరిమితం కావల్సి వచ్చింది. అప్పుడు కూడా పుస్తకాలు చదివేవారు. తర్వాత తిరిగి ఉద్యమంలో పాల్గొన్నారు. సాహిత్య సమావేశాలకు కూడా హాజరయ్యేవారు. కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులయ్యారు. 1946లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అన్ని రంగాల్లో సమానత్వం సమసమాజం ద్వారా మాత్రమే సాధ్యమని నమ్మిన ఆమె ఎంతో నిబద్ధతతో ముందుకు సాగారు. నిర్బంధంలోనూ పార్టీ కోసం పని చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన తర్వాత మహిళా సంఘం ఏర్పాటుకు కృషి చేశారు.



నిజాం గడ్డ మీద విదేశీవస్త్రాలను తగులబెట్టిని సాహసి



ఫక్రుల్ హాజియా హసన్... భారత స్వాతంత్ర్య సంగ్రామంలో స్వయంగా పాల్గొనడమే కాకుండా తన బిడ్డలను విముక్తిపోరాటం దిశగా ముందుకు సాగడానికి ప్రేరణగా నిలచిన తల్లులు అరుదుగా కన్పిస్తారు. జాతీయోద్యమంలో స్వయంగా పాల్గొనడంతో పాటు 'హైద్రాబాద్ హసన్ సోదరులు'గా విఖ్యాతిగాంచిన ముగ్గురు కుమారులను స్వాతంత్ర్య సమరయోధులుగా తీర్చిదిద్దిన ఈ తల్లి చరితార్థులయ్యారు. ఇరాన్ నుండి ఇండియా వచ్చి స్థిరపడిన కుటుంబానికి చెందిన హాజియా 1870లో జన్మించారు. ఉత్తరప్రదేశ్ నుండి హైదరాబాద్ వచ్చిన అమీర్ హసన్ను వివాహం చేసుకుని హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భర్త అమీర్ హసన్ హైదరాబాద్ సంస్థానంలో ఉన్నతాధికారి, ఆయన ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలను పర్యటిస్తున్నందున ఆమె కూడా ఆయా ప్రాంతాలలోని ప్రజల భాషల పట్ల అమితా సక్తి చూపుతూ ఉర్దూతోపాటు ఆంగ్లం, మరాఠీ, కన్నడ, గుజరాతీ, భాషలే కాకుండా తెలుగును కూడా నేర్చుకున్నారు. ఈ సందర్భంగా మహిళల దుస్థితిని గమనించిన ఆమె ముఖ్యంగా బాలికల అభ్యున్నతికి కృషి ఆరంభించారు. బాలికల లో విద్యాభివృద్ధికై పలు పాఠశాలలు పెట్టించడానికి కృషి సల్పారు. జాతీయోద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారు. 1920లో మహాత్ముని పిలుపు మేరకు హైదరాబాద్ నగరంలోని త్రూప్ బజార్లోని తమ నివాసంలో విదేశీ వస్త్రదహనం గావించారు. ఖిలాఫత్ -సహాయనిరాకరణ ఉద్యమాల లోనూ చురుకైన పాత్ర వహించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ యోధులు అరెస్టులకు గురైనప్పుడు వారి విడుదల కోసం సరోజినీ నాయుడి సహకారంతో ఎనలేని కృషి సల్పారు. నాయకులు అందరూ ఆమెను ఆప్యాయంగా 'అమ్మా జాన్' అని సంబోధించే వారు. ఈమె 1970లో కన్నుమూశారు.

మహిళలపై దాడుల నిరోధానికి కఠిన చట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

పాఠ్యాంశాల్లో అవసరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని సూచించారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై లైంగిక దాడి ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు చేపట్టిన నిరసనకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కతా ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. దేవతతో సమానమైన మహిళలు ఇప్పుడిప్పుడే బయటికి వస్తున్నారని చెప్పారు. వైద్యురాలిపై లైంగికదాడి హేయమైన ఘటన అంటూ అలాంటివి మహిళలను మళ్లీ మధ్య యుగాలకు తీసుకెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులకు తాము అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. తప్పు చేసిన వారు ఎవరైనా సరే..ఉపేక్షించకూడదని చెప్పారు. మహిళల భద్రత గురించి సమాజంలో ప్రతి ఒక్కరి ఆలోచన మారాలనీ, ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు కట్టుబడి పని చేస్తున్నట్టే మహిళల భద్రత కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం కషి చేయాలని కోరారు. మహిళలపై దాడులు చేస్తే కఠినాతి కఠినమైన శిక్షలు పడతాయన్న భయం, భక్తి ఉండాలనీ, అలా ఉన్నప్పుడే అఘాయిత్యాలు నివారించబడతాయని ఆమె అభిప్రాయపడ్డారు.

జీకేఆర్ వర్సెస్ ఏఎమ్ఆర్

(మొదటిపేజీ తరువాయి)

సమావేశానికి ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. రైతులకు రుణమాఫీ చేయడంలో రాష్ట్ర సర్కారు వైఫల్యం చెందిందని చెబుతూ 'ప్రశ్నిస్తున్న తెలంగాణ' అనే పేరుతో కిషన్‌రెడ్డి ప్రారంభించిన కార్యక్రమానికి ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. బీజేపీ శ్రేణులు, నాయకులు హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొనాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. అందులో భాగంగానే బీజేవైఎం ఆధ్వర్యంలో తలపెట్టిన బైకు ర్యాలీలో బీజేపీ సంస్థాగత కార్యదర్శి చంద్రశేఖర్‌జీ, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు మాత్రం ఆ కార్యక్రమానికి డుమ్మాకొట్టారు. రామారావు పాటిల్, పాల్వాయి హరీశ్‌బాబులను వెంటపెట్టుకుని సుంకిశాల ప్రాజెక్టు సందర్శనకు మహేశ్వర్‌రెడ్డి వెళ్లారు. మిగతావారు వారితో కలిసిపోలేదు. కరవమంటే కప్పకుకోపం..విడవమంటే పాముకు కోపం అన్న చందంగా పార్టీలో పరిస్థితి తయారు కావడంతో మిగతా ఎమ్మెల్యేలు మధ్యేమార్గంగా ఉంటున్నారు.

అసెంబ్లీలోనూ ఎవరికి వారే యమునా తీరే

రాష్ట్రంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించడంలోనూ, తమ పార్టీ వాయిస్‌ను ప్రజల్లోకి తీసుకుపోవడంలోనూ ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీని ఒక బలమైన వేదికగా చూస్తాయి. ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే విధంగా ప్రత్యేకంగా సన్నద్ధమై ఆయా పార్టీల సభ్యులు వస్తారు. కానీ, మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేల్లో అదేం కనిపించలేదు. అసెంబ్లీలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై రాష్ట్ర అధిష్టానంగానీ, ముఖ్య నాయకత్వంగానీ ఎలాంటి గైడ్‌లైన్స్ ఇవ్వకపోవడం వల్లనే ఇలా జరిగిందనే విమర్శ బాహాటంగానే వినిపిస్తున్నది. దీంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమకు అవకాశం వచ్చినప్పుడు ఎవరేం మాట్లాడారో అర్థం కాని పరిస్థితి. తమకు నిధులు ఇవ్వడం లేదనీ, తన నియోజకవర్గాన్ని మహారాష్ట్రలో కలిపేయాలని పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడటం వివాదాస్పదమైంది. గోదావరి నీళ్లన్నింటినీ దక్షిణ తెలంగాణకు తరలించుకుపోతున్నారనీ, ఉత్తర తెలంగాణకు తీరని అన్యాయం చేశారని మాట్లాడం చర్చనీయాంశమైంది. మరొక ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి నిధులన్నింటినీ దక్షిణ తెలంగాణకే తరలించుకుపోతున్నారనీ, ఉత్తర తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కొందరు ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డి సర్కారును మెచ్చుకుంటూ మాట్లాడటం కూడా కనిపించింది. అసెంబ్లీలో పార్టీ వాయిస్ అంటూ లేకుండా ఎవరికివారే యమునా తీరే అన్నట్టుగా మాట్లాడటంతో బీజేపీ పార్టీపై ప్రజల్లో వ్యతిరేక భావన పెరిగింది. మరోవైపు బీజేపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారనే చర్చ కోడై కూస్తున్నది. ఎవరు ఎటైనా పోనీ నా దారి నాదే..వచ్చామా? పోయామా? మిగతా ఎమ్మెల్యేలతో నాకేం సంబంధం? అన్నట్టుగా రాజాసింగ్ వ్యవహరిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే బీజేపీలో పాత, కొత్త నేతల మధ్య ఆధిపత్య పోరు స్టిల్ నౌ కొనసాగుతున్నదని ఇట్టే అర్థమవుతున్నది.

ఎమ్మెల్సీల నియామకాన్ని నియంత్రించలేం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి గవర్నర్ నామినేట్ చేయడాన్ని నియంత్రించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేమని పేర్కొంది. అయితే, తెలంగాణలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే తదుపరి నియామకాలు ఉండాలని పేర్కొంది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ శాసనమండలికి సభ్యులను గవర్నర్ నామినేట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేలతో కూడిన ధర్మాసనం విచారించింది. కోర్టు తుది ఆదేశాలు ఇచ్చే వరకూ హైకోర్టు ఆదేశాలపై స్టేటస్ కో ఇవ్వాలని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. అయితే, ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామనగా దీనికి సిబల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. "అభ్యంతరం ఎందుకు ? మీరు ఆదేశాలకు వ్యతిరేకంగా వచ్చారు కదా మేం స్టే ఇస్తాం"అని ధర్మాసనం ప్రశ్నించింది. అలా చేయడం వల్ల మళ్లీ నూతన సిఫారసులు చేసే అవకాశం ఉందని సిబల్ తెలిపారు. "శాసనమండలిలో పిటిషనర్ల నియామకాన్ని గవర్నర్ నిరాకరించినందున దావా వేయడానికి వారు అర్హులు. పిటిషనర్లను కాకుండా గవర్నర్ వేరే వారిని నియమించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేసిన ఇద్దరు వ్యక్తుల నియామక గెజిట్‌ను కూడా హైకోర్టు రద్దు చేసింది. ప్రస్తుతం అదే వ్యక్తుల్ని నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నం చేస్తోంది" అని సిబల్ వాదనలు వినిపించారు. స్టేటస్ కో ఇవ్వడం వల్ల ఉపయోగమేమీ లేదని జస్టిస్ విక్రమ్ నాథ్ తెలిపారు. ఇవ్వకపోతే కొత్త వారిని నియమించ డమో, దీనికి కాలపరిమితి అయిపోతుందనో లేదా ఇంకేదైనా చెబుతారని సిబల్ తెలిపారు. "మరిన్ని చెప్పనిద్దాం. మీకు పోటీగా మరింత మంది సీనియర్ న్యాయవాదులు ఉన్నారు కదా, వారిని కూడా రానిద్దాం. ఏం చెబుతారో చూద్దాం" అని విక్రమ్‌నాథ్ వ్యాఖ్యానించారు. సిబల్ పట్టుబడుతున్నారని యధాతథ స్థితి కొనసాగించాలంటే, ఎవరి ద్వారా అని జస్టిస్ విక్రమ్‌నాథ్ మళ్లీ ప్రశ్నించారు. గవర్నర్ ద్వారా అని సిబల్ సమాధానమివ్వగా, అలా అయితే హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తే ఏమవుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. తీర్పును నిలిపిస్తే మరో సమస్య వస్తుందని అప్పుడు పిటిషనర్‌ను నియమించాల్సి వచ్చే అవకాశం ఉంటుందని సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాలకు పిటిషనర్ వ్యతిరేకం కాబట్టి హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామని న్యాయమూర్తి తెలిపారు. అనంతరం "కోర్టు తుది ఉత్తర్వులు వచ్చే వరకూ హైకోర్టు తీర్పుపై స్టే అమలులో ఉంటుంది" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, గవర్నర్ మరొకరిని నియమిస్తారని సిబల్ పేర్కొనగా, దానిని ఆపలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. పిటిషనర్ నియామకం సరైనదే కాబట్టి నియంత్రిచొచ్చని సిబల్ పేర్కొనగా, దానికి న్యాయమూర్తి అంగీకరించలేదు. గవర్నర్ తాజా నామినేషన్‌ను కోర్టు ఆపలేదని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేస్తే ఆ నియామకంలో గవర్నర్ పాత్ర ఉండదని సుప్రీంకోర్టులో లార్జర్ బెంచ్ ముందు కేసు పెండింగ్‌లో ఉందని సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లి, కేసులో విజయం సాధిస్తే న్యాయంగా పిటిషనర్ అర్హుడని తెలిపారు. సిబల్ సూచనను మంజూరు చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం విచారణ పూర్తయ్యే లోపు చేసే ప్రతి నామినేషన్ తుది తీర్పునకు లోబడి ఉండాలని ధర్మాసనం ఆదేశాలను సవరించింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని తదుపరివిచారణ వాయిదా వేసింది.

రాష్ట్రాలకే రాయల్టీ హక్కు

(మొదటిపేజీ తరువాయి)

భూములు, క్వారీలపై పన్ను విధించే రాష్ట్రాల అధికారాన్ని సమర్థించింది.

ఖనిజాలపై పన్ను విధించడంపై కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదాన్ని పరిష్కరించింది. ఫెడరలిజం పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా పన్నులు విధించే రాష్ట్రాల హక్కులను రక్షించాలని సుప్రీం కోర్టు ధర్మాసనం నొక్కి చెప్పింది. దీంతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైంది.

ఖనిజాలు, ఖనిజ నిక్షేపాలు గల భూములపై రాయల్టీ విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని 1989లో సుప్రీంకోర్టు తీర్పు తేల్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ కొన్ని రాష్ట్రాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్‌సి శర్మ జస్టిస్ ఎజి మసిహ్‌తో కూడిన తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గనులు, ఖనిజాలపై రాయల్టీ విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని, కేంద్రానికి ఆ హక్కు లేదని జులై 25న 8-1 మెజారిటీతో తీర్పు ఇచ్చింది.

అయితే, ఈ తీర్పును 1989 నుంచి వర్తింపజేయాలని, గనులు, ఖనిజాలపై అప్పటి నుంచి కేంద్రం నుంచి విధించిన రాయల్టీ సొమ్మును వాపస్ ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. దీన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. రాయల్టీ వాపస్ ఇస్తే ఒక్క ప్రభుత్వ రంగ కంపెనీలే రూ. 70 వేల కోట్లు తిరిగి చెల్లించాల్సి వస్తుందని, అలా చేయడం ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లకు తీరని దెబ్బ అవుతుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకు తెలిపారు. అంతేగాక.. ఖజానా ఖాళీ అయి, పౌరులపై అధిక ధరల భారం పడుతుందని వివరించారు. తీర్పును గత నెల 25 నుంచి వర్తింపజేయాలని అభ్యర్థించారు.

దీనిపై ఇటీవల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. తాజాగా కేంద్రం అభ్యర్ధనను తిరస్కరిస్తూ తాజా ఉత్తర్వులు వెలువరించింది. ఈ తీర్పుతో ఒడిశా, జార్ఖండ్, బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది.

తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ నుంచి రాజ్యసభ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ ఉప ఎన్నికలో అభిషేక్ మను సింఘ్వీని బరిలో నిలపాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయించారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం కెసి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్‌కు ఉన్న బలం బట్టీ అభిషేక్ మను సింఘ్వీ ఎన్నిక లాంఛనమే.తెలంగాణ నుంచి తనను రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంపై అభిషేక్ సింఘ్వీ ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు ఆ పార్టీలోని సీనియర్లందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో హిమాచల్‌ప్రదేశ్ నుంచి అభిషేక్ మను సింఘ్వీ రాజ్యసభకు వెళ్లారు. ఆయన పదవి కాలం ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగియడంతో మళ్లీ హిమాచల్ ప్రదేశ్ నుంచే పోటీ చేశారు. అయితే అక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే హ్యాండ్ ఇచ్చారు. కాంగ్రెస్, స్వతంత్ర ఎమ్మెల్యే బీజేపీకి ఓటు వేశారు. దీంతో ఆ ఎన్నికలో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. హిమాచల్‌ప్రదేశ్‌లో భంగపడిన అభిషేక్ మను సింఘ్వీ, తెలంగాణలో బయటపడనున్నారు.

ప్రపంచంతోనే పోటీ

(మొదటిపేజీ తరువాయి)

వారిలో 57 వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని వివరించారు. దానిలోనూ 39 శాతం మంది మహిళలే ఉన్నారని చెప్పారు. హైదరాబాద్‌తో తమది వ్యూహాత్మకమైన పెట్టుబడి అనీ, స్థానికంగా ప్రతిభావంతులైన యువతకు ఉపాధి కల్పిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఎంఎల్, డేటా ఇంజినీరింగ్, ఐవోటీలో కట్టింగ్ ఎడ్జ్ సమస్యలకు ఈ కేంద్రం పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎం బృందానికి ఘన స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులున్న సంగతి విదితమే. అమెరికా, దక్షిణ కొరియాల్లో పర్యటించిన వచ్చిన వీరికి పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

కోల్‌కతా హత్యాచార ఘటనపై దర్యాప్తు షురూ

కోల్‌కతా : ఆర్జీ కార్ మెడికల్ కాలేజీని సందర్శించిన సీబీఐ, ఎఫ్ఎస్-ఎల్ బృందం దేశవ్యాప్తంగా కలకలం రేపిన కోల్‌కతా ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసును హైకోర్టు ఆదేశాలతో సీబీఐకి అప్పగించడంతో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టింది. దర్యాప్తు బాధ్యతను స్వీకరించిన వెంటే సీబీఐ ఢిల్లీ నుంచి ప్రత్యేక వైద్య, ఫోరెన్సిక్ బృందాన్ని ఘటనా ప్రాంతానికి పంపింది. ఇక కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసు దేశ వ్యాప్తంగా పెనుదుమారం రేపుతున్నది. ఈ కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఘటన జరిగి ఐదు రోజులు అయినప్పటికీ, దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నది. కేసు డైరీని సాయంత్రంలోగా, ఇతర డాక్యుమెంట్లను బుధవారం ఉదయం 10 గంటల్లోగా సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది.ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందించారు. నిర్భయ ఘటన అనంతరం కఠిన చట్టాలు తీసుకురావడంతో పరిస్థితి మెరుగుపడుతుందని అనిపించినా, కథువా, ఉన్నావ్, హత్రాస్, లలిత్ పూర్ వంటి ఘటనలు దిగ్భ్రాంతి కలిగించాయని, దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు వెలుగుచూడటం విచారకరమని అన్నారు. కోల్‌కతా ఘటన దారుణ ఉదంతమని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్లు ప్రజలను ఆరోగ్యంగా ఉండేలా శ్రమిస్తుంటే మనం వారి భద్రతను కాపాడలేకపోతున్నామని వ్యాఖ్యానించారు.

మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

(మొదటిపేజీ తరువాయి)

తెలపాలని కోరుతూ కేసు విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇటువంటి "ప్రత్యేక అరెస్టును బీమా అరెస్టు అని పిలుస్తారు. 2023 ఏప్రిల్ లో కేజ్రీవాల్‌ను సీబీఐ విచారించిన తర్వాత, ఈ ఏడాది మార్చిలో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) ఆయనను అరెస్టు చేసింది. ఈడీ కేసులో బెయిల్ ఆదేశాలు కూడా పొందారు. మరికొన్ని గంటల్లో విడుదలకానున్న సమయంలో సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ అరెస్టుకు ఎలాంటి కారణం లేదని, మే 10న మనీలాండరింగ్ నిరోధక కేసు (పీఎమ్ఎల్ఏ)లో ఆయనకు మధ్యంతర బెయిల్ లభించింది. తర్వాత జూలైలో సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర బెయిల్ లభించింది. సీబీఐ కేసులో కింది కోర్టు కూడా బెయిల్ మంజూరు చేసింది. ఇలా మూడు బెయిల్ ఆదేశాలు పొందారు" అని సింఘ్వి అన్నారు.

ఐరాసలో భారత రాయబారిగా పర్వతనేని హరీశ్

(మొదటిపేజీ తరువాయి)

ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన హరీశ్.. ప్రస్తుతం జర్మనీలో భారత రాయబారిగా పనిచేస్తున్నారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. రుచిరా కాంభోజ్ జూన్‌లో పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే.2021 నవంబర్ 6న జర్మనీలో భారత రాయబారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. అప్పట్నుంచి ఆ పదవిలోనే కొనసాగుతున్నారు. అంతకముందు వివిధ పనిచేశారు. పర్వతనేని హరీశ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. గోల్డ్‌మెడల్ కూడా సాధించారు. ఆ తర్వాత ఆయన ఐఐఎం కలకత్తాలో విద్యనభ్యసించారు. ఆయనకు భార్య నందిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కేరళకు హై అలర్ట్

తిరువనంతపురం : కేరళ అంతటా రానున్న 72 గంటల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతవరణ శాఖ (ఐఎండీ) బుధవారం హెచ్చరించింది. రాష్ట్రంలో కొన్ని ఎంపిక చేసిన జిల్లాలకు ఐఎండి ఆరెంజ్, ఎల్లో అలర్ట్ ప్రకటించగా, రాష్ట్రంలోని మొత్తం 14 జిల్లాలను రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లో ఉంచుతున్నట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. వయనాడ్ విపత్తును దృష్టిలో ఉంచుకుని . కేరళ ప్రభుత్వం పలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంది. హైరేంజ్‌లు, కొండ ప్రాంతాలను నిశితంగా పర్యవేక్షించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున వాయనాడ్ జిల్లాలోని పుత్తుమలలో నివాసితులను ముందస్తు జాగ్రత్తగా సహాయక శిబిరానికి తరలించినట్లు తెలిపారు.



అంచనాలను అందుకోని భారత్

- ఆరు పతకాలకే పరిమితం
- ఒలింపిక్స్‌లో సత్తా చాటినా పతకాలు చేజారే..

పారిస్ : 2024 పారిస్ ఒలింపిక్స్‌కు 117మంది అథ్లెట్లతో వెళ్లిన భారత బృందం టోక్యో ఒలింపిక్స్‌లో సాధించినన్ని పతకాలు కైవసం చేసుకోవడంలో విఫలమైంది. టోక్యోలో ఏడు పతకాల రికార్డును అధిగమించడం ఖాయమని తొలుత భావించినా... అది సాధ్యం కాలేదు. దీంతో భారత్ కేవలం ఆరు పతకాలకే పరిమితమై 71వ స్థానంలో నిలిచింది. టోక్యో జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణ పతకం సాధించిన నీరజ్ చోప్రా ఈ ఒలింపిక్స్‌లో ఆ ఫీట్‌ను సాధించలేకపోయాడు. దీంతో అతడు రజత పతకానికే పరిమితం కాగా.. పాకిస్తాన్‌కు చెందిన అర్షాద్ నదీమ్ ఏకంగా 72.97మీ. జావెలిన్ విసిరి రికార్డు పుటల్లోకెక్కి స్వర్ణ పతకాన్ని అందుకున్నాడు. నీరజ్ చోప్రాతో పాటు పురుషుల హాకీ జట్టుకు మెరుగైన పతకం దక్కాల్సింది. అలాగే రెజ్లింగ్‌లో వినేశ్ ఫోగాట్‌కు పతకం దక్కినా.. బ్యాడ్మింటన్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో భారత్‌కు పతకాలు దక్కాల్సింది. ఈ ఒలింపిక్స్‌లో భారత్ ఒక్క స్వర్ణ పతకం అయినా సాధించి ఉంటే పతకాల పట్టికలోనూ భారత్ 50 స్థానాలలోపు నిలిచేది. కానీ అలా జరగలేదు. భారత ఒలింపిక్ సంఘం(ఐఓఎ) అధ్యక్షురాలు పిటి ఉష కూడా ఒలింపిక్స్ ప్రారంభానికి ముందు టోక్యో ఒలింపిక్స్‌లో సాధించిన పతకాల రికార్డును ఈసారి బ్రేక్ చేయడం ఖాయమని ఊహించినా.. అది సాధ్యం కాలేదు. టోక్యోలో ఒక స్వర్ణం, రెండు రజతాలు, నాలుగు కాంస్యాలతో సహా ఏడు పతకాలతో భారత్ ఏకంగా 48వ స్థానంలో నిలువగా.. ఈసారి 71వ స్థానానికే పరిమితమైంది. ఈ ఒలింపిక్స్‌లో 209 దేశాల ప్రాతినిధ్యం వహించగా.. కేవలం 84దేశాలకే పతకాలు దక్కాయి. 1984లో లాజ్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో మహిళల 400మీ. హార్డిల్స్‌లో పిటి ఉషకు సెకను తేడాతో కాంస్య పతకాన్ని చేజార్చుకోగా.. ఈసారి ఆమె భారత బృందానికి ఐఓఎ సభ్యురాలిగా ఉన్నారు.



వీరికి పతకాలు దక్కితే...

గత ఒలింపిక్స్‌లో మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 50కిలోల కేటగిరీలో రజత పతకం సాధించిన మీరాభాయి ఛాను.. పారిస్ ఒలింపిక్స్‌లో కేవలం ఒక కిలో బరువును ఎత్తలేక కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. ఆ ఒలింపిక్స్‌లో స్నాచ్‌లో 87కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 115కిలోల బరువుతో సహా మొత్తం 202 కిలోల బరువును ఎత్తిన ఛాను.. పారిస్‌లో ఆ స్థాయి బరువును ఎత్తడంలో విఫలమైంది. 2024లో ఛాను.. మొత్తం 199కిలోల బరువును మాత్రమే ఎత్తగల్గింది. దీంతో ఖాంబో(థాయ్‌లాండ్) 200కిలోల బరువును ఎత్తడంతో ఆమెకు కాంస్య పతకం ఖాయమైంది.

ఆర్చరీలోనూ నిరాశే..

ఆర్చరీ విభాగంలో భారత్‌కు ఎక్కువ పతకాలు వస్తాయని ఆశించినా ప్రయోజనం లేకపోయింది. ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర, తరుణ్ దీప్ రాయ్, ప్రవీణ్ జాధవ్ 3వ సీడ్‌కు ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వీరు క్వార్టర్‌ఫైనల్లో 6వ సీడ్ టర్కీ చేతిలో ఓటమిపాలయ్యారు. వ్యక్తిగత విభాగంలో ధీరజ్ షూట్ ఆఫ్‌లో ఓటమిపాలవ్వగా.. మిక్స్‌డ్ విభాగంలో ధీరజ్ బొమ్మదేవర-అంకిత భకత్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరి పతక రేసుకు దగ్గరల్లో నిష్క్రమించారు. స్టార్ మహిళా దీపిక కుమారి వ్యక్తిగత విభాగంలో క్వార్టర్‌ఫైనల్‌కు పతకానికి చేరి పతకంపై ఆశలు రేపినా సెమీస్‌కు చేరడంలో విఫలమైంది.

స్కీట్‌లో ఒక్క పాయింట్‌తో..

స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పతక పోరులో భారత్ ఒక్క పాయింట్ తేడాతో పతకం కోల్పోయింది. భారత షూటర్లు మహేశ్వరి చౌహాన్, అనంత్‌జీత్ సింగ్ ద్వయం 43-44 చైనా జోడి జియాంగ్, జియాన్లిన్ చేతిలో ఓడింది.ఇక పురుషుల సింగిల్ స్కల్స్‌లో బల్‌రాజ్ పన్వార్ 4వ స్థానంలో నిలిచి త్రుటిలో పతకాన్ని చేజార్చుకున్నాడు.

కౌంటీల్లో చాహల్ మాయ

తొలి మ్యాచ్‌లోనే ఐదు వికెట్లు

లండన్ : ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ చెలరేగాడు. ఇంగ్లండ్ డొమెస్టిక్ వన్డే కప్‌లో నార్తంప్టన్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న చాహల్.. ఈ కౌంటీ తరఫున ఆడిన తొలి మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టాడు. కెంట్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో చాహల్ మాయాజాలం ధాటికి తొలుత బ్యాటింగ్ చేసిన కెంట్ 35.1 ఓవర్లలో 82 పరుగులకు కుప్పకూలింది. చహల్ 10 ఓవర్లలో కేవలం 14 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఐదు మెయిడిన్ ఓవర్లు ఉండటం విశేషం.



చాహల్‌తో పాటు జస్టిన్ బ్రాడ్ (6.1-1-16-3), లూక్ ప్రోక్టర్ (10-2-25-2) కూడా రాణించడంతో కెంట్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆ జట్టు తరఫున జేడెన్ డెన్లీ (22), ఏకాంశ్ సింగ్ (10), మ్యాట్ పార్కిన్సన్ (17 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. అనంతర 83 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన నార్తంప్టన్‌షైర్ 14 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. పృథ్వీ షా 17 పరుగులు చేసి ఔట్ కాగా.. జేమ్స్ సేల్స్ 33, జార్జ్ బార్లెట్ 31 పరుగులతో అజేయంగా నిలిచారు. బేయర్స్ స్వేన్ పోయెల్‌కు పృథ్వీ షా వికెట్ దక్కింది. కాగా, చాహల్ ఈ మ్యాచ్‌తో పాటు ఐదు కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లు ఆడేందుకు నార్తంప్టన్‌షైర్‌తో ఒప్పందం చేసుకున్నాడు. నార్తంప్టన్‌షైర్ ఈ మ్యాచ్‌లో గెలిచినా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించలేదు. ఇంగ్లండ్ డొమెస్టిక్ వన్డే కప్‌లో గ్రూప్ దశ మ్యాచ్‌లు నేటితో ముగిసాయి. 16 నుంచి క్వార్టర్ ఫైనల్స్, 18న సెమీస్, సెప్టెంబర్ 22న ఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

నవచిత్రం

సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే తంగలాన్



విక్రమ్

విక్రమ్ విలక్షణ నటనకు చిరునామా. ఆయన నటించిన శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి తదితన చిత్రాలెన్నో నటుడిగా ఆయన ప్రత్యేకతను చూపించాయి. ఎప్పటికప్పుడు సరికొత్తగా ప్రేక్షకుల్ని అలరించే ఆయన 'తంగలాన్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందించారు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు (గురువారం) వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో హీరో విక్రమ్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

నేను నటించిన శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ వంటి మూవీస్ లాగే తంగలాన్ ఒక డిఫరెంట్ మూవీ. ఇదొక ఎమోషనల్ మూవీ. రా కంటెంట్‌తో ఉంటుంది. ఈ స్క్రిప్ట్ చేసిన తర్వాత రంజిత్ ఒక ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాడు. సినిమా గ్రామర్ పాటించని సినిమా ఇది. పాటలు, ఫైట్స్, ఇంటర్వెల్ బ్లాక్, క్లైమాక్స్ ఇలా పా.రంజిత్ డిజైన్ చేయలేదు. ఈ సినిమా నాకొక బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్.

నేను ఇప్పటిదాకా ఇలాంటి మూవీ చేయలేదు. ఇంత కష్టపడి చేయలేదు. దానికి కారణం..మా డైరెక్టర్ పా.రంజిత్. ఆయన నా దగ్గరకు ఒక కమర్షియల్ కథ తీసుకురాలేదు. పా.రంజిత్ కెరీర్‌లో కమర్షియల్ మూవీస్‌తో పాటు ఆర్టిస్టిక్ మూవీస్ చేస్తూ బ్యాలెన్స్‌గా కెరీర్ సాగిస్తున్నారు. తన సినిమాలతోనే దర్శకుడిగా ఆయన ఐడియాలజీ, స్పెషాలిటీ చూపించారు. పా.రంజిత్ చేసిన గొప్ప సినిమాల్లో తంగలాన్ ఒకటి అవుతుంది.

ప్రేక్షకుల్ని తంగలాన్ తన ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. జ్ఞానవేల్ నాకు ఇలాంటి మంచి సినిమా ఇచ్చినందుకు థ్యాంక్స్. ఇది మా కాంబినేషన్‌లో ఫస్ట్ మూవీ. ఇందులో రెండు క్యారెక్టర్స్ చేశాను. క్యారెక్టర్స్‌లో సహజంగా కనిపించేందుకు శారీరకంగా చాలా శ్రద్ధ తీసుకున్నాను.

ఇదొక బ్యూటిఫుల్ అడ్వెంచరస్ మూవీ. డైరెక్టర్ రంజిత్ తన ఆర్ట్ ఫామ్‌లో అందంగా రూపొందించాడు. మీకు సర్‌ప్రైజ్‌గా ఉండాలని సినిమా గురించి ఏమీ రివీల్ చేయడం లేదు. ఈ సినిమాలో అడ్వెంచర్, మెసేజ్, మ్యాజిక్, ఎమోషన్స్ ఉన్నాయి. ఇది పాన్ ఇండియా కాదు వరల్డ్ స్టేజీ మీదకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు జ్ఞానవేల్ రాజా.మీరు థియేటర్స్‌కు వచ్చినప్పుడు తప్పకుండా ఈ కంటెంట్‌తో కనెక్ట్ అవుతారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 15-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 180 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.